నవంబర్
2016

127

సంపుటి : 11 సంచిక : 6 వెల రు. 10 /-


## ఈ సంచికలో........

అక్టోబర్ విప్లవం మానవజాతి కొత్త బాట
సమిష్టి నిర్ణయం వ్యక్తిగత బాధ్యత
సోషలిస్టు ప్రభుత్వ తక్షణ కర్తవ్యాల పై లెనిన్
ఆవుమాంసం అంటరానితనం
బాలకార్మిక చట్టసవరణలో లోపాలు
గుజరాత్ అభివృద్ధి నమూనా
అర్ధరాత్రి అమానుషత్వం
ఉమ్మడి పౌరస్మృతి ముస్లీంలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు
కమ్యూనిస్టు ఉద్యమనేత కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు

శత జయంతి నివాళి

# కమ్యూనిస్టుఉద్యమ నేత

# కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు



**యు రామకృష్ణ**

నిరాడంబరత, నమ్రత ఆయన ఆహార్యం.. నిస్వార్థత, నీతి నిజాయితీలు ఆయన ఆభరణాలు.. అలజడి ఆయన జీవితం.. ఆందోళన ఆయన ఊపిరి.. విప్లవం ఆయన జీవితపథం.. బాల కాంగ్రెస్ కార్యకర్తగా పిల్లల జైల్లో పడేసినా.. స్వాతంత్ర్య సమరయోధుడుగా పోలీసులతో దెబ్బలు తిన్నా.. కమ్యూనిస్టుగా ఎన్నోసార్లు కఠోర జైలు శిక్షలు అనుభవించినా.. శ్రామిక ప్రజల ప్రయోజనం కోసం జీవితాంతం అలుపెరగని కృషి చేసిన మహోన్నతుడయన. రాష్ట్ర ప్రజాతంత్ర ఉద్యమ తొలితరం నాయకుల కోవకు చెందిన మహనీయుడాయన. లెక్కలేనన్ని రైతాంగ, వ్యవసాయ కార్మిక పోరాటాలు చేసి ఆయా తరగతులకు సాధించి పెట్టిన ఫలాలు అభ్యుదయం, విప్లవం కోరుకునే వారెవరికైనా ఎనలేని ఉత్తేజాన్నీ, స్ఫూర్తినీ నింపుతాయి. ఆ ఆదర్శనేతే కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు. ఆయన శత జయంతి సందర్భంగా ఈ వ్యాసం ప్రత్యేకం.

కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆత్కూరు లో 1915లో వెంకటకృష్ణయ్య, లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. వారి నలుగురు సంతానంలో అన్నే పెద్దవారు. తండ్రి.. బ్రిటీషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం జరిగే జాతీయోద్యమంలో పాల్గొనాలని అందరినీ ప్రోత్సహిస్తుండేవారు. అన్నేకు 12 ఏళ్ల వయసప్పుడు వారి కుటుంబం ఆత్కూరు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు మారింది. అన్నే ఏలూరులోని గాంధీ స్కూల్లో చదివారు. ఎనిమిదో తరగతి చదువుతుండగా గాంధీ పిలుపునకు స్పందించి తండ్రి ప్రోద్బలంతో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అప్పటికాయన వయసు 15 సంవత్సరాలే.

రైతు నాయకుడు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి ఏలూరు సత్యాగ్రహ శిబిర వాలంటీరు దళానికి నాయకుడుగా ఉండేవారు. ఆ శిబిరంలోనే పుచ్చలపల్లి సుందరయ్య, ఉద్దరాజు రామం వంటివారు ఉన్నా అన్నేకు పరిచయం లేదు. సత్యాగ్రహ శిబిరంలో కొమ్మారెడ్డిసహా అందరినీ అరెస్టు చేశారు. బాలుడైన అన్నేను చెంగల్పట్టు జైలులోని పిల్లల విభాగంలో పెట్టారు. తొమ్మిది నెలలపాటు జైలు శిక్ష అనుభవించారు. బాలఖైదీ కావడంతో విడుదల సమయంలో అన్నేను బందరు (నేటి మచిలీపట్నం) కలెక్టరుకు అప్పగించారు. అంతకుముందు కొన్నాళ్ల కిందట విడుదలై వచ్చిన కొమ్మారెడ్డి.. బందరు వెళ్లి అన్నేను తీసుకొని సత్రంపాడులోని తల్లిదండ్రులకు అప్పగించారు. అలా.. అన్నే స్వాతంత్ర్య సమర యోధుడయ్యారు. జైలులో ఆయన ఆరోగ్యం, ముఖ్యంగా కళ్లు దెబ్బతిన్నాయి. విడుదలయ్యాక బాపట్లలోని ప్రకృతి ఆశ్రమంలో చేరి వైద్య సేవలు పొంది కొంత స్వస్థత చెందారు. అన్నే అంతకుముందు సుందరయ్యను ఏలూరు ఉప్పు సత్యాగ్రహ శిబిరంలో చూసినా జైల్లోనే ఆయనతో పరిచయమేర్పడింది.

జైలు నుంచి విడుదలయ్యాక చింతలపూడి తాలూకాలో రైతాంగ సమస్యలపై నెక్కలపు వీరయ్యగారిని తోడు చేసుకొని కొమ్మారెడ్డి నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. ఆ తరువాత ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ కొమ్మారెడ్డి, చలసాని వాసుదేవరావు బృందం చేపట్టిన చారిత్రాత్మక రైతు రక్షణ యాత్రలో ఏలూరు తాలూకాలో పాల్గొని తమ్మిలేరు డ్యాము, తదితర సమస్యలపై వినతిపత్రాలు తయారు చేసి నేతలకు అందజేశారు.

తర్వాత కాలంలో కొమ్మారెడ్డి ఆదేశంతో అన్నే కొందరు మిత్రులతో కలిసి ఏలూరు తాలూకాలోని పలు గ్రామాల్లో జమీందారీ విధానం రద్దు కోసం ఆందోళనలు చేశారు. ఆ సందర్భంగా అన్నే.. కొమ్మారెడ్డి సూచనలనూ, సలహాలనూ తీసుకున్నారు. ఆ కాలంలో దండు నారాయణరాజు, మూల్పూరి రంగయ్య, భూపతిరాజు సుబ్బతాతరాజు, సత్తిరాజు రామ్మూర్తి తదితరులు కాంగ్రెస్‌లో వామపక్షీయులుగా ఉండేవారు. ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణ, గారపాటి సత్యనారాయణ, గొట్టిముక్కల వెంకట్రామరాజు జిల్లా స్థాయిలోనూ, తనికెళ్ల వెంకట చలపతి, భూపతి రాజు లక్ష్మీనరసరాజు, ఉద్దరాజు సూర్యరాజు, వంకినేని సత్యనారాయణ, కృత్తివెంట వెంకటేశ్వరరావు, అన్నే తదితరులు తాలూకా స్థాయిలోనూ కాంగ్రెస్‌లో వామపక్షవాదులుగా ఉండేవారు. కొమ్మారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్నకాలంలో అన్నే ఏలూరు తాలూకా కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా ఉన్నారు.

జిల్లాలో 1930-34 కాంగ్రెస్ శాసనోల్లంఘనల్లో పాల్గొన్నవారితో (ఉద్దరాజు రామం, గారపాటి సత్యనారాయణ, తనికెళ్ల వెంకట చలపతి, కలిదిండి సుబ్రహ్మణ్యం, అల్లూరి సత్యనారాయణరాజు) కలిపి తర్వాత కాలంలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ మొదటి శాఖను సుందరయ్య ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఉద్యమంలో భాగస్వాములుగా ఉన్న అన్నే వంటి వారందరినీ కమ్యూనిస్టు అభిమానులుగా సమీకరించి పార్టీనీ, ప్రజాసంఘాలనూ విస్తరింపచేశారు. 1936లో ఆయన కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ ప్రారంభ కాలంలో అన్నే 'స్వతంత్ర భారత్' పత్రికను రహస్యంగా పంపిణీ చేస్తుండగా పోలీసులు ఆయనను పట్టుకొని జైలుకు పంపారు. 1944 ఏప్రిల్ 24న ప్రముఖ ప్రజా కవి, రచయిత సుంకర సత్యనారాయణ సోదరి, మహిళా ఉద్యమ కార్యకర్త అనసూయతో ఆయన వివాహం జరిగింది. 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో చేపట్టిన ప్రచారంలోనూ పాల్గొన్నారు. 1945లో ఉద్దరాజు రామం నేతృత్వంలో జిన్నూరులో జిల్లా రైతు మహాసభను విజయవంతం చేయడంలో పాలుపంచుకున్నారు.

బ్లాక్ మార్కెటింగు అరికట్టాలని, ఎరువులు, బండిపట్టాలు, పలుగులు, పారలు కంట్రోలు ధరలకు రైతులకు అమ్మించాలని కోరుతూ చేసిన ఆందోళనల్లోనూ, తమ్మిలేరుపై తుమ్మూరు వద్ద ప్రాజెక్టుకు, తమ్మిలేరు ఎర్ర కాల్వ, కొవ్వాడ కాల్వ, పోలవరం ప్రాజెక్టుల కోసం జరిగిన ఆందోళనల్లోనూ పాల్గొన్నారు. 1946-47లో పాలపర్రు రాజా అధీనంలోని 370 ఎకరాలు భూమి సాధన కోసం పేద రైతులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి స్వాధీనోద్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ సుబ్బారావుతోపాటు అన్నేపై కూడా పాలపర్రు రాజా కేసులు పెట్టించాడు. ఆ మరుసటి సంవత్సరం (కమ్యూనిస్టు పార్టీపై నిషేధ కాలంలో) దేవరకొండ సుబ్బారావును కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపించింది. పోలీసులు అన్నేను పట్టుకొని

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **కమ్యూనిస్టు ఉద్యమనేత కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు**
యు రామకృష్ణ ................ 2

2. **అక్టోబర్ విప్లవం మానవజాతి కొత్త బాట**
ప్రకాశ్ కరత్ .................. 4

3. **సమిష్టి నిర్ణయం వ్యక్తిగత బాధ్యత**
ఎస్ వీరయ్య.................. 8

4. **సోషలిస్టు ప్రభుత్వ తక్షణ కర్తవ్యాల పై లెనిన్**
ఎన్ వియస్ నాగభూషణ్ ....... 10

5. **ఆవుమాంసం అంటరానితనం**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ .... 16

6. **బాలకార్మిక చట్టసవరణలో లోపాలు**
కోమల్ గనోత్ర.............. .. 22

7. **గుజరాత్ అభివృద్ధి నమూనా**
ఆర్ రామకుమార్ ........... 26

8. **అర్ధరాత్రి అమానుషత్వం**
టి కె రాజలక్ష్మి ............... 32

9. **ఉమ్మడి పౌరస్మృతి ముస్లింలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు**
బి.వి రాఘవులు....... .. 34



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248**
**మేనేజర్: 040-27673787**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org


# యుద్ధము శాంతి

యుద్ధంలో మొట్టమొదట చనిపోయేది 'సత్యం' అని వెనకటికి ఒక మేధావి చెప్పాడు. యుద్ధంలోనే కాదు యుద్ధ వాతావరణంలో కూడా జరిగేది అదే. భారత్-పాకిస్తాన్ మధ్య ఇప్పుడు యుద్ధ వాతావరణం నెలకొని ఉంది. ఈ వాతావరణంలో ఏది సత్యమో, ఏది అసత్యమో చెప్పడం కష్టంగా ఉంది. ఎందుకంటే భారత ప్రభుత్వం, భారత సైనిక వర్గాలు చెప్పేది భారతీయులు నమ్మాలి. నమ్మకపోతే వారి మీద దేశద్రోహం ముద్రవేసేస్తారు. అలాగే పాకిస్తాన్‌లో కూడా అక్కడి ప్రభుత్వం, సైన్యం చెప్పేది పాకిస్తాన్ ప్రజలు నమ్మాలి. లేకుంటే వారు కూడా దేశద్రోహులైపోతారు. కానీ ఒకే విషయాన్ని భారత పాలకవర్గాలు, మీడియా ఒక రకంగా ప్రచారం చేస్తే, దానికి విరుద్ధంగా పాకిస్తాన్‌లో ప్రచారం జరుగుతోంది. మరి సత్యం ఏమిటి? రెండింటిలో ఏదో ఒకటి మాత్రమే సత్యం అవుతుంది కదా!

కాశ్మీర్‌లోని ఉరిలో ఉగ్రవాదులు భారత సైనిక స్థావరంపై దాడి చేసిన తరువాత తాము పాకిస్తాన్ సరిహద్దులు దాటి వెళ్లి పాక్ స్థావరాలపై దాడి చేశామనీ (సర్జికల్ స్ట్రైక్స్), చాలా మంది పాక్ సైనికులు చనిపోయారనీ బిజెపి ప్రభుత్వం, సైనిక వర్గాలు ప్రకటించాయి. అలాంటిదేమీ లేదు, సరిహద్దులో నిత్యం జరిగే చొరబాట్లు, కాల్పులే ఆ రోజు కూడా జరిగాయని పాకిస్తాన్ చెబుతోంది. దానికి రుజువు అన్నట్లు పాకిస్తాన్ సైన్యం బిబిసి, సిఎన్ఎన్ విలేకరులను తీసుకుపోయి ప్రత్యక్షంగా చూపించింది. అంతర్జాతీయంగా ఆ వార్తలు ప్రసారమైనాయి. దాంతో సర్జికల్ దాడులకు సంబంధించిన వాస్తవాలను భారత దేశంలో కూడా కొందరు ప్రశ్నించడం, వారిని దేశద్రోహులుగా ముద్రించడం జరిగింది. అదే సమయంలో సైనిక వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి వీడియోటేపులు అందించినట్లు పత్రికల్లో వచ్చింది. కానీ ప్రభుత్వం మాత్రం ఆ టేపులను బయటపెట్టలేదు. ఇంతకీ ఈ సమస్యంతా ఎందుకు వచ్చిందటే, సైన్యం జరిపిన దాడిని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ పరివారం ప్రయత్నించడం వల్లనే. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత దేశం పాకిస్తాన్‌మీద యుద్ధం చేసి గెలిచినట్లుగా ఈ ఘటనను చిత్రీకరిస్తూ సంఘ్ పరివారం ప్రచారం చేసుకుంది. రానున్న ఉత్తర ప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ రాష్ట్రంలో పెద్ద పెద్ద హోర్డింగులు నెలకొల్పారు. యుద్ధ వాతావరణాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం బాహాటంగా ఉపయోగించుకుంటున్న బిజెపి ప్రయత్నాలు గమనించినప్పుడు వాస్తవానికి అది రాజకీయ ప్రయోజనాలకోసమే ఈ వాతావరణం సృష్టించిందనే సందేహాలు కలగడం సహజం.

సర్జికల్ దాడుల తరువాత భారత్-పాక్ సరిహద్దు ఉద్రిక్తంగా మారింది. రెండు దేశాల మధ్య నిత్యం కాల్పుల ఉల్లంఘన జరుగుతోంది. సైనిక దాడులు, ప్రతీకార దాడులు పెరిగిపోయాయి. ఆరేళ్లుగా ప్రశాంతంగా ఉన్న సరిహద్దు గ్రామాల ప్రజలు వలసలు పోవాల్సి వస్తోంది. పొలాలు, ఊళ్లు విడిచి శరణార్థి శిబిరాలకు పోలేక, ఉన్న ఊళ్లలో ఎప్పుడు ఎవరిపై మృత్యువు విరుచుకుపడుతుందో అర్థం కాక ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రపంచంలోనే పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న రెండు దేశాలూ ఉన్న కొద్దిపాటి వనరులను ప్రజల అభివృద్ధివైపు కాకుండా యుద్ధ సన్నాహాలవైపు మళ్లిస్తున్నాయి. రెండు దేశాలకూ ఆయుధాలు అమ్ముకుని అమెరికా, ఐరోపా దేశాలు లాభపడుతున్నాయి. ప్రపంచంలోనే ఆయుధాలు దిగుమతి చేసుకునే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉంది. పాకిస్తాన్ కూడా దానికి తీసిపోవడం లేదు.

ఇరుగుపొరుగు దేశాలమధ్య శాంతి నెలకొంటే ఆయుధాలపై ఖర్చు తగ్గుతుంది. వాణిజ్య, ప్రజా సంబంధాలు పెరుగుతాయి. దానివల్ల ప్రజలకు లాభం. కానీ యుద్ధం వల్ల ఆయుధాలు అమ్ముకునే సామ్రాజ్యవాద గుత్త సంస్థలకూ వాటికి బ్రోకరేజి చేసే దేశీయ సంస్థలకూ లాభం. పాలక వర్గాలకూ దీని వల్ల ప్రయోజనమే. ఎందుకంటే దేశంలో విలయతాండవం చేస్తున్న అధిక ధరలు, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం తదితర సమస్యల వల్ల తలెత్తే అసంతృప్తిని దారి మళ్లించవచ్చు. అందువల్ల ప్రజలు శాంతిని ఆశిస్తారు, పాలకవర్గాలు యుద్ధాన్ని కోరుకుంటాయి. యుద్ధ ప్రయత్నాల వెనుక పాలకవర్గాల ప్రయోజనాలగురించి ప్రజలకు విడమరిచి చెప్పి వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత వామపక్ష, ప్రజాతంత్ర శక్తులపై ఉంది.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# అక్టోబర్ విప్లవం మానవజాతి కొత్త బాట

**ప్రకాశ్ కరత్**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**దో**పిడీ రహిత సమాజాన్ని నిర్మించడంలో మహత్తర అక్టోబర్ విప్లవం మానవ చరిత్రలోనే ఒక ముందడుగు. కార్మికులు, కర్షకులు, మిగిలిన అణగారిన తరగతులు ఒక కొత్త సోషలిస్టు సమాజాన్ని నిర్మించడంలో సఫలీకృతమయిన మొట్టమొదటి విప్లవం.

**అక్టోబర్ విప్లవం అంటే?**

1917లో రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవం ప్రపంచ చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెరతీసింది. ఈ విప్లవం ఒక కొత్త సోషలిస్టు రాజ్యం– సోవియట్ యూనియన్– ఆవిర్భావానికి నాంది పలికింది. కార్మిక వర్గ నాయకత్వాన విప్లవోద్యమాన్ని ప్రపంచ పటం మీదికి తెచ్చింది.

1917నవంబరు 7వ తేదీ రష్యన్ విప్లవం జరిగింది. (పాత రష్యన్ కాలెండర్ ప్రకారం ఇది అక్టోబరు 25వ తేదీ) రష్యా కేంద్ర బిందువుగా మధ్య ఆసియా మొత్తం వ్యాపించిన విస్తారమైన సామ్రాజ్యం జార్ చక్రవర్తి ఆధీనంలో ఉంది. అప్పటి జార్ వ్యవస్థ పెద్ద పెద్ద భూస్వాములతో కూడుకున్నది. సామ్రాజ్యంలోని సుసంపన్నమైన 80 లక్షల హెక్టార్లు జార్ ఆధీనంలో ఉండేది. 28 వేల మంది భూస్వాముల ఆధీనంలో 16 కోట్ల 74 లక్షల ఎకరాల భూమి ఉండేది.

ఈ రకమయిన అర్థ ఫ్యూడల్ విధానంతో కలిసి పెట్టుబడి దారీ విధానం అభివృద్ధి చెందడం పరిశ్రమలలోనూ, గనులలోనూ గుత్తాధిపత్యానికి దారిదీసింది. పెట్టుబడిదారీ విధానం త్వరత్వరగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ రష్యా మిగిలిన యూరప్ దేశాలతో పోల్చిచూస్తే వెనుకబడే ఉండేది.

1914లో జార్ మొదటి ప్రపంచ యుద్ధంలో చేరాడు. ఇది సామ్రాజ్యవాదుల మధ్య పోరు. ఎందుకంటే ఇక్కడ ప్రత్యర్థులు జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా లాంటి సామ్రాజ్యవాద శక్తులే. ఇవి వలస దేశాలకోసం, వనరుల పై ఆధిపత్యం కోసం పోటీ పడేవి. వీరు లక్షలాది మంది రైతులను, కార్మికులను సైన్యంలో చేర్చుకొని యుద్ధభూమికి పంపారు. రష్యా తరపున పోరాడుతూ వేలాది మంది తమ ప్రాణాలు కోల్పోయారు. భూస్వాముల కొరడా దెబ్బలకు బలైన బానిసలలాగానే పేద రైతులు బాధలు పడ్డారు.

**మొట్టమొదటిగా ఫిబ్రవరి విప్లవం**

ఈ పరిస్థితుల వలన ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి బయలు దేరింది. జార్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా విప్లవశక్తులు, ముఖ్యంగా బోల్షివిక్ పార్టీ తిరుగుబాటు మొదలు పెట్టింది. ఈ సామూహిక తిరుగుబాటు 1917 ఫిబ్ర వరిలో జరిగింది. జార్ చక్రవర్తి నిరంకుశత్వాన్ని తొలగించి ఆ స్థానంలో కొంతమంది సోషల్ డెమోక్రాట్లు ఉన్నా, అత్యధికులు పెట్టుబడి దారులున్న ప్రభుత్వం ఏర్పడింది. ఈ తాత్కా లిక ప్రభుత్వం ఫిబ్రవరి విప్లవం తరువాత మితవాద శక్తులతో రాజీపడి రష్యాలోని బుర్జువా వర్గానికి కొమ్ము కాయడం మొదలు పెట్టింది. యుద్ధంలో జరిగిన నష్టాల వలన, సైనికులు హతులవడం వలన ఈ ప్రభుత్వం ప్రజల మద్దతు కోల్పోయింది.

అయితే ఫిబ్రవరి విప్లవం ఒక శక్తివంతమైన ప్రముఖ సాధనాన్ని సమకూర్చి పెట్టింది అదే 'సోవియట్స్'. అన్ని ప్రముఖ నగరాలలోనూ, పల్లెలలోనూ, కార్మికుల, సైనికుల, రైతుల సోవియట్స్ ఆవిర్భవించాయి.

కార్మికుల సోవియట్స్‌లోనూ, మిలిటరీ విభాగాలలో ఏర్పడిన సోవియట్లలోనూ బోల్షివిక్‌పార్టీకి (విప్లవం తరువాత ఇదే కమ్యూనిస్టు పార్టీగా మారింది.) మద్దత్తు పెరుగుతున్నది. సెప్టెంబరు చివరి నాటికి కార్మికులు, రైతులు, సైనికులలో ఈ తాత్కాలిక ప్రభుత్వం పట్ల కోపం పెల్లుబికింది. రాజధాని పెట్రోగ్రాడ్‌లోనూ, మాస్కోలాంటి నగరాలలోనూ కార్మికులు, తమ తమ సోవియట్లను ఏర్పరచుకొని కొనసాగుతున్న విప్లవాన్ని ఆయుధాలతో రక్షించుకో నారంభించారు. రష్యాలోని గ్రామీణ ప్రాంతాలలో భూస్వాముల నుండి పెత్తందార్ల నుండి రైతులు, వ్యవసాయ కార్మికులు భూములను స్వాధీనం చేసుకోవడం మొదలు పెట్టారు. సైన్యంలో ఉన్న సైనికులు తమ సోవియట్లను తామే ఎన్నుకుని యుద్ధం ఆపాలని, శాంతి నెలకొల్పాలని పిలుపు నిచ్చారు. లెనిన్ చెప్పినట్లు "సైనికులలో అత్యధికులు యాని ఫారమ్ వేసుకున్న రైతులే"

**సోషలిస్టు విప్లవం**

**అన్ని అధికారాలు సోవియట్స్‌కే**

ఈ పరిస్థితులలో బోల్షివిక్ నాయకుడు లెనిన్, దేశంలో విప్లవం మొదటిస్థాయి అయిన బుర్జువా విప్లవ దశనుండి కార్మికులు, అత్యంత నిరుపేద రైతుల చేతులలోకి అధికారం వెళ్ళే రెండోదశకు చేరుకుంటున్నదని ప్రకటించాడు.

బోల్షివిక్ పార్టీ ఇచ్చిన 'అన్ని అధికారాలు సోవియట్స్‌కే' అన్న పిలుపుతో అక్టోబరు 25 (నవంబరు7)న సాయుధులైన కార్మిక బెటాలియన్‌లు (ఎర్రసైన్యం), సైన్యంలో ఉన్న విప్లవ సైన్యం తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బయలు దేరాయి. ఈ విప్లవం రాజధాని పెట్రోగ్రాడ్‌లో అధికారం హస్తగతం చేసుకోవడంలో సఫలమయింది. తదనంతర వారాలలో మాస్కోలోనూ మిగిలిన కేంద్రాలలో కూడా పాత వ్యవస్థను కాపాడే విశ్వాసపాత్రుల ప్రతిఘటనను సమర్థవంతంగా తిప్పికొట్టి రష్యా అంతటా, మిగిలిన పాత జార్ చక్రవర్తి సామ్రాజ్యమంతటిలోనూ సోవియట్‌ల అధికారం నెలకొల్పబడింది.

ఈ విప్లవం 'కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ కమిస్సార్స్' ఆధ్వర్యాన, లెనిన్ నాయకత్వాన కొత్త ప్రభుత్వ స్థాపనకు దారితీసింది.

'భూమి, శాంతి, రొట్టె' నినాదంతో బోల్షివిక్‌లు ప్రజలను కదిలించారు. 'ఆల్ రష్యన్, కాంగ్రెస్ ఆఫ్ సోవియట్స్ ఆఫ్ వర్కర్స్, సోల్జర్స్, అండ్ పెజెంట్స్ డిప్యూటీస్' (రష్యాలోని కార్మి

కుల, సైనికుల, రైతుల, సోవియట్ ప్రతినిధుల సమాఖ్య) భూమికి, శాంతికి సంబంధించిన మొట్టమొదటి ప్రకటన చేయడం ఈ కొత్త ప్రభుత్వం వేసిన తొట్ట తొలి అడుగు. ఎస్టేట్ల భూమి, చర్చిలకు, మొనాస్టరీలకు చెందిన భూమిని అందులోని జీవాలు, భవనాలతో సహా తీసుకుని ప్రాంతీయ భూ కమిటీలకు, రైతు ప్రతినిధులున్న జిల్లాసోవియట్లకు అప్పగించింది.

యుద్ధాన్ని వెంటనే ఆపాలని, యుద్ధంలో పాల్గొన్న అన్ని ప్రభుత్వాలతో, ప్రజలతో శాంతి చర్చలు జరపాలనిరెండో ప్రకటన చేయబడింది. ఏ రకమైన విలీనాలు, పరిహారాలు లేకుండా వెంటనే శాంతి ఒప్పందాన్ని అమలు చేయాలన్న దృఢసంకల్పాన్ని కొత్త సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది.

నిరక్షరాస్యత నిర్మూలన, సార్వత్రిక ప్రాథమిక విద్య, ఉచిత ఆరోగ్య రక్షణ సదుపాయం, యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ నిర్మాణం అనే ఇతర ప్రకటనలు కూడా చేయబడ్డాయి.

జార్ ఆధీనంలో రష్యా 'దేశాల బంది ఖానా'గా ఉండేది. రష్యన్ కాని అనేక దేశాలకు వలస దాస్యం నుండి రష్యన్ విప్లవం స్వేచ్ఛ నిచ్చింది. స్వతంత్ర సోషలిస్టు రిపబ్లిక్‌ల సమాఖ్యగా ఏర్పరిచింది.

సోవియట్ రాజ్యం సోషలిజాన్ని అమలు చేసే లోపలే విప్లవం ప్రతిఘాతశక్తుల దాడిని ఎదుర్కొంది. అంతర్యుద్ధం మొదలయింది. ఎర్రసైన్యం వైట్ గార్డ్ (బోల్షివిక్స్ వ్యతిరేకులు) తోనూ, విప్లవ ప్రతిఘాత శక్తులతోనూ తలపడ వలసి వచ్చింది. బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్‌తో సహా పదిపెట్టుబడి దారీ దేశాలు ఆయుధాలిచ్చి, సహాయాన్నందించి విప్లవ ప్రతీఘాత శక్తులకు మద్దత్తుగా నిలిచాయి.

నాలుగేళ్ళ అంతర్యుద్ధం తరువాత ఎర్ర సైన్యం విప్లవ ప్రతీఘాత శక్తులను అణచివేసి విజయాన్ని సాధించింది. ఈ మజిలీలో వర్గ చైతన్యం గలిగిన ఎందరో కార్మికులను కర్షకులను ఎర్రసైన్యం త్యాగం చేయవలసి వచ్చింది.

**ప్రపంచంలోని మొట్టమొదటి సోషలిస్టు విప్లవం అని దీన్నెందుకంటాం**

అంతకు ముందు జరిగిన విప్లవాలన్నింటి కన్నా అక్టోబరు విప్లవం భిన్నమైంది. 1789 ఫ్రెంచి విప్లవం మొదలుకొని పాత ఫ్యూడల్ తరగతులనుండి, రాజరికాల నుండి రాజ్యాధికారాన్ని అనేక విప్లవాలు తొలగించాయి.

చరిత్రలో కొత్తగా ఎదుగుతున్న దోపిడీ దారులు పాతతరం దోపిడీ దారులను అధికారం నుండి పడదోసే సందర్భాలలో విప్లవాలు వచ్చాయి. పాత ఫ్యూడల్ దోపిడీ తరగతులను బుర్జువా నాయకత్వంలోని విప్లవాలు తొలగించినప్పుడూ ఇదే జరిగింది.

**"భూమి, శాంతి, రొట్టె' నినాదంతో బోల్షివిక్‌లు ప్రజలను కదిలించారు. 'ఆల్ రష్యన్, కాంగ్రెస్ ఆఫ్ సోవియట్స్ ఆఫ్ వర్కర్స్, సోల్జర్స్, అండ్ పెజెంట్స్ డిప్యూటీస్' (రష్యాలోని కార్మికుల, సైనికుల, రైతుల, సోవియట్ ప్రతినిధుల సమాఖ్య) భూమికి, శాంతికి సంబంధించిన మొట్టమొదటి ప్రకటన చేయడం ఈ కొత్త ప్రభుత్వం వేసిన తొట్ట తొలి అడుగు."**



సోవియట్ రెడ్‌గార్డ్స్

కానీ అక్టోబర్ విప్లవం చాలా ప్రత్యేకమైంది. కార్మిక వర్గం, పేద రైతాంగం తదితర అణగారిన వర్గాలు నాయకత్వం వహించిన ఈ విప్లవం మొట్టమొదటి సారి పెట్టుబడిదారి దోపిడీ వర్గాన్ని కూల్చివేసింది.

రష్యాలోని విప్లవానికి కార్మిక వర్గం నాయకత్వం వహించడం వలననే అక్టోబర్ విప్లవం ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు విప్లవంగా గుర్తించ బడింది. పాత రాజ్యాధికారం నాశనం అయి, కొత్త రాజ్యాధికారం ఏర్పరచినప్పుడే విప్లవం విజయవంతమయినట్టు అని లెనిన్ అన్నారు. రష్యన్ విప్లవంలో ఇదే జరిగింది. ఇది పాత రాజ్యాధికారాన్ని తొలగించి దాని స్థానంలో సోవియట్స్ రూపంలో కొత్త రాజ్యాన్ని ఏర్పరచింది. ఈ సోవియట్స్ కార్మిక, కర్షకుల ప్రయోజనాలు కాపాడేవి.

సోషలిజం అంటే ఉత్పత్తి సాధనాలు సమాజపరం కావడమే. పరిశ్రమలు, భూమి, వ్యవసాయం ఇతర ఉత్పత్తి సాధనాలు రాజ్యం తన అధీనంలోకి తీసుకుని వాటిని సమిష్టి యాజమాన్యం కిందికి తెస్తుంది.

మొట్టమొదటి సారిగా ప్రపంచంలోనే ఒక కొత్త సోషలిస్టు ఉత్పత్తి విధానం ఏర్పడింది.

**విప్లవం విజయాలు :**

1960 వరకు సోవియట్ యూనియన్‌లో గొప్ప ఆర్థికాభివృద్ధి జరిగింది. అతి పెద్ద విమర్శకులు కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తారు. గౌరవనీయుడైన బ్రిటిష్ ఆర్థిక చరిత్రకారుడు అన్‌గస్ మడిసన్ ఇలా అన్నారు. "1918–1965 మధ్యకాలంలో సోవియట్ తలసరి ఆదాయం ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా పెరిగింది. జపాన్ కంటే వేగంగా పెరిగింది. జపనీయులు 400శాతం వృద్ధిని సాధిస్తే సోవియట్ 440 శాతం వృద్ధి సాధించి అభివృద్ధి చెందిన అన్ని దేశాల కంటే ఉత్పత్తిలో ఆధిక్యతను సాధించింది."

- అంతర్యుద్ధం ముగిసిన దశాబ్దికాలంలో నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించడం.
- సార్వజనీన ఏడేళ్ళ విద్య, సార్వజనీన ప్రాథమిక విద్యకు సార్వజనీన మాధ్యమ (పదేళ్ళ) విద్య కొనసాగింపుగా ఉండే విధంగా నిబంధనలు చేయబడ్డాయి. ఇది ఆ కాలంలో మరే ఇతర యూరోపియన్ దేశంలోనూ లేదు.
- భూస్వామ్య వ్యవస్థ రద్దు. సమిష్టి సహకార క్షేత్రాలు పేద రైతులు వ్యవసాయ కార్మికులతో ఏర్పాటు.
- విప్లవం పూర్తయిన వెనువెంటనే పౌరులందరికీ ఉచిత వైద్య సదుపాయాలు

> **"ఇరవైయవ శతాబ్ధంలోని అత్యంత దుర్మార్గమైన ఫాసిజం అంతం కావడానికి సోవియట్ యూనియన్, అది చేసిన పోరాటాలే ముఖ్య కారణం. ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగిన ఈ ప్రజాయుద్ధంలో రెండు కోట్లకు పైగా సోవియట్ ప్రజలు తమ ప్రాణాలను బలిఇచ్చారు. నాజీ యుద్ధ వ్యూహాన్ని ఛిద్రం చేసింది ఎర్రసైన్యమే."**



అక్టోబర్ విప్లవంలో పాల్గొంటున్న ప్రజలు

కల్పించబడ్డాయి.

- అందరికీ ఉద్యోగం, నిరుద్యోగ నిర్మూలన. 1936 నాటికల్లాఅందరికీ ఉద్యోగా లు కల్పించిన కారణంగాఎంప్లాయ్‌మెంట్ ఎక్చేంజీలు మూతబడ్డాయి.
- కొత్త ప్రభుత్వం తీసుకున్న తొలి నిర్ణయా లలో మహిళలందరూ సమాన హక్కులు, సమాన వేతనాలు, ప్రసూతి సౌకర్య హక్కులు, విడాకుల హక్కులు పొందారు. విప్లవం మహిళలకు ఓటు హక్కునిచ్చింది. బ్రిటన్ మహిళలకు ఈ హక్కు 1928లో గాని లభించలేదు.
- ప్రజలకు సాంస్కృతిక వనరులు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం పుస్తక ప్రచురణలకు, సినిమాల నిర్మాణా నికి, సంగీతానికి, కళలకు నిధులు సమకూర్చింది.

### చరిత్రపై అక్టోబర్ విప్లవ ప్రభావం

ఈ రోజు ఉన్న దానికన్నా 1917కు ముందు ప్రపంచం ఎంతో భిన్నంగా ఉండేది. ఇరవై యవ శతాబ్దపు తొలిరోజులు ఇంకా సామ్రాజ్య వాద యుగమే. వలసవాదం శిఖ రాగ్రంలో ఉన్నరోజులు. బ్రిటీష్, జర్మన్, ఫ్రెంచ్,ఆస్ట్రో-హంగేరియన్, రష్యన్, జపనీస్ సామ్రాజ్యాలు ఆధిపత్యం చలాయించి ప్రపంచాన్ని విభజించిన రోజులు. పోర్చుగీసు, ఇటలీ లాంటి భిన్న సామ్రాజ్యాలూ ఉండేవి. ప్రపంచంలోని అత్యధిక దేశాలు వలస దేశాలు గానో, పాక్షికంగా వలస దేశాలుగానో ఈ సామ్రాజ్యవాదుల ఆధీనంలో ఉండిన రోజులు.

రష్యన్ విప్లవం ఈ తరహా పాత వలస వాదానికి చమరగీతం పాడింది. అక్టోబర్ విప్లవానికన్నా ముందే ప్రారంభం అయిన మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభంలోనే వలసవాదానికి చావుదెబ్బ తగిలింది. జార్ చక్రవర్తి సామ్రాజ్యం పతనమయిన ఏభైఏళ్ళకి మరే సామ్రాజ్యం మిగలలేదు.

అక్టోబర్ విప్లవం విసిరిన అగ్నికణం వరుసగా ఎన్నో దేశాలలో విముక్తి పోరాటా లను రగిలించి, సామ్రాజ్యవాద పాలనను అంతం చేసింది. మొట్టమొదటి సోషలిస్టు విప్లవం జయప్రదమవడంతో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం మరో ముందడుగు వేసింది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలోని జాతీయోద్యమాలకు రష్యన్ విప్లవమే స్ఫూర్తి నిచ్చింది. సోవియట్ యూనియన్ ఈ విముక్తి పోరాటాలకు మద్దత్తునిచ్చింది.

అక్టోబర్ విప్లవం కార్మిక, కర్షక ఐక్యత పునాదిపై నిర్మించబడింది. ఈ కార్మిక, కర్షక ఐక్యత ఆధారంగానే తరువాతి కాలంలో వలస వాదానికి, పాక్షిక వలస వాదానికి వ్యతిరేకంగా సమీకరణలు జరిగాయి. అక్టోబర్ విప్లవం అడుగుజాడలలోనే మూడు దశాబ్దాల తరువాత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అత్యంత ప్రభావవంతమైన చైనా విప్లవం నడిచింది. వీటి ననుసరించే వియత్నాం, కొరియాలో విప్లవాలు జరిగాయి. ఈ విప్లవాలన్నీ 1930 లలో పెరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక పోరాటాల వారసత్వంగా వచ్చినవే. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత సోషలిస్టు శిబిరం ఏర్పడడం వీటన్నింటి ఉచ్ఛస్థితి.

ఇరవైయవ శతాబ్దంలోని అత్యంత దుర్మార్గమైన ఫాసిజం అంతం కావడానికి సోవియట్ యూనియన్, అది చేసిన పోరాటాలే ముఖ్య కారణం. ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగిన ఈ ప్రజాయుద్ధంలో రెండు కోట్లకు పైగా సోవియట్ ప్రజలు తమ ప్రాణాలను బలిఇచ్చారు. నాజీ యుద్ధ వ్యూహాన్ని ఛిద్రం చేసింది ఎర్రసైన్యమే.

అక్టోబర్ విప్లవం దాస్య విముక్తి చేసిన తీరు ప్రపంచాన్నెంతగానో ప్రభావితం చేసింది. రష్యన్ విప్లవం సఫలమవడం వలన దాని ప్రభావం కార్మిక విప్లవోద్యమాలపైనా పడింది.

రష్యాలో సోషలిస్టు విధానాలు అమలు చేయడం వలన రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలంలో పశ్చిమ దేశాలలో కూడా పెట్టుబడిదారులు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసితీరవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అక్కడ కూడా సార్వజనీన విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చేందుకు ఈ దేశాలలోని కార్మికోద్యమాలు దోహద పడ్డాయి.

### భారతదేశంపై ప్రభావం

అక్టోబర్ విప్లవ వార్త భారత జాతీయ కాంగ్రెస్ పైన, బయట నున్న ఎన్నో విప్లవ సంఘాలపైన తీవ్రమైన ప్రభావాన్నే చూపింది.

- కాంగ్రెస్‌లోని మితవాదులతో అసంతృప్తి చెందిన బాలగంగాధరతిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్, సి.ఆర్ దాస్ లాంటి మధ్యే వాదులంతా రష్యన్ విప్లవ విజయాన్ని ఆహ్వానించి, కార్మిక వర్గ సంఘాలను ఏర్పరచేందుకు సుముఖత చూపారు.
- రష్యన్ విప్లవ ప్రభావం వలన భారత దేశంలో సంఘటిత కార్మికోద్యమం మొదలైంది. 1918కి ముందు పారి శ్రామిక కార్మికులను సంఘటితం చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు జరగలేదు. కొన్ని చెదురుమదురు సమ్మెలు మాత్రం జరిగాయి. 1918లో కార్మికోద్యమం ప్రారంభమవగా, 1919-1921 మధ్య సంఘటిత కార్మికోద్యమాలు వెల్లువెత్తాయి. దేశం సమ్మెలతో అట్టుడికింది.

- రష్యన్ విప్లవం గురించి తెలుసుకునేందుకు ముజాహిర్ గ్రూప్ ఆఫ్ఘనిస్థాన్ గుండా రష్యా బయలు దేరింది. ఖిలాఫత్ ఉద్యమ ఫలితాల పట్ల తీవ్ర అసంతృప్తికి గురైన స్వాతంత్ర్య సమర యోధులున్నారు. అందులో కొందరు తొలి భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు.
- సుబ్రమణ్య భారతి, కాజీ నజ్రుల్ ఇస్లామ్, రవీంద్రనాథ్ టాగూర్ లాంటి ప్రముఖ రచయితలు, కవులు రష్యానుంచి వచ్చిన విప్లవ వార్తను స్వాగతించారు. అక్టోబర్ విప్లవం జరిగిన కొన్ని వారాలలో సుబ్రమణ్య భారతి, 'కొత్తరష్యా' గేయాన్ని వ్రాసారు. 1930లో రవీంద్రనాథ్ ఠాగూర్ రష్యాలో పర్యటించారు. కొత్త సమాజ నిర్మాణంతో ముగ్ధుడయిన ఆయన 'రష్యా నుంచి ఉత్తరాలు' (లెటర్స్ ఫ్రమ్ రష్యా) లో ఇలా అన్నారు.

"నాకళ్ళతో నేను చూడక పోయి ఉంటే పదే సంవత్సరాలలో లక్షలాది ప్రజలను అజ్ఞానాంధకారం నుంచి, అవమానాల నుండి వెలుగులోకి తెచ్చి, వారికి చదవను, వ్రాయను నేర్పించడమే కాక, వారిలో గౌరవ ప్రదమయిన మానవ జీవితాన్ని నింపగలరని నేను నమ్మి ఉండేవాడిని కాదు. ఇక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు మనం ఇక్కడికి వచ్చి తీరాలి."

జవహర్ లాల్ నెహ్రూ నుండి పెరియార్ రామస్వామి వరకు1930లలో సోవియట్ యూనియన్ సందర్శించిన ఎందరో, సోషలిస్టు సోవియట్ యూనియన్ విజయాల పట్ల ముగ్ధులయ్యారు.

భగత్‌సింగ్, ఆయన సహచరులు సోషలిజం వైపుకు ఆకర్షితులయ్యేందుకు రష్యా విప్లవం, లెనిన్ భావాలు కారణమయ్యాయి. కోర్టులో విచారణను ఎదుర్కొంటూ భగత్‌సింగ్, ఆయన సహచరులూ 1930 జనవరి 21వ తేదీన మాస్కోకు ఈ టెలిగ్రాం పంపారు.

"లెనిన్ దినోత్సవంనాడు లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్ళేందుకు ఏ కొంచమయినా శ్రమిస్తున్న వారికి మా అభినందనలు. రష్యా చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతం కావాలని మేం ఆకాంక్షిస్తున్నాం. అంతర్జాతీయ కార్మికోద్యమంతో మేం గళం కలుపుతాం".

అందువలన భారతదేశ స్వాతంత్ర్య పోరాటంపైనా, సామాజిక విముక్తి పైనా రష్యా విప్లవ ప్రభావం ప్రగాఢంగా ఉంది.

**"నాకళ్ళతో నేను చూడక పోయి ఉంటే పదే సంవత్సరాలలో లక్షలాది ప్రజలను అజ్ఞానాంధకారం నుంచి, అవమానాల నుండి వెలుగులోకి తెచ్చి, వారికి చదవను వ్రాయను నేర్పించడమే కాక, వారిలో గౌరవ ప్రదమయిన మానవ జీవితాన్ని నింపగలరని నేను నమ్మి ఉండేవాడిని కాదు. ఇక్కడి విద్యా విధానాన్ని అధ్యయనం చేసేందుకు మనం ఇక్కడికి వచ్చి తీరాలి."**

### సోవియట్ యూనియన్ ఎలా అంతం అయింది

పెట్టుబడిదారుల ముట్టడి, అంతర్యుద్ధాల మధ్య రష్యా విప్లవం విజయవంతమయితే ఆతరువాత సోవియట్ యూనియన్ ఏర్పడింది. ఈ కొత్త సోషలిస్టు రాజ్యం సామ్రాజ్యవాదం నుండి నిరంతరం బెదిరింపులను ఎదుర్కొవలసి వచ్చేది. ఫాసిస్టు దాడులు దీనినే గురి చేసుకున్నాయి. ఈ సవాళ్ళనన్నింటినీ ఎదుర్కొంటూనే ప్రపంచ యుద్ధం తరువాత రష్యా ఒక కొత్త శక్తిగా వెలిగి అమెరికా తరువాతి స్థానానికి చేరింది. సత్వర ఆర్థికాభివృద్ధి, సార్వత్రిక విద్య,వైద్యం, గృహవసతి, సాంస్కృతిక, భౌతిక జీవన ప్రమాణాల మెరుగుదల సోషలిస్టు వ్యవస్థలోని అంతర్గత సామర్థ్యాన్ని చూపింది.

అయినా కొంతకాలం తరువాత, ముఖ్యంగా చివరి ఇరవై సంవత్సరాలలో కొన్ని లోపాలు బయట పడ్డాయి. ఆర్థిక వ్యవస్థ కొత్త శాస్త్రీయ జ్ఞానాన్ని, టెక్నాలజీ విప్లవాన్ని అంది పుచ్చుకునేందుకు తయారుగా లేదు. ఆర్థిక వ్యవస్థను అవసరాల కనుగుణంగా మార్పు చేయడంలో విఫలమయ్యింది. ప్రజల భౌతిక అవసరాల కనుగుణంగా సామ్యవాద ప్రజాస్వామ్యాన్ని అభివృద్ధి చేయడంలో వైఫల్యం చెందింది. వీటితో పాటుగాప్రజలలో సామాజిక చైతన్యాన్ని పెంచటంలోకమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతిక వైఫల్యం బ్యూరోక్రసీకి దారితీసింది. ఫలితంగా సోవియట్ యూనియన్ పతనమయ్యింది.

సోవియట్ యూనియన్ పతనానికి సోషలిజం కారణం కాదు.సోషలిజం నిర్మించడంలోని వక్రీకరణలు, సైద్ధాంతిక ఉల్లంఘనలు. సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మించిన అనుభవాన్ని చారిత్రికంగా పునస్సమీక్షించుకుంటే సోవియట్ యూనియన్ పతనం ఈనాటి ప్రపంచంలో సోషలిజం ప్రాధాన్యత అంతం కాదని తెలుస్తుంది.

**అక్టోబర్ విప్లవం ప్రాధాన్యత తగ్గలేదు**

అక్టోబర్ విప్లవం పెట్టుబడిదారి విధానాన్ని అంతం చేయవచ్చని సోషలిజాన్ని నిర్మించవచ్చని మానవ జాతికి చూపింది. 20వ శతాబ్దంలో శక్తివంతమైన ప్రభావాన్ని చూపిన అక్టోబర్ విప్లవం, 21వ శతాబ్దంలోనూ ప్రత్యామ్నాయ బాటకు వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నది.

సోవియట్ యూనియన్ పతనం పెట్టుబడిదారీ ప్రపంచ ఆధిపత్యానికి, సామ్రాజ్యవాదానికి దారితీసింది. 21వ శతాబ్దంలో నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న పెట్టుబడిదారీ విధానం కొద్దిమంది ధనవంతులు ఒకవైపు, పేదరికంతో, నిరుద్యోగంతో, ఆకలితో బాధపడుతున్న కోట్లాది మంది ప్రజలు మరోవైపు ఉండేలా ప్రపంచాన్ని ఖచ్చితమైన రెండు భాగాలుగా విభజించింది. అసమానతలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచంలోని ఒకశాతం ధనవంతులు 110,00,000 కోట్ల ఆస్తులకు అధిపతులు. అంటే కింది సగం జనాభా కన్నా 65 రెట్లు ఎక్కువ సంపద కలిగి ఉన్నారు. ప్రపంచంలో 130 కోట్ల జనాభా అత్యంత పేదరికంలో మగ్గు తున్నారు.

అమెరికా ఆధ్వర్యంలో సామ్రాజ్యవాదం తన ఆధిపత్యం కొనసాగించే ప్రయత్నంలోనే ఉన్నది. ఇరాక్, సిరియా, లిబియా, యెమెన్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలలో వినాశకర ఘర్షణలను ఎగదోసి, వాటిలో జోక్యం చేసుకుంటున్నది.

ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు, శ్రమచేసే ఇతర తరగతుల ప్రజలూ నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, పొదుపు చర్యలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారు. వీరందరికీ 1917 సోషలిస్టు విప్లవం దిశానిర్దేశం చేసే వెలుగుకిరణం. ప్రగతిశీల విప్లవక శక్తులకు అక్టోబర్ విప్లవం ప్రేరణ నిచ్చే ఆశాకిరణం. వర్గరహిత, దోపిడీ రహిత సమాజం కోసం కృషిచేసే వారందరికీ భవిష్యత్ సోషలిజానిదే అన్న సందేశాన్ని అక్టోబర్ విప్లవం ఇస్తుంది.

**అనువాదం : కె ఉషారాణి**

ఈ మాసం ప్రత్యేకం

# సమిష్టి నిర్ణయం - వ్యక్తిగత బాధ్యత

**ఎస్ వీరయ్య**



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

సమిష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యత, తనిఖీల మధ్య పరస్పర సంబంధం ఉన్నది. ఈ మూడు అంశాల సమన్వయంతో పనిచేసినప్పుడే సరైన ఫలితాలు సాధించగలము. నిర్ణయాలు ఎప్పుడూ సమిష్టిగానే చేయాలి. అమలు జరిపే బాధ్యత మాత్రం వ్యక్తులదే. నిర్ణయించిన కర్తవ్యం అమలు కోసం ఎవరెవరు ఏ బాధ్యతలు తీసుకోవాలో కూడా సమిష్టిగానే నిర్ణయించాలి. ఒకసారి నిర్ణయం జరిగిన తర్వాత ఎవరికి అప్పగించిన పనిలో వారు నిమగ్నమై ఉండాలి. తమకు అప్పగించిన బాధ్యత సమర్ధవంతంగా నిర్వహించేందుకు సర్వశక్తులూ ఒడ్డి పనిచేయాలి. అందుకవసరమైన సహకారం తీసుకోవలసిన బాధ్యత వారిదే. అదే సమయంలో నాయకత్వం తనిఖీ, అవసరమైన సహాయం కూడా చాలా కీలక పాత్ర పోషిస్తుంది.

**సమిష్టితత్వం - నాయకత్వ బాధ్యత**

సమిష్టి పనివిధానం పెంపొందించే బాధ్యత నాయకత్వానిదే. సమిష్టితత్వం ప్రయత్నపూర్వకంగా, చైతన్యపూర్వకంగా అలవర్చుకోవాలి. అమలుచేయాలి. సమిష్టిపని విధానానికి ఆయా స్థాయిల్లో నాయకుల లేదా కార్యకర్తల లేదా సభ్యుల బృందం అవసరం. ఈ బృందం దానంతట అది తయారు కాదు. ఎవరో ఇచ్చేదీ కాదు. బాధ్యులు స్వయంగా తయారుచేసుకోవాలి. అప్పుడే ఆ బృందానికి నాయకులవుతారు. కొంతమంది తమ వైఫల్యాలకు బృందం లేకపోవటమే కారణంగా సమర్థించుకుంటారు. ఆ బృందం కోసం కృషి చేయవలసిన బాధ్యత తమదేనని గుర్తించరు. ఇతరులకు బృందం (టీమ్) ఉండటం వల్ల సమర్థవంతంగా జయప్రదం చేయగలుగుతున్నారనీ, తాను ఒంటరిగా పనిచేయవలసి వస్తున్నదనీ, ఎదుటివారు అర్ధం చేసుకోవాలనీ కోరుకుంటారు. ఎదుటివారి సానుభూతిని ఆశిస్తారు. సానుభూతి ఆశించటం కంటే లోపాన్ని గుర్తించటం మంచిది. తోటి కామ్రేడ్స్ సానుభూతి వ్యక్తం చేయటం మంచిదే. కానీ బృందం లేనందుకు కాదు. తనకవసరమైన బృందాన్ని తయారు చేసుకోలేకపోతున్నందుకు. అందుకే ఇక్కడ తనకవసరమైన బృందాన్ని తయారుచేసుకోవడంలో తాను వెనకబడుతున్న విషయాన్ని గమనించాలి. అందుకోసం తగిన కృషి చేయాలి. బృందం అనగానే తనతో సమానమైన స్థాయి కలిగినవారు దొరకాలని కోరుకుంటారు. మన ఆచరణకు, ఆలోచనలకు దగ్గరి సంబంధం ఉండాలి. సమర్థులైన కార్యకర్తలు రెడీమేడ్‌గా ఎక్కడా, ఎప్పుడూ దొరకరు. తయారుచేసుకోవలసిందే. అందుకే బృందంలో సభ్యులను అనేక సందర్భాలలో ప్రాథమిక స్థాయి నుంచి ఎంపిక చేసుకుని అభివృద్ధి చేసుకోవటం అనివార్యం. బృందంలోని సభ్యులు తరతమ స్థాయిల్లో ఉండటం సహజం. అవగాహనలోనూ, అనుభవంలోనూ తేడాలుంటాయి. సమిష్టిగా పనిచేసే ప్రయత్నంలో భాగంగానే వారు కూడా అభివృద్ధి చెందుతారు. వారిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడం ద్వారానే నాయకత్వం తన బృందం నైపుణ్యాన్నీ, సైద్ధాంతిక అవగాహననూ, సామర్థ్యాన్నీ అభివృద్ధి చేసుకోగలదు.

బృందంలోని సభ్యులు తరచుగా పరస్పరం నివేదించుకోవాలి. సంప్రదించుకోవాలి. తమకు అప్పగించిన బాధ్యతల నిర్వహణలో వస్తున్న అనుభవాలను, ఇబ్బందులను బృందంలోని సభ్యులకు నివేదించాలి. అర్థం కాని విషయాలకు పరిష్కారం కోసం సంప్రదించాలి. పరస్పరం నివేదించుకోవటం అంటే బృందంలోని సభ్యులు కార్యదర్శికి నివేదించటం, కార్యదర్శితో సంప్రదించటం మాత్రమే కాదు. ఇది పరస్పరం జరగవలసిన చర్య. కార్యదర్శితో సహా అందరూ బృందంలో సభ్యులే. పరస్పరం నివేదన, సంప్రదింపులు అందరికీ సమానంగా వర్తిస్తాయి. బృందం నాయకత్వానికి ఒకింత ఎక్కువగా వర్తిస్తుంది. ఎందుకంటే బృందంలోని సభ్యులు ఈ సమిష్టితత్వం గుర్తించే విధంగా చేయవలసింది నాయకత్వమే కాబట్టి.

సంప్రదించటం అంటే తనతో ఏకీభవించే వారితో మాత్రమే మాట్లాడటం కాదు. తనకు అనుకూలమైన లేదా తనకు నచ్చిన అభిప్రాయం వస్తుందనుకున్నవారితో మాత్రమే సంప్రదించటం కాదు. సామర్థ్యం, పరిమితుల పేరుతో కూడా ఎవరినీ మినహాయించకూడదు. సమిష్టి సంప్రదింపుల ప్రక్రియలో బృందం మొత్తాన్ని భాగస్వాముల్ని చేయాలి. తక్షణం చేయవలసిన నిర్ణయం అయితే తప్ప బృందంలో సాధ్యమైనంత ఎక్కువమందితో సంప్రదించాలి. సమస్యతో సంబంధం ఉన్నవారు నిర్ణయంలో తప్పనిసరిగా భాగస్వాములయ్యేటట్టు చూడాలి. విభేదించేవారితో మరింత ఎక్కువగా సంప్రదించాలి. సమిష్టితత్వం బలోపేతం కావడానికి, బృందం సభ్యుల సామర్థ్యం పెరగడానికి, బృందంలో ఐక్యత పెరగడానికి ఇది తోడ్పడుతుంది. సరైన నిర్ణయాలు చేయడానికి కూడా ఇదొక్కటే మార్గం. ఇందుకు భిన్నంగా వ్యవహరించినప్పుడు అనైక్యతకు బీజం పడుతుంది. నాయకత్వం ఎప్పుడూ బృందంలో ఐక్యతను పెంపొందించాలి తప్ప అనైక్యతకు కారణం కాకూడదు.

సాధారణంగా ఒక టీమ్‌లో సభ్యులుగా ఉన్నవారు మరో టీమ్‌కు నాయకులుగా ఉండే అవకాశం ఉంది. శాఖకు కార్యదర్శిగా ఉన్న కామ్రేడ్ మండల స్థాయిలో కమిటీలో ఉంటారు. మండల స్థాయిలో నాయకులుగా ఉన్న కామ్రేడ్ జిల్లాస్థాయిలో సమిష్టి బృందంలో సభ్యులుగా ఉంటారు. పార్టీ బృందంలో సభ్యులుగా ఉన్నవారు ప్రజాసంఘంలో ఫ్రాక్షన్ కమిటీకి నాయకులుగా ఉంటారు. తాను బృందంలో సభ్యులుగా ఉన్నచోట గానీ, బృందానికి నాయకత్వం వహిస్తున్న చోట గానీ రెండు చోట్లా ఒకేవిధంగా వ్యవహరించాలి. సరైన పని పద్ధతులనే పాటించాలి.

బృందంలో సభ్యులుగా ఉన్న చోట తమ అభిప్రాయాలను తగినంతగా పరిగణనలోకి తీసుకోవటం లేదన్న అసంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. ఇదే అసంతృప్తి తాను నాయకత్వం వహిస్తున్న బృందంలో కూడా సభ్యులకు ఉంటుందన్న విషయం గమనించాలి. బృందంలోని సభ్యులు రకరకాల ప్రాంతాలనుండి, వర్గాలనుండి, తరగతులనుండి వస్తారు. వ్యక్తిగత లక్షణాలు, హావభావాలు అందరికీ ఒకేవిధంగా ఉండవు. కొన్ని పుట్టుకతో వచ్చే లక్షణాలు కూడా ఉంటాయి. పార్టీకి నష్టం జరగని మేరకు ఇలాంటి విషయాల్లో పట్టింపులకు పోనవసరం

లేదు. హావభావాలను పట్టించుకోవద్దు. వాటికి ప్రాముఖ్యతనివ్వవద్దు. అసలు విషయాలు వదిలేసి హావభావాల చుట్టూ చర్చ పెట్టడం, లేదా హావభావాలను బట్టి అభిప్రాయాలను ఏర్పరుచుకోవడం నష్టం చేస్తుంది. అనైక్యతకు దారితీస్తుంది. ఇలాంటి విషయాల్లో పరిణితిని ప్రదర్శించాలి. తెలియని విషయాలు తెలిసినట్టు చెప్పకూడదు. తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. తెలుసుకునే ప్రయత్నంలో భేషజాలు అవసరం లేదు. తమకంటే పైవారా, కిందివారా, సహచరులా అనే తేడా చూపనవసరం లేదు. అందరినుండీ నేర్చుకోవలసిందే. తెలుసుకునే ప్రయత్నం చేయకుండా తెలిసినట్టు నటించడం వల్ల తమకే నష్టం. తమ అవగాహన పెరగదు. అవగాహనా లోపం వల్ల సరైన సలహాలు, సూచనలు చెప్పజాలరు. తమ పరిధిలో సరైన నిర్ణయాలు చేయగల సామర్థ్యం కోల్పోతారు. అందుకే తెలియని విషయాలు తెలుసుకునేందుకు నిరంతరం ప్రయత్నించాలి. బృందంలోని సభ్యులు తమ సహచరుల బలమైన అంశాలు, బలహీనమైన అంశాలు గమనించి సర్దుబాటు చేసుకోవాలి. బలహీనతల మీద నొక్కి ఇబ్బంది పెట్టవద్దు. బలమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని బాధ్యతలు అప్పగిస్తే పనిలో ఫలితాలు సాధించగలుగుతారు. బలహీనతలను అధిగమించేందుకు తగు సూచనలు చేయగలిగితే వారి అభివృద్ధికి తోడ్పడతారు. వారి బలహీనత వల్ల అప్పగించిన బాధ్యతను అందుకోలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు పనిలో సహకరిస్తే వైఫల్యాలను అధిగమించవచ్చు. ఇవన్నీ బృందం సభ్యుల మధ్య సాన్నిహిత్యాన్ని, పరస్పర అవగాహనను, సహకార ధోరణిని పెంచుతాయి. సరైన ఫలితాలు సాధించడానికి మార్గం సుగమం చేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సమిష్టితత్వానికి భంగం కలిగించే అంశాలన్నింటినీ దూరంగా పెట్టాలి (అవాయిడ్ చేయాలి).

తాము సభ్యులుగా ఉన్న బృందం లేదా టీమ్ లేదా కమిటీ తనదిగా భావించాలి. టీమ్‌కు వెలుపలి వ్యక్తిగా వ్యవహరించకూడదు. కొన్ని సందర్భాలలో తనకు నచ్చని అభిప్రాయాలు బృందంలో వ్యక్తమవుతున్నప్పుడు లేదా నిర్ణయం జరుగుతున్నప్పుడు అసహనం ప్రదర్శిస్తుంటారు. "మీరు నిర్ణయం చేయండి, అమలు చేస్తాను" అంటారు. అంటే నిర్ణయం చేయవలసిన బృందంలో తాను సభ్యుడు కానట్టు, నిర్ణయం చేయవలసింది మరెవరో అన్నట్టు, తాను మాత్రం ఆ బృందానికి వెలుపలి వ్యక్తిగా మాట్లాడతారు. ఇది సరైంది కాదు. నిర్ణయం చేయవలసిన బృందంలో తానూ భాగస్వామి అన్న విషయం విస్మరించకూడదు. మెజారిటీతో విభేదించినంత మాత్రాన తాను బృందంలో సభ్యులు కాకుండా పోరు. నిర్ణయాల తప్పొప్పులు ఆచరణలోనే తేల్చుకోవాలి. సమిష్టి నిర్ణయాన్ని సమర్ధవంతంగా అమలుచేసేందుకు ప్రయత్నించడం ద్వారానే ఆ నిర్ణయంలోని తప్పొప్పులను నిర్ధారించగలము. వాదోపవాదాలు, అసహనం, అలకలు పరిష్కారం కాదు. నిర్ణయాలు సమిష్టిగా చేయాలి. ఆ నిర్ణయం అమలుచేయడానికి బాధ్యతలు పంచుకోవాలి. వ్యక్తిగతంగా ఎవరు ఏ పనులు చేయాలో, ఎప్పటిలోగా చేయాలో నిర్దిష్టంగా నిర్ణయించాలి. ఒకసారి నిర్ణయం జరిగిన తర్వాత తనకు అప్పగించిన బాధ్యతలు అమలుచేయడానికి బాధ్యత వహించాలి. తీసుకున్న బాధ్యత తాను కోరుకున్నదా లేదా అనేదానితో నిమిత్తం లేకుండా సర్వశక్తులూ ఒడ్డి అమలు చేయాలి. ఫలితాలు సాధించేందుకు పట్టుదలతో శక్తివంచన లేకుండా కృషి చేయాలి. చేసిన నిర్ణయం అమలు జరుగుతున్న క్రమంలోనే అమలు తీరును నాయకత్వం తనిఖీ చేయాలి. ఇది నాయకత్వ పర్యవేక్షణలో భాగం. తన బృందంలోని సభ్యులు నిర్ణయాలను సక్రమంగా అర్థం చేసుకున్నారా లేక నిర్ణయాలు వక్రీకరణకు గురవుతున్నాయా అన్నది అమలుచేసే క్రమంలోనే గమనించాలి. నిర్ణయాలు వక్రీకరణకు గురైతే తక్షణం సరిదిద్దాలి. అమలుచేయడంలో ఎవరైనా ఇబ్బందిపడితే వారికి నాయకత్వం సహకరించాలి. వారికి విశ్వాసం కల్పించాలి. అప్పగించిన బాధ్యతల్లో వారు ముందుకు పోయేందుకు తోడ్పడాలి. అంతా అయిపోయే దాకా చూసి సమీక్ష సమయంలో విఫలమయ్యారని చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇది సత్ఫలితాలు సాధించడానికి గానీ, సమిష్టితత్వం బలపడటానికి గానీ తోడ్పడదు.

"సమిష్టితత్వం వల్ల అనేక ప్రయోజనా లున్నాయి. వ్యక్తిగత నిర్ణయాల వల్ల నష్టాలు జరిగే అవకాశాలున్నాయి. ఒక వ్యక్తి ఎంతటి తెలివితేటలు కలవాడైనప్పటికీ సమాజంలోని వ్యక్తులందరి అనుభవంతో, పరిజ్ఞానంతో పోల్చుకున్నప్పుడు తన అనుభవం గానీ, తెలివితేటలు గానీ పరిమితమే. సముద్రంలో నీటిబొట్టు వంటిదే."

**సమిష్టితత్వం - ప్రయోజనాలు**

సమిష్టితత్వం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. వ్యక్తిగత నిర్ణయాల వల్ల నష్టాలు జరిగే అవకాశాలున్నాయి. ఒక వ్యక్తి ఎంతటి తెలివితేటలు కలవాడైనప్పటికీ సమాజంలోని వ్యక్తులందరి అనుభవంతో, పరిజ్ఞానంతో పోల్చుకున్నప్పుడు తన అనుభవం గానీ, తెలివితేటలు గానీ పరిమితమే. సముద్రంలో నీటిబొట్టు వంటిదే. అందుకే సామర్థ్యం, అనుభవం, తెలివితేటలు సాపేక్షమే. ఒక గీత చిన్నదో పెద్దదో దాని ప్రక్కన గీసే గీతను బట్టే తేలుతుంది. చిన్న గీతతో పోల్చుకున్నప్పుడు అది పెద్దది. పెద్ద గీతతో పోల్చుకున్నప్పుడు అది చిన్నది. వ్యక్తుల తెలివితేటలు, అనుభవాలు కూడా అంతే. తమదే అనుభవం, తమకు తెలిసిందే సర్వం కాదు. ఎంత ఎక్కువమంది కలిసి నిర్ణయం చేస్తే అంతమంది అనుభవాలు, పరిజ్ఞానం తోడయి సాధ్యమైనంత మేరకు సరైన, సమగ్రమైన నిర్ణయం చేయడానికి తోడ్పడుతుంది. అంతేకాదు, ఒక వ్యక్తికి ఎంత పరిమితమైన తెలివితేటలున్నప్పటికీ, ఎంత తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ఎక్కువ మంది కలిసి ఆలోచిస్తే ఎక్కువ పరిజ్ఞానం, ఎక్కువ అనుభవముంటుంది. సరైన నిర్ణయం జరిగేందుకు అవకాశం ఉంటుంది. గడ్డిపోచ బలహీనమైనదే. అనేక గడ్డిపోచలను కలిపి పేనిన తాడు మాత్రం గట్టిదీ, బలమైనదీ. ఇది మనందరి అనుభవం.

ఒక వ్యక్తిగా తాము ఏ పనిలో కూరుకుపోయి ఉంటే ఆ కోణంలోనే ఆలోచిస్తారు. ఏ ప్రాంతంలో లేదా ఏ రంగంలో పనిచేస్తుంటే దానికి సంబంధించిన అంశాలు వారి అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. ఆ మేరకు ఆ అభిప్రాయాలు పాక్షికమే అవుతాయి. కొందరు కలిసి ఆలోచించినప్పుడు అనేక కోణాలనుంచి పరిశీలన జరుగుతుంది. సమగ్రత చేకూరుతుంది. సరైన నిర్ణయం జరిగే అవకాశముంటుంది. ప్రజలతో ఎంత మమేకమయ్యే కార్యకర్త అయినప్పటికీ ఒక వ్యక్తిగా ప్రజలతో సంబంధాలు పరిమితమే. ఆ మేరకు తన అభిప్రాయం పరిమితమైన ప్రజల అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తుంది. కొంతమంది కలిసి ఆలోచించ గలిగినప్పుడు విస్తృత స్థాయిలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే బృందం అవుతుందది. ఆ మేరకు ఆ బృందం చేసే నిర్ణయం విస్తృత ప్రజా ప్రయోజనాలను, ప్రజల నాడిని ప్రతిబింబిస్తుంది. ❋

ఈ మాసం ప్రత్యేకం

# సోషలిస్టు ప్రభుత్వ తక్షణ కర్తవ్యాల పై లెనిన్

**ఎన్‌వియస్ నాగభూషణ్**



రచయిత
లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకులు

ఒక పెట్టుబడిదారీ దేశంలో సోషలిస్టు విప్లవం విజయం సాధించాక, ఆ దేశ ప్రభుత్వం వెంటనే ఏ కర్తవ్యాల్ని నిర్వహించాలి? ఈ ప్రశ్నకు సమాధానం లెనిన్ రాసిన "సోవియట్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యాలు" అనే సుప్రసిద్ధ వ్యాసం నుండి మనకు లభిస్తుంది.

ఈ వ్యాసాన్ని లెనిన్, అక్టోబర్ విప్లవ విజయం సాధించిన ఆర్నెల్ల తరువాత, విజయానంతరం బోల్షివిక్‌ల ప్రాభవాన్ని జీర్ణించుకోలేని కొన్ని చిన్న చిన్న సైనిక తిరుగుబాట్లను తేలిగ్గా అణిచివేసిన తర్వాత, రెచ్చగొట్టబడ్డ వివిధ ఉద్యోగవర్గాల సహాయ నిరాకరణను సమర్థవంతంగా ఎదుర్కొని, వారిని దారికి తెచ్చిన అనంతరం రాశాడు. అలాగే విప్లవ ప్రభుత్వపు మెడపై, నిలువెల్లా ఆయుధాలు ధరించిన జర్మనీ సైన్యపు దురాక్రమణ అనే కత్తి వేలాడుతుండగా, గత్యంతరం లేని స్థితిలో వారితో దోపిడీదార్ల బ్రెస్ట్‌లితోవెస్క్ శాంతి సంధిని కుదుర్చు కొని, అస్థిరమైనదే అయినప్పటికీ, సోవియట్ దేశ అవసరాల దృష్ట్యా ముఖ్యమైన శాంతిని సాధించిన పిదప ఈ వ్యాసం రాయబడింది. ఇంకా చెప్పాలంటే, మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధంలో నిండా మునిగిన దేశంలో, ఒక్క ఉన్నత వర్గం తప్ప సమాజంలోని ప్రతి సెక్షనూ అతలా కుతలమై కరువుతో, నిరుద్యోగంతో, బ్లాక్ మార్కెట్‌తో, రోగాలతో, బూర్జువాల విచ్ఛిన్నకర చర్యలతో అలమటించిపోతున్న దేశాన్ని ఒక దారికి తెచ్చే కృషి చేస్తూ, మరోప్రక్క బూర్జువాల దోపిడీని అరికట్టి, సోషలిస్టు సమాజ స్థాపన ధ్యేయంతో ఆర్థికవ్యవస్థపై ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని నెలకొల్పిన తర్వాత, పాలనపై దృష్టిని కేంద్రీకరించడానికీ, వ్యవస్థీకరణ అనే కర్తవ్యాన్ని నెరవేర్చే కృషితో ఏర్పడే సమస్యలను అధ్యయనం చేయడానికి ఎనిమిది అంశాలతో కూడిన ఈ వ్యాసం ఉద్దేశించబడింది.

"అంతర్జాతీయ పరిస్థితి రష్యన్ సోవియట్ రిపబ్లిక్ సోషలిస్టు విప్లవపు మౌలిక కర్తవ్యాలు" అనే మొదటి అంశం గుర్తించడం అవసరమనీ, మనలను ఎదుర్కొంటున్న ప్రాథమిక సంఘటన కర్తవ్యాల్ని విజయవంతంగా నెరవేర్చడానికి ఇదే మౌలిక షరతనీ లెనిన్ చెప్పాడు.

బూర్జువా విప్లవాలలో రుణాత్మక, లేదా విధ్వంసక కృషి జరిపిన వారు శ్రామిక ప్రజా బాహుళ్యం. ఆ రుణాత్మక కృషి ఏమి టంటే, ఫ్యూడలిజాన్నీ, రాజరికాన్నీ, మధ్యయుగ తత్వాన్నీ నిర్మూలించడం! అయితే ఆ విప్లవా లలో ధనాత్మక లేదా నిర్మాణాత్మక కృషి, అంటే నూతన సమాజాన్ని వ్యవస్థీకరించే కృషిని నిర్వహించిన వారు ప్రజానీకానికి మైనారిటీ అయిన ఆస్తిపరులైన బూర్జువాలు! అయితే ఈ కృషి కార్మికులూ, పేద రైతుల ప్రతిఘటన ఉన్నప్పటికీ, వారు (బూర్జువాలు) సాపేక్ష సౌల భ్యంతో నిర్వహించారనీ, ఎందుకంటే పెట్టుబడి చేత దోపిడీ చేయబడే ప్రజలు చెల్లాచెదురుగా ఉండటం, వారు విద్యావిహీనులుగా ఉండటం వల్ల వారి ప్రతిఘటన దుర్బలంగా ఉన్నదనీ, అంతమాత్రమే గాక అరాజకంగా నిర్మితమైన పెట్టుబడిదారీ సమాజపు ప్రధాన సంఘటన శక్తి స్వయంజనితంగా పెరుగుతూ, విస్తరిస్తున్న జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ కావడం వల్ల కూడా అనీ లెనిన్ అంటాడు.

భవిష్యత్తుగల ప్రతి పార్టీకీ మూడు ప్రధాన కర్తవ్యాలుంటాయని లెనిన్ చెప్పాడు. అందులో మొదటిది ఏమంటే తన కార్యక్రమము, ఎత్తుగడలూ సరైనవని మెజారిటీ ప్రజల్ని నమ్మించడం! ఈ కర్తవ్యం పూర్తిగా నెరవేరనప్పటికీ (పూర్తిగా ఎన్నడూ నెరవేరదు), అధికభాగం నెరవేరిందనీ, కార్మిక, కర్షకులలో మెజారిటీ బోల్షివిక్కుల పక్షానే ఉన్నారని ఆయన చెప్పాడు. ఇక రెండో కర్తవ్యం – రాజకీయాధికారాన్ని కైవశం చేసుకొని, దోపిడీదార్ల ప్రతిఘటనని అణచివేయడం! ఈ కర్తవ్యం కూడా పూర్తిగా నెరవేరలేదనీ, ఎందుకంటే రాజరికవాదులూ, క్యాడెట్లూ (కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రాట్లు), వారి తాబేదార్లయిన మెన్షివిక్కులూ, మితవాద సోషలిస్టు రివల్యూషనరీలు సోవియట్ అధికారాన్ని కూలదోయడానికి ఏకం అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారుగానీ, రమారమి ఈ కర్తవ్యం నెరవేరిందని ఆయన చెప్పడు. ఇక మూడోదీ, తక్షణమైనదీ విశిష్ట లక్షణమైందీ అయిన కర్తవ్యం ఏమిటంటే దేశపాలనను వ్యవస్థీకరించడం! దీన్ని విప్లవ విజయం లభించిన తెల్లారే చేపట్టడం జరిగిందని, కానీ దోపిడీదార్ల ప్రతిఘటన అంతర్యుద్ధరూపం ధరించినందున, పరిపాలన కర్తవ్యం ప్రధాన కర్తవ్యం కాలేదనీ, ఇప్పుడు మాత్రం ఇది ప్రధానమైంది అయిందనీ ఆయన వివరించాడు. ఇప్పుడు దీన్ని మనం నిర్వహించాలనీ అన్నాడు.

మానవజాతి చరిత్రలో మొదటిసారిగా ఒక సోషలిస్టుపార్టీ అధికారాన్ని జయించడం, దోపిడీదార్లను అణచడం అనే పనిని మొత్తమ్మీద పూర్తి చేయగలిగి, పరిపాలన కర్తవ్యాన్ని సూటిగా సమీపించగలిగిందనీ, ఇది నిర్వహించబడిన తర్వాత మాత్రమే, రష్యా సోవియట్ రిపబ్లిక్ మాత్రమేగాక, సోషలిస్టు రిపబ్లిక్ కూడా అయిందని చెప్పడానికి వీలౌతుందని ఆయన స్పష్టం చేశాడు. "ఈ సమయానికి సాధారణ నినాదం" అనే రెండో అంశంలోకి వెడుతూ ఆయన, పై కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు ముందుగా చెయ్యాల్సింది ఏమంటే, యుద్ధం చేతా, బూర్జువా పాలన చేతా ధ్వంసమైన ఉత్పాదక శక్తులను పునరుద్ధరించడం, గాయాలను మాన్పడం, ఆర్థిక పునరుజ్జీవాన్ని సాధించడం, ప్రాథమిక సువ్యవస్థకు విశ్వసనీయమైన రక్షణ కల్పించడం, పౌర జీవనాన్ని నిలబెట్టుకునే ఈ ప్రాథమిక సమస్యల్ని ఆచరణలో పరిష్కరిస్తేనే సోషలిజానికి పరివర్తనను సోవియట్ ప్రభుత్వం సాధిస్తుంది. కనుక ఈ సమయానికి అవసరమైన నినాదాలు ఇవి.

"డబ్బుకు క్రమబద్ధంగా, నిజాయితీగా లెక్కలు రాయండి!" "తక్కువ ఖర్చుతో పనులు నిర్వహించండి" "సోమరిగా ఉండకండి" "దొంగి

లించకండి!" "ఖచ్చితమైన శ్రమ క్రమశిక్షణను పాటించండి!" అనేవి. ఈ నినాదాల్ని శ్రామిక ప్రజలు ఆచరణలో పెట్టడమే సామ్రాజ్యవాద యుద్ధంచేతా, కెరెన్స్కీ నాయకత్వం వహించిన సామ్రాజ్యవాద దోపిడీ వలన పీల్చి పిప్పి చేయబడిన ఈ దేశం మోక్షానికి ఒకే ఒక్క షరతని ఆయన వక్కాణించాడు. జారిజాన్ని కూలదోసి సంవత్సరం మాత్రమే అయ్యిందనీ, కెరెన్స్కీ నుండి విముక్తమై ఆరు నెలలు కూడా కాలేదనీ, అందువల్ల సహజంగానే సన్నకారు రైతుల దేశంలో అరాజకత్వం ఎక్కువగా ఉంటుందనీ, దీనికి తోడు యుద్ధంవల్ల జనించే పాశవికత్వం చేత అది తీవ్రమైందనీ, దాన్ని బూర్జువా వర్గ గులాములు (మెన్షివిక్కులు, మితవాద ఎస్.ఆర్.లు) రెచ్చగొట్టారనీ, అలాంటి మనస్థితి కలిగిన ప్రజల్లో మార్పు తీసుకు రావడానికి – వర్గ చైతన్యం కలిగిన కార్మికులూ, కర్షకులూ పట్టువిడవని ప్రయత్నాలు చెయ్యాలనీ, అలాంటి పరివర్తన వల్లనే అధిక సంఖ్యాకులైన రైతు బూర్జువావర్గం మీద విజయాన్ని పూర్తి చెయ్యగలమని ఆయన చెప్పాడు.

"బూర్జువా వర్గంమీద పోరాటంలో కొత్త దశ" అనే మూడో అంశంలోకి వెడుతూ ఆయన ప్రస్తుతం రష్యాలో బూర్జువా వర్గం జనించ బడిందనీ, నిర్మూలింపబడనందున, ఇప్పుడు మనకు ఆ వర్గంమీద ఓ కొత్త, మరింత ఉన్నత పోరాట రూపం – వారి ఆస్తిని అదుపు చేసే అతి సరళమైన కర్తవ్యం నుండి, ఆ వర్గం ఉండడానికిగానీ, కొత్త బూర్జువా వర్గం ఉత్పన్నం కావడానికి గానీ అసాధ్యమయ్యే పరిస్థితులు సృష్టించడం అనే జటిలమైన కర్తవ్యానికి పరివర్తన ఎదురైంది. ఇది నెరవేరిందాకా సోషలిజం అనేది ఉండదు.

నిర్ణయాత్మకమైన దానిని చెయ్యాలని, నిర్ణయాత్మకమైంది ఏమిటంటే, సరుకుల ఉత్పత్తి, పంపకాల కచ్చితమైన లెక్కలు రాయడమూ, అజమాయిషీ. మనం బూర్జువావర్గం నుండి తీసుకున్న వ్యాపార సంస్థలలోనూ, ఆర్థిక శాఖ ల్లోనూ లెక్కలు రాయడమూ, అజమాయిషీ ఇంకా ప్రవేశపెట్టలేదనీ, ఇది లేకుండా సోష లిజం ప్రవేశపెట్టడానికి రెండో ముఖ్యమైన షరతు అయిన జాతీయ ప్రమాణంలో శ్రమ ఉత్పాదకతను పెంచడమూ అనేదాన్ని జయించడ మనీ ఆయన చెప్పాడు.

కనుక ఇప్పుడు పెట్టుబడి మీద దాడుల్ని ఆపి, లెక్కలు రాయడాన్నీ, అజమాయిషీని ఏర్పాటు చేయడం మీదా మనం దృష్టిని కేంద్రీ కరించాలని ఆయన చెప్పాడు. ఇలా అనడం వల్ల పెట్టుబడి మీద యుద్ధంలో పురోగతిని

> **"అయితే విప్లవాన్ని ప్రతిఘటించే మిలిటరీ, బూర్జువా, భూస్వాముల మీద 'రెడ్‌గార్డ్స్' అణచివేతను ఏమాత్రం విసర్జించం కానీ బూర్జువా నిపుణుల్ని ఉపయోగించు కోవాల్సిన సమయంలో, 'రెడ్‌గార్డ్స్' పద్ధతుల్ని అగ్రస్థానంలో పెట్టేటంత తెలివి తక్కువగా ఉండం అన్నాడు లెనిన్."**

ఆపినట్టు కాదు. పెట్టుబడికి ఇతోధిక ఆస్తి హరణాన్ని విసర్జించే ఆలోచనే ఉండజాలదు. మన ఉద్దేశ్యం ఏమిటంటే మన ఆర్థిక, రాజకీయ కృషి కేంద్రాన్ని మార్చడం. ఇంతవరకూ ఆస్తిహక్కుల, ఆస్తిహరణకు తీసుకునే చర్యలు అగ్రస్థానంలో ఉన్నాయి. ఇప్పుడు ఆస్తిహరణ చెయ్యబడ్డ ఆస్తి పరుల వ్యాపార సంస్థల్లో, ఇతర వ్యాపార సంస్థ లన్నింటిలో లెక్కలు రాయబడ్డ అజమాయిషీని వ్యవస్థీకరించడం అగ్రస్థానానికి చేరుకుంటుంది.

పై విషయాన్ని తేటతెల్లంగా వివరించేం దుకు ఒక మిలిటరీ ఉదాహరణ ఇచ్చాడు లెనిన్. శత్రుభూభాగంలో అధిక భాగాన్ని పట్టుకొన్నాక, తన బలాలను సమీకరించుకోవడానికీ, మందు గుండు సరఫరాలను భర్తీచేసుకోవడానికి, రవాణా మార్గాల్ని పటిష్టం చేసుకొని కొత్త రిజర్వు దళాల్ని తెచ్చుకోవడం వగైరాల కోసం విజేత సైన్యం తన దాడులను నిలుపుదల చేయడం అవసరం. సరిగ్గా ఈ స్థితిలో తమ ప్రభుత్వం ఉన్నదని ఆయన చెప్పాడు. పూర్వపు వేగంతోనే మనం ఇప్పుడు కూడా ఆస్తిహరణం చెయ్యడం కొన సాగిస్తే, మనకు నిశ్చయంగా ఓటమి తప్పదు. ఎందుకంటే, కార్మికవర్గపు లెక్కలు రాయడం, అజమాయిషీ చెయ్యడమనే పని – ఆస్తిహరణం చేసే పని కన్నా వెనుకబడింది. ఆ వెనుకబడిన పనిమీద ఇప్పుడు మన ప్రయత్నాలను సాంద్రీ కరిస్తే, గడిచిపోయిన కాలానికి భర్తీ చేసుకొని, పెట్టుబడిమీద "దాడి"లో పూర్తిగా గెలుస్తామని ఆయన చెప్పాడు.

అయితే మనం పెట్టుబడి మీద "రెడ్‌గార్డ్స్" దాడి చేశామని బూర్జువావర్గ గులాములు నిందించారు అది అసంబద్ధం. ఒకప్పుడు అలాంటి 'రెడ్‌గార్డ్' దాడి తప్పనిసరైంది. ఎందుకంటే అప్పుడు పెట్టుబడి, కెరెన్స్కీ, క్రసోవ్‌ల ద్వారా మిలిటరీ ప్రతిఘటన చేసింది. (ఇప్పుడు కూడా బొగయేవ్‌స్కీ అలాంటి పనే చేస్తున్నాడు) మిలిటరీ ప్రతిఘటనను మిలిటరీ పద్ధతుల్లోనే భగ్నం చెయ్యాలి కదా! అంతేగాక ఆ సమయంలో అణచివేత స్థానంలో పరిపాలనా పద్ధతుల్ని అగ్రస్థానంలో పెట్టలేకపోయాం. ఎందుకంటే పరిపాలన అనే కళలో అప్పుడు మనకు అనుభవం లేదు. ఆ కళ సహజ సిద్ధమైంది కాదు. కేవలం అనుభవం ద్వారానే వస్తుంది. ఇప్పుడు మనకందులో అనుభవం ఉంది. అంతేగాక జ్ఞాన, సాంకేతిక రంగాల నిపుణులు మన వశంలో లేరు. తూట్లు పొడవడం ద్వారా వారు ప్రతిఘటించారు. ఇప్పుడు ఆ తూట్లు పొడవడాన్ని భగ్నం చేశాం. అయితే విప్లవాన్ని ప్రతిఘటించే మిలిటరీ, బూర్జువా, భూస్వాముల మీద 'రెడ్‌గార్డ్' అణచివేతను ఏమాత్రం విసర్జించం కానీ బూర్జువా నిపుణుల్ని ఉపయోగించుకోవాల్సిన సమయంలో, 'రెడ్‌గార్డ్స్' పద్ధతుల్ని అగ్రస్థానంలో పెట్టేటంత తెలివి తక్కువగా ఉండం అన్నాడు లెనిన్.

వివిధ జ్ఞానరంగాలలోని నిపుణుల మార్గ దర్శకత్వం లేకుండా సోషలిజానికి పరివర్తన అసాధ్యం. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ కంటే ఎక్కువ సామూహిక శ్రమ ఉత్పాదనను తన సొంత పద్ధతిలో సోషలిజం సాధించాలి. మనం అధికారాన్ని చేపట్టిన వెంటనే లెక్కలు రాయడం, అజమాయిషీ వ్యవస్థీకరణ సమస్యల్ని పరిష్కరించి ఉంటే, బూర్జువా నిపుణుల తూట్లు పొడవడాన్ని భగ్నంచేశాక, లెక్కలు రాయడం వగైరాలతో ఆ నిపుణుల్ని మనం లోబరుచుకొనే వాళ్ళం. కానీ లెక్కలు రాయడం వగైరాల్ని ఆలస్యం చేయటం వల్ల, బూర్జువా నిపుణులు మన వశంలో లేరు. అందువల్ల వారి సేవల్ని వినియోగించుకోవడానికి మనం పాత బూర్జువా పద్ధతి (అనగా పెద్ద జీతాలకు) లేదా కొత్త, కార్మికవర్గ పద్ధతి (అనగా లెక్కలు రాయడం వగైరాలను క్రింది నుండి సృష్టించటం, ఈ పరిస్థితి అనివార్యంగా దానికదే నిపుణల్ని అణచి, మన పనిలోకి చేర్చగలిగి ఉంటుంది)లో అయినా వినియో గించుకోవాలి. అయితే ఇప్పుడు మనం పాత బూర్జువా పద్ధతిలో వారి'సేవ'లకు పెద్ద ఖరీదు చెల్లించాల్సి వస్తోంది. ఈ చర్య స్పష్టంగా ఒక రాజీఅంతేగాక, ఈ చర్యకు అర్థం,

> **“తమ ఉత్పత్తికీ, వినిమయానికీ త్రికరణశుద్ధిగా లెక్కలు రాసి, శ్రమను పొదుపు చేసి, శ్రమ ఉత్పాదతకతను స్థిరంగా పెంచడం ద్వారానే పని దినాన్ని ఎనిమిది గంటల నుండి తక్కువ గంటలకు తగ్గించడం సాధ్యమవుతుంది. అప్పుడే ఉత్పాదకుల, వినిమయదారుల కమ్యూన్‌ల సమహారంగా సోషలిస్టు రాజ్యం ఉద్భవిస్తుందని ఆయన చెప్పాడు.”**

పెట్టుబడిమీద దాడిని ఒకానొక రంగంలో, ఒకానొక అర్థంలో ఆపివేయడం మాత్రమే కాదు, పెద్ద జీతాలను సగటు కార్మికుని వేతనాల స్థాయికి తగ్గించే సోషలిస్టు సోవియట్ రాజ్యాధికారానికి ప్రజా కమిస్సార్ల, సీనియర్ ప్రభుత్వోద్యోగుల జీతాల ఉత్తరువు 1917 నవంబర్ 18న వెలువడింది. ఈ ఉత్తరువు మేరకు ప్రజా కమిస్సార్ల గరిష్ట జీతం ఒక కార్మికుడి సగటు వేతనానికి దాదాపు సమానంగా ఉంటుంది. అయితే ఈ ఉత్తరువు నిపుణుల వేతనాలకు, పరిమితి విధించలేదు. అందువల్ల శాస్త్రజ్ఞులకూ, సాంకేతిక నిపుణులకూ అధిక జీతాలిచ్చారు. ఇది ఒక వెనుకడుగు కూడా. మనం వెనుకడుగు వేస్తున్నామని ఒప్పుకుంటున్నందుకు కొంతమంది (మెన్షివిక్కులూ, మితవాద ఎస్.ఆర్.లూ వగైరా సన్నకారువాళ్ళు) కిచకిచ నవ్వుతారు. వాటిని మనం పట్టించు కోకుండా, మన పొరపాట్లనూ, బలహీనతలనూ మరుగు పరచకుండా, సోషలిజానికి పోయే మహాకష్టమైన కొత్తదారి నిర్దిష్ట లక్షణాలను అధ్యయనం చేయాలి. అంతే తప్ప మన బలహీనతలను మరుగుపర్చడం అనేది ప్రజలను మోసగించడమేగాక, బూర్జువా రాజకీయ వాదుల స్థాయికి దిగజారడమే అవుతుందని స్పష్టం చేశాడు లెనిన్. ఈ వెనుకడుగు మనం ఎందుకు వేసిందీ వివరించి, గడిచిపోయిన కాలాన్ని భర్తీచేసే మార్గాల గురించి బహిరంగంగా చర్చించి, అంటే ప్రజలకు బోధించడమూ, అనుభవం ద్వారా నేర్చుకోవడమూ – ఇదంతా సోషలిజాన్ని ఎలా నిర్మించాలో ప్రజలతో కలిసి నేర్చుకోవడమన్న మాట! విజేత కొన్ని తప్పులు చెయ్యకుండా, పాక్షిక అపజయాలు అనుభవించకుండా, తాత్కాలికంగా ఏదో ఒకటి వదులుకోకుండా, కొన్నిచోట్ల తిరోగమించకుండా చరిత్రలో ఏ ఒక్క విజయవంతమైన దండయాత్ర జరగలేదనీ, పెట్టుబడి మీద మన ‘దండయాత్ర’, అత్యంత కష్టమైన మిలిటరీ దండయాత్ర కన్నా పది లక్షల రెట్లు కష్టమైనదనీ, ఒక పాక్షిక తిరోగమనం కారణంగా నిరాశకు లోను కారాదనీ ఆయన వివరించాడు.

అనంతరం ఆయన నాలుగో అంశమైన “సార్వజనీన లెక్కలు రాయడం, అజమాయిషీల కొరకు చేసే కృషి ప్రాముఖ్యం” గురించి రాస్తూ, శతాబ్దాల తరబడి ప్రజా పీడనలో అంగంగా ఉన్న రాజ్యం–రాజ్యానికి సంబంధించిన ప్రతిదాని పట్లా ప్రజలకు ద్వేషాన్నీ, అనుమానాన్నీ కలిగించే వారసత్వాన్ని ఇచ్చిపోయింది. దీన్ని అధిగమించడానికి సోవియట్ ప్రభుత్వానికి కూడా ఎంతోకాలం, గొప్ప పట్టుదలా అవసరం అంటాడు లెనిన్. బూర్జువా వర్గపు, ప్రత్యేకంగా పెటీ బూర్జువా వర్గపు సరళ అలవాట్లూ ప్రభుత్వ అజమాయిషీని వ్యతిరేకించి, “పవిత్రమైన సొంత ఆస్తి, పవిత్రమైన సొంత వ్యాపారం అనుల్లంఘనీయమని చెబుతాయి. అందుచేత తిండీ, బట్టల సంపాదన “సొంత విషయంగా, క్రయ విక్రయాలు తనకు మాత్రమే సంబంధించిన వ్యవహారంగా పరిగణించేట్లు ప్రజలకు నేర్పిన కుళ్ళిన గతంతో తెంచుకోవడానికి మనం చేసే పోరాటం, సోవియట్ ప్రభుత్వ అజమాయిషీ వగైరా భావాల్ని ప్రజల మనసుల్లోకి ఎక్కించడానికి మనం చేసే పోరాటం – ఇది ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యం గల మహా పోరాటమనీ, ఇది సోషలిస్టు చైతన్యానికీ, బూర్జువా అరాజకవాదానికీ మధ్య పోరాటమనీ ఆయన చెప్పాడు.

మనం కార్మికవర్గ అజమాయిషీని శాసనంగా ప్రవేశపెట్టాంగానీ, అది అమలు జరుగుతోంది ఇప్పుడిప్పుడే. ఉత్పత్తి, పంపకాలలో అజమాయిషీ లేకపోవడమంటే సోషలిజం బీజాల తిరోగమనమనీ, ప్రభుత్వ నిధుల అపహరణ అని ఆందోళనలో తగినంతగా మనం వివరించడం లేదంటాడాయన. కార్మికుల అజమాయిషీ వాస్తవం అయిందాకా, ఈ అజమాయిషీని ఉల్లంఘించే వాళ్ళమీదా, అజాగ్రత్తగా ఉన్నవాళ్ళ మీదా కార్మికుల నిర్దాక్షిణ్యపు దాడిని ఏర్పాటు చేసిందాకా సోషలిజం వైపు వేసే మొదటి అడుగు నుండి రెండో అడుగుకు పురోగమించడం, అనగా ఉత్పత్తి మీద కార్మికుల నియంత్రణ పురోగమించడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశాడు.

తమ ఉత్పత్తికీ, వినిమయానికీ త్రికరణశుద్ధిగా లెక్కలు రాసి, శ్రమను పొదుపు చేసి, శ్రమ ఉత్పాదతకతను స్థిరంగా పెంచడం ద్వారానే పని దినాన్ని ఎనిమిది గంటల నుండి తక్కువ గంటలకు తగ్గించడం సాధ్యమవుతుంది. అప్పుడే ఉత్పాదకుల, వినిమయదారుల కమ్యూ న్‌ల సమహారంగా సోషలిస్టు రాజ్యం ఉద్భవిస్తుందని ఆయన చెప్పాడు.

ఇటీవలే జారీచేయబడ్డ “వినిమయదారుల సహకార సంఘాలను గురించిన శాసనం” ఒక ముఖ్యమైన సంఘటన అని ఆయన భావించాడు. ఆ శాసనం బూర్జువా సహకార సంఘాలతో కుదిరిన ఒక రాజీ అనీ, ఆ రాజీవల్ల ప్రవేశ రుసుం లేకుండా కొత్త సభ్యుల్ని సహకార సంఘాల్లో చేర్చుకోవాలనే అకాంక్షను సోవియట్ ప్రభుత్వం వదులుకున్నదనీ, అంతేగాక, ఒక ప్రాంతంలో గల ప్రజలందర్నీ ఒకే ఒక సహకార సంఘంలో ఐక్యం చెయ్యాలనే ఆకాంక్షను కూడా వదులుకోవాల్సి వచ్చిందనీ ఆయన గుర్తుచేశాడు. అంతేగాక సహకార సంఘాల బోర్డుల నుండి బూర్జువాల్ని పూర్తిగా తొలగించాలనే ప్రతిపాదన కూడా మార్చబడి, సొంత పెట్టుబడి గల యజమానుల్ని మాత్రమే బోర్డుల్లో ఉండకుండా చేయడం జరిగిందని ఆయన చెప్పాడు. జాతీయ ప్రమాణంలో అజమాయిషీ, లెక్కలు రాయడం వగైరాలను ఏర్పాటు చేసుకోగలిగి ఉంటే, ఈ రాజీ అవసరమయ్యేది కాదని ఆయన చెప్పాడు.

ఆ తర్వాత ఆయన “శ్రమ ఉత్పాదకతను పెంచడం” అనే అయిదో అంశానికి వెడుతూ, ప్రతి సోషలిస్టు విప్లవంలోనూ కార్మికవర్గం అధికారాన్ని చేపట్టిన తర్వాత, ఆస్తిహర్తల ఆస్తిహరణం చేసి, వాళ్ళ ప్రతిఘటనను అణచిన తర్వాత ఎదురయ్యే కర్తవ్యం ఏమిటంటే శ్రమ ఉత్పాదకతను పెంచడం, శ్రమ వ్యవస్థీకరణను సాధించడమేనని లెనిన్ చెబుతాడు. అయతే ఇక్కడ గమనించాల్సిందేమిటంటే కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడం కొద్దిరోజుల్లో, అలాగే దేశంలోని భిన్న ప్రాంతాల్లో మిలిటరీ ప్రతిఘటనను అణిచెయ్యడం కొద్ది వారాల్లో సాధ్యంకావచ్చు. కానీ శ్రమ ఉత్పాదనను పూర్తి స్థాయిలో పెంచడానికి పలు సంవత్సరాలు పడతాయని చెబుతూ ఆయన, ఈ పని దీర్ఘత్వం వస్తుగత పరిస్థితుల చేతనే నిర్ణయించబడుతుందని అంటాడు.

శ్రమ ఉత్పాదకతను పెంచడానికి మొదట అవసరమయ్యే భారీ పరిశ్రమలకు కావలసిన

ముడి పదార్థాలు, రసాయన, ఇంజనీరింగ్ పరిశ్రమల అభివృద్ధి, బ్రెస్ట్ శాంతి సంధి తర్వాత కూడా మనకు అవసరమైన ముడి ఖనిజ నిధులు అపారంగా ఉన్నందున, ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వాటిని అభివృద్ధి చేస్తే అందుబాటులోకి వస్తాయని ఆయన చెప్పాడు. శ్రమ ఉత్పాదకతను పెంచడంలో మరో షరతు, ప్రజల విద్యా సాంస్కృతిక స్థాయిని పెంచడం. ఈ రంగం ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోంది.

ఆర్థికరంగ పునరుద్ధరణకు ఒక షరతు, శ్రామిక ప్రజల క్రమశిక్షణనూ, నైపుణ్యాన్నీ, శ్రమ ప్రయోజనాలనూ పెంచడం. ఈ రంగంలో మాత్రం పరిస్థితి నిరాశాజనకంగా ఉన్నట్లు కనపడుతోంది. బూర్జువా వర్గంచేత బెదరగొట్టబడిన వాళ్ళను నమ్మితే ఇలాగే ఉంటుందని ఆయన అన్నాడు. పాత వ్యవస్థ సమస్యలు అల్లకల్లోలం, అరాజకత్వాల గురించి గోల చెయ్యని విప్లవం యేదీ ఉండదని చెబుతూ, శృంఖలాలను ఇప్పుడిప్పుడే తెంచుకున్న వారిలో తీవ్ర సంచలనమూ, ఉద్వేగమూ ఉంటాయనీ, ప్రజలు క్రమశిక్షణకు నూతన సూత్రాల్ని రూపొందించుకోవడం అనేది దీర్ఘమైన క్రమమనీ, బూర్జువా, భూస్వాముల మీద సంపూర్ణ విజయం సాధించబడిందనే ఈ క్రమం ప్రారంభం కూడా కాలేదనీ ఆయన వివరించాడు.

అయితే బూర్జువాలూ, బూర్జువా మేధావులూ వ్యాపింపజేసే నిరాశ (తమ పాత అధిక సౌకర్యాలను నిలుపుకోగలమనే ఆశ కోల్పోయిన వాళ్ళు)కు ఏ మాత్రమూ లోనుకాకుండా చెడును ఏమాత్రం మరుగుపరచకుండా, దాన్ని వెల్లడిస్తూ, దానితో జరిపే పోరాటంలో సోవియట్ పద్ధతిలో తీవ్రం చేస్తాం. మన కార్మికవర్గంలో చైతన్యంగల అగ్రదళం ఇప్పటికే పని క్రమశిక్షణను పెంచే కర్తవ్యాన్ని చేపట్టింది. దానికి అవసరమైన ఉత్తర్వులు కూడా రూపొందుతున్నాయి. ఈ పనిని మనం బలపరిచి, ఉత్పత్తికి అనుగుణమైన వేతనాలు ఉండేట్లు చూడాలి. ఉత్పత్తిలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాల విజయాలలో విలువైన దానినంతటినీ అవలంభిస్తూ, టైలర్ పద్ధతిలో (అమెరికన్ ఇంజనీర్ అయిన టైలర్, పని దినపు గరిష్ట వినియోగ పద్ధతి స్థాపకుడు) శాస్త్రీయమైన దాన్ని అమలుజరిపి, మన సొంత లక్ష్యాలకు దానిని మలచు కోవాలి. అంతేగాక సోషలిస్టు పద్ధతిలో పోటీని ఏర్పాటు చేస్తూనే, మరొకవైపున, పిరికి గుండె కార్మికవర్గ ప్రభుత్వపు ఆచరణచేత కార్మికవర్గ నియంతృత్వ నినాదానికి అపచారం కలగకుండాఉండేట్లు నిర్బంధం ఉపయోగించాలని ఆయన బోధించాడు.

“ వాణిజ్య లావాదేవీలూ, కాంట్రాక్టులు వగైరాలను "పవిత్ర ఆస్తిహక్కును కాపాడే" వర్తక రహస్యాల చాటున మరుగుపరుస్తుంది. సోవియట్ ప్రభుత్వం వర్తక రహస్యాలను రద్దుచేసిందిగానీ, ఆర్థిక పోటీని ప్రోత్సహించేందుకు పబ్లిసిటీని వినియోగించడానికీ ఏమీ చెయ్యలేదని ఆయన అంగీకరించాడు. ”



ఫ్యాక్టరీలో ఉన్న సోవియట్ కార్మికులు

ఆపై ఆరో అంశమైన "పోటీ ఏర్పాటు చెయ్యడం" గురించి చెబుతూ, సోషలిస్టులు పోటీ ప్రాముఖ్యాన్ని నిరాకరిస్తారని బూర్జువాలు ప్రచారం చేస్తారుగానీ, వాస్తవానికి సోషలిజమే నిజమైన సామూహిక ప్రమాణంలో ఉండే పోటీని ఏర్పరుస్తుందని లెనిన్ అంటాడు. పోటీని ఏర్పాటు చేయడం ఆర్థికరంగంలో కంటే, రాజకీయ రంగంలో సులభమేననీ, సోషలిజం విజయానికి ఆర్థికరంగమే ముఖ్యమంటాడాయన.

ఉదాహరణకు పోటీని ఏర్పాటు చేసే ఒక సాధనమైన పబ్లిసిటీని తీసుకుంటే, బూర్జువా రిపబ్లిక్ పబ్లిసిటీని లాంఛనంగా మాత్రమే కట్టుదిట్టం చేసి, ఆచరణలో పత్రికా రంగాన్ని పెట్టుబడికి లోబరచి, ఉద్వేగకరమైన రాజకీయ 'చెత్త' తో 'మంద'ను వినోదపరుస్తుంది. వాణిజ్య లావాదేవీలూ, కాంట్రాక్టులు వగైరాలను "పవిత్ర ఆస్తిహక్కును కాపాడే" వర్తక రహస్యాల చాటున మరుగుపరుస్తుంది. సోవియట్ ప్రభుత్వం వర్తక రహస్యాలను రద్దుచేసిందిగానీ, ఆర్థిక పోటీని ప్రోత్సహించేందుకుపబ్లిసిటీని వినియోగించడానికీ ఏమీ చెయ్యలేదని ఆయన అంగీకరించాడు. అయితే ఇప్పుడు మనం అబద్ధాలు చెప్పే బూర్జువా పత్రికల్ని అణిచేస్తూనే, రాజకీయ మసాలాలతో ప్రజల్ని వినోదపరిచేందుకు కాక, ప్రతిదిన ఆర్థిక సమస్యల్ని అధ్యయనం చేస్తూ ప్రజల తీర్పుకు తోడ్పడే పత్రికా రంగాన్ని సృష్టించాలని ఆయన చెప్పాడు.

అలాగే కమ్యూన్ల మధ్య పోటీని ఏర్పాటు చేసి, అవి చేసే ఉత్పత్తికి లెక్కలు రాయడం, పబ్లిసిటీని ప్రవేశపెట్టడం చెయ్యాలి. ఆదర్శప్రాయమైన కమ్యూన్లు వెనుకబడిన కమ్యూన్లకు పైకెత్తడానికి తోడ్పడే బోధకులుగా పనిచెయ్యాలి. ఆదర్శప్రాయమైన కమ్యూన్లు సాధించిన విజయాన్ని సకల వివరాలతో వెల్లడించాలి. అతి శ్రేష్టమైన కమ్యూన్లకు బహుమతులు (పని దినాన్ని తగ్గించడం, లేదా వేతనాలు పెంచడం, లేదా సాంస్కృతిక, కళాత్మక సౌకర్యాలు ఎక్కువ కల్పించడం మొ॥నవి) ఇచ్చేట్లు చేస్తూ, ఆ వివరాలు ప్రజల వద్దకు తీసుకుపోయి జనరంజకం చెయ్యాలి అని సూచించాడాయన.

కొత్తదనం సమాజపు నాయకుడుగా రంగస్థలం మీదికి వచ్చినప్పుడు, కొత్త పద్ధతుల్ని వస్తుగత పరిస్థితులకు అనుగుణంగా ఎన్నుకున్నప్పుడు, అనిశ్చితమైన అడుగులూ, తటపటాయింపులూ తప్పవు. బూర్జువా విప్లవం తర్వాత, ఓటమి చెందిన ఫ్యూడల్ ప్రభుత్వాలు కుట్రలతో, తిరుగుబాటు వగైరా ప్రయత్నాలలోనే గాక, రాజ్యాధికారం స్వీకరించిన "పొగరుబోతుల' నైపుణ్య రాహిత్యం మీదా, పొరపాట్ల మీదా అపహాస్యం కుమ్మరించడం ద్వారా కూడా తన కసిని తీర్చుకున్నారని లెనిన్ చెప్పాడు. అలాగే

> **"పూర్వపు విప్లవాల దురదృష్టం ఏమిటంటే, ప్రజలను ఉద్విగ్నస్థితిలో నిలిపి, విచ్ఛిత్తి అంశాలను నిర్దాక్షిణ్యంగా అణిచివెయ్యడానికి వారికి బలం ఇచ్చిన విప్లవోత్సాహం ఎక్కువ కాలం ఉండలేదు. ఈ విప్లవోత్సాహపు అస్థిరతకు ప్రధాన కారణం కార్మికవర్గపు బలహీనతేనని ఆయన విశ్లేషించాడు."**

ఇప్పుడు కోర్నీలోవ్‌లూ, కేరెన్‌స్కీలూ బూర్జువా దగాకి చెందిన ఈ వీరులు అధికారం స్వీకరించడానికి "సాహసించిన" రష్యా కార్మికవర్గం మీద కూడా కసితీర్చుకుంటారని ఆయన చెప్పాడు. ఈ కొత్త సామాజిక వర్గం ఇంతదాకా దారిద్ర్యం చేతా, అజ్ఞానం చేతా అణచివేయబడి, తన కొత్త స్థానానికి అలవాటుపడటానికీ, తన సొంత ఆర్గనైజర్లను పెంపొందించుకోవడానికి ఏళ్ళు పడుతుంది. అయితే కార్మికులలో, శ్రమదోపిడీ చెయ్యని రైతుల్లో సంఘటన ప్రజ్ఞ అపారంగా ఉన్నప్పటికీ, పెట్టుబడి వారిని చెత్త కుప్పలో పడవేయడం వల్ల, వారిని కనుక్కొమని ప్రోత్సహించకున్నప్పటికీ, విప్లవోత్సాహంతో మనం పూనుకొని ఆ పని చేస్తామని ఆయన చెప్పాడు.

ఇక "సుసంఘటిత సంస్థ" నియంతృత్వం" అనే ఏదో అంశం గురించి చెబుతూ, ఇటీవలి సోవియట్ల మహాసభను సంఘటిత సంస్థను నెలకొల్పడమూ, క్రమశిక్షణను పెంచడమూ ఇప్పటి ప్రాథమిక కర్తవ్యంగా నిర్దేశించిన విషయాన్ని గుర్తుచేశాడు. ఈ తీర్మానాల అమలుకు నియంతృత్వ రూపంలో నిర్బంధం అవసరమనే విషయం జనాలు ఆలోచించరని ఆయన చెప్పాడు. అయితే చరిత్రలోకెల్లా ఘోరమైన ఒక యుద్ధం సృష్టించిన దారుణమైన ఆర్థిక విధ్వంసం మధ్య అభివృద్ధి చెందే దేశానికి – కోర్నీలోవ్ నియంతృత్వమో, కార్మికవర్గ నియంతృత్వమో తప్ప మధ్యేమార్గం లేదు. అలా మధ్యేమార్గం చెప్పే బూర్జువా వర్గం ప్రజల్ని మోసగిస్తోంది. ఎందుకంటే వారు సత్యాన్ని చెప్పే సాహసం చెయ్యలేరు అంటాడాయన.

మరోవైపున పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజానికి జరిగే ప్రతి పరివర్తనలోనూ రెండు కారణాల వల్ల, రెండు ప్రధాన మార్గాలలో నియంతృత్వం అవసరమవుతుంది. మొదటిది, పెట్టుబడిదార్ల సంపదా, వారి సౌకర్యాలు వెంటనే తొలగించబడును కాబట్టి, చాలాకాలం పాటు వాళ్ళు బీదల పాలనను కూలదోయడానికి ప్రయత్నిస్తారు.



వి ఐ లెనిన్

అలాంటి ప్రతిఘటనను నిర్దాక్షిణ్యంగా అణచివేయకుండా, పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మూలించబడజాలదు. రెండోది ప్రతి గొప్ప విప్లవమూ, ముఖ్యంగా సోషలిస్టు విప్లవం, బాహ్య యుద్ధం లేకున్నా, అంతర్యుద్ధం లేకుండా ఉండదు. ఈ అంతర్యుద్ధం బాహ్య యుద్ధం కన్నా వినాశకరం! ఇందులో లక్షల ఊగిసలాటలూ, పక్షాల మార్పులూ, అల్ల కల్లోల స్థితి ఉంటాయి. సహజంగా పాత సమాజపు విచ్ఛిత్తికి చెందిన అంశాలన్నీ, ముఖ్యంగా పెటీ బూర్జువా వర్గంతో సంబంధం గలవి (ప్రతి యుద్ధము, సంక్షోభము, మొదట నాశనం చేసేది పెటీ బూర్జువా వర్గాన్నే) అలాంటి విప్లవ కాలంలో తమ్ము తాము 'వ్యక్తం' (నేరం, ఆకతాయితనం, లంచగొండితనం, సట్టా వ్యాపారం రకరకాల అత్యాచారాల ద్వారా) చేసుకుంటాయి. వీటిని అణచడానికి కాలంతో పాటు, నిర్దాక్షిణ్యమైన దండనా అవసరం! పూర్వపు విప్లవాల దురదృష్టం ఏమిటంటే, ప్రజలను ఉద్విగ్నస్థితిలో నిలిపి, విచ్ఛిత్తి అంశాలను నిర్దాక్షిణ్యంగా అణిచివెయ్యడానికి వారికి బలం ఇచ్చిన విప్లవోత్సాహం ఎక్కువ కాలం ఉండలేదు. ఈ విప్లవోత్సాహపు అస్థిరతకు ప్రధాన కారణం కార్మికవర్గపు బలహీనతేనని ఆయన విశ్లేషించాడు.

నియంతృత్వం దోపిడీదార్లను, ఆకతాయిలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తుంది. అయితే మన ప్రభుత్వం ఉక్కులాగా గాక, దూదిలా మెత్తగా ఉంది. ప్రస్తుతం బూర్జువా, పెటీ బూర్జువా వర్గం రెండు మార్గాల్లో పోరాడుతోంది. ఒక వైపున కోర్నీలోవ్ పద్ధతులద్వారా, కుట్రలూ, తిరుగుబాట్ల ద్వారా వాటి 'మురికి' సిద్ధాంతం అయిన కాన్‌స్టిట్యూషన్ డెమోక్రటిక్, మెన్షివిక్ వగైరాల పత్రికావళిలోని అబద్ధాల ద్వారా, మరోవైపున లోపల నుండి పనిచేస్తూ, లంచంతో, క్రమశిక్షణా రాహిత్యాన్నీ, నిర్లక్ష్యాన్ని, అల్లకల్లోలాన్నీ పెంచడం ద్వారా, బూర్జువా వర్గపు అణచివేతను మనం సమీపించినకొద్దీ, పెటీ బూర్జువా అరాజక శక్తి మరింత ప్రమాదకరమవుతుంది. మరి ఈ శక్తితో పోరాటం ప్రచారాందోళనలతో, పోటీ ఏర్పాటు వగైరాల ద్వారా పూర్తికాదు, నిర్బంధం కూడా అమలు చెయ్యాలి అంటాడాయన. అయితే ప్రభుత్వ కర్తవ్యం మిలటరీ అణచివేత కాక పరిపాలన సాగేకొద్దీ, అణచివేత కాల్చివేయడంగాక, కోర్టు తీర్పు అవుతుంది. ఈ విషయంలో విప్లవ ప్రజలు తమ సొంత కార్మికుల, రైతుల కోర్టులు నెలకొల్పినా, అవి కూడా దుర్బలంగానే ఉన్నాయి. అంతేగాక, కోర్టుల్ని పరాయివిగా చూసే ప్రజల వైఖరి (బూర్జువాల పెత్తనం నుండి సంక్రమించిన వైఖరి)ని ఇంకా వదులుకోలేదని ఆయన చెప్పాడు.

ప్రస్తుతం రష్యా దౌర్భాగ్యాలయిన ఆకలీ, నిరుద్యోగాలను ఉత్పత్తి పెంచడం, సక్రమ పంపకాల ద్వారా అధిగమించగలం. ఆ కృషిలో వ్యవస్థీకరణ, క్రమశిక్షణ అవసరమనే విషయానికి ఇంకా తగినంత గుర్తింపు లేదు. అందువల్ల వాటిని ఉల్లంఘించిన వాళ్ళే కరువు, నిరుద్యోగాలకు బాధ్యులని గుర్తించి, వారిని శిక్షించడం ఎలాగో గ్రహించడం లేదు. రైల్వే నిర్వహణలో పెటీ బూర్జువా నిర్లక్ష్యానికీ, కార్మికవర్గ సంఘటనకీ జరిగే పోరాటం స్పష్టంగా ఉంది. రైల్వేలోని పరిపాలక అంశాలలో బోలెడు మంది విధ్వంసకారులూ, లంచగొండులూ ఉన్నారు. రైల్వేల నిర్వహణ గురించి ఇటీవల నిర్వహణాధికార్లకు నియంతృత్వ అధికారాలు ఇచ్చే శాసనానికి (దానికి వ్యతిరేకంగా మెన్షివిక్కులు, సోషలిస్టు రివల్యూషనరీలు, ఆందోళన చేశారు.) సంబంధించిన సదస్సుకు అపార ప్రాముఖ్యత ఉంది. సూత్రానికి సంబంధించిన ప్రశ్న ఏమంటే, అపరిమిత అధికారాలు గల నియంతలను నియమించడం సోవియట్ ప్రభుత్వ మౌలిక సూత్రాలకు అనుగుణంగా ఉందా? అనేది. సూటి అయిన జవాబు ఏమంటే, సోవియట్ ప్రజాస్వామ్యానికీ, వ్యక్తులు నియంతృత్వ అధికారాలు

చలాయించడానికీ మధ్య సూత్రరీత్యా వైరుధ్యం బొత్తుగా లేదు అనేది. బూర్జువా నియంతృత్వం కూడా వ్యక్తుల ద్వారానే చలాయించబడినా, శ్రామిక నియంతృత్వంలో వ్యక్తుల చేత, సంస్థల చేత (సోవియట్ సంస్థలు అలాంటివి) కూడా నియంతృత్వం చలాయించబడుతుంది. ఇక ఈ విషయంలో రైల్వేలలో వ్యక్తి నియంతృత్వం సంగతి చూద్దాం. భారీ యంత్ర పరిశ్రమ – వేలాది మనుషుల సంయుక్త శ్రమకు దర్శకత్వం వహించే దాన్ని ఆపేక్షిస్తుంది. సోషలిజం యొక్క షరతుల్లో ఇదొకటి. అయితే కచ్చితమైన ఇచ్ఛా ఏకత్వం ఎలా నిస్సందేహం చేయబడుతుదంటే, వేలాది మంది తమ ఇచ్ఛనే ఒకని ఇచ్ఛకు లోబరచడం ద్వారా అని ఆయన స్పష్టం చేశాడు. ఈ సమిష్టి కృషిలో పాల్గొనే వాళ్ళలో వర్గ చైతన్యమూ, క్రమశిక్షణా ఉంటే, ఈ లోబరచడం సంగీత దర్శకత్వంలా మెత్తగా ఉంటుంది. అలాంటిక్రమ శిక్షణ, వర్గ చైతన్యం లేకపోతే గనుక, అది నియంతృత్వ రూపాన్ని తీసుకుంటుందంటాడాయన.

“సోవియట్ వ్యవస్థీకరణ అభివృద్ధి” అనే ఎనిమిదో అంశానికి వస్తూ, సోవియట్ ప్రజాస్వామ్యంలోని సోషలిస్టు స్వభావం ఏమిటో చెబుతూ ఆయన, మొదటిది ఓటర్లు దోపిడీ చేయబడే శ్రామిక ప్రజలు కాగా, బూర్జువా వర్గానికి ఓటు హక్కు మినహాయించబడింది. రెండోది ఎన్నికలకు సంబంధించి బ్యూరోక్రటిక్ తతంగాలూ, నిర్బంధాలు రద్దు చేయబడ్డాయి. ప్రజలు తామే ఎన్నికల క్రమాన్నీ, కాలాన్నీ నిర్ణయిస్తారు. ఎన్నికైన ఏ వ్యక్తినైనా ఎప్పుడైనా దించేసే సంపూర్ణ స్వేచ్ఛ వారికి ఉంది. మూడోది శ్రామిక ప్రజల అగ్రదళం యొక్క, అనగా భారీ పరిశ్రమలో నిమగ్నమైన కార్మికవర్గం యొక్క అత్యుత్తమ సామూహిక వ్యక్తీకరణ సృష్టించబడింది. దీని మూలంగా కార్మికవర్గం దోపిడీ చేయబడే అపార జన బాహుళ్యానికి నాయకత్వం వహించి, వారిని స్వతంత్ర రాజకీయ జీవితంలోకి ఆకర్షించి, వారి సొంత అనుభవం ద్వారానే వారిని రాజకీయంగా తర్ఫీదు చేయగలదు. కనుక, మొదటిసారిగా, యావత్తు ప్రజానీకం పరిపాలన కళను నేర్చుకోవడానికీ, పరిపాలించడం మొదలు పెట్టడానికి ప్రారంభం జరిగిందని లెనిన్ చెప్పాడు. ఇప్పుడు రష్యాలో ప్రయుక్తమైన ఉన్నత రకం ప్రజాస్వామానికి – ప్రజాస్వామ్యం యొక్క బూర్జువా వక్ర రూపంతో తెంచుకున్న సోషలిస్టు ప్రజాస్వామ్యానికి, రాజ్యం కృశించిపోవడం ప్రారంభించగల పరిస్థితులకూ జరిగే పరివర్తనకు – ఇవి ప్రధాన విలక్షణ గుణాలని ఆయన చెప్పాడు.

“శ్రామిక ప్రజలతో సోవియట్లు సాన్నిహిత్యం కలిగి ఉండటం ద్వారానే ఎన్నికైన వాళ్ళను దించివేసే రూపాల్నీ, కింది నుండి అజమాయిషీ చేసే పద్ధతుల్నీ దీక్షతో అభివృద్ధి చేసుకోవాలని ఆయన చెబుతాడు. అయితే సోవియట్లను కరుడుగట్టిన వాటిగా, స్వయం సంపూర్ణమైనవాటిగా మార్చడం పనికిమాలిన పని అంటాడు.”

సోవియట్ల యొక్క, సోవియట్ ప్రభుత్వం యొక్క వ్యవస్థీకరణను అభివృద్ధి చేయడానికి మనం నిర్విరామంగా కృషిచెయ్యాలని చెబుతూ ఆయన, సోవియట్ సభ్యులను బ్యూరోక్రాట్లుగానో, ‘పార్లమెంటేరియన్లు’గానో మార్చే పెటీ బూర్జువా ధోరణితో సోవియట్ల సభ్యుల్నందర్నీ పాలన యొక్క ఆచరణాత్మక కృషిలోకి ఆకర్షించడం ద్వారా మనం పోరాడాలని చెప్పాడు. అలాగే ప్రతి శ్రమజీవీ ఉత్పాదక శ్రమలో తన ఎనిమిది గంటల కర్తవ్యం పూర్తిచేసిన తర్వాత, జీతం లేకుండా రాజ్యవిధులు నిర్వహించేట్లు చెయ్యడం మన లక్ష్యమని చెబుతూ, ఇది చాలా కష్టమైన పని అన్నాడు. అయినప్పటికీ సోషలిజం యొక్క అంతిమ దృష్టీకరణకు ఇది మాత్రమే హామీ ఇస్తుందంటాడు.

అలాగే శ్రామిక ప్రజలతో సోవియట్లు సాన్నిహిత్యం కలిగి ఉండటం ద్వారానే ఎన్నికైన వాళ్ళను దించివేసే రూపాల్నీ, కిందినుండి అజమాయిషీ చేసే పద్ధతుల్నీ దీక్షతో అభివృద్ధి చేసుకోవాలని ఆయన చెబుతాడు. అయితే సోవియట్లను కరుడుగట్టిన వాటిగా, స్వయం సంపూర్ణమైనవాటిగా మార్చడం పనికిమాలిన పని అంటాడు. అలాగే బ్యూరోక్రసీ కలుపు మొక్కల్ని పదే పదే ఏరివేసేందుకు, కింది నుండి అజమాయిషీ చేసే రూపాలూ, పద్ధతులూ విధంగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పాడు.

చివరగా వ్యాసానికి ముగింపునిస్తూ ఆయన, అంతర్జాతీయంగా పరిస్థితి క్లిష్టంగా, ప్రమాదకరంగా ఉన్నదనీ, పశ్చిమ దేశాల్లో విప్లవం బాధాకరమైనంత నిదానంగా పక్వమవుతూ, కొత్త ప్రజ్వలనాల కోసం కాచుకొనే విధంగా ఉన్నదంటాడు. ఇక దేశంలోనయితే, నిర్మాణం నిదానంగా ఉన్నదనీ, మీదపడుతున్న పెటీబూర్జువా నిర్లక్ష్యం మీదా, అరాజకత్వం మీదా కార్మికవర్గ క్రమశిక్షణను కఠినంగా అమలు చేస్తూ పట్టువిడువకుండా పోరాటం చేసేదశ నడుస్తుందని చెప్పాడు.

అయితే ప్రస్తుత దశలో మనదేశంలో నెలకొన్న “అనాహ్లాదకరమైన” స్థితిని గ్రహించలేని కొందరు “విప్లవకారులు”, పలికే విప్లవ పదజాలాలను విన్నప్పుడు ఆగ్రహ పరవశులై, అక్టోబర్ విప్లవ సంప్రదాయాలకు విరుద్ధంగా బూర్జువా నిపుణులతో రాజీపడినందుకు మనమీద తిట్ల పురాణాన్ని సాగిస్తున్నారుగానీ, కష్టమైన ప్రస్తుత సన్నివేశాన్ని అర్థం చేసుకొనే ఓర్పు వారికి లేదని ఆయన చెప్పాడు. సహజంగా వారంతా వామపక్ష సోషలిస్టులని ఆయన చెప్పాడు. చిన్న ఆస్తిపరులైన వారంతా పెటీ బూర్జువా విప్లవకారుల రకానికి చెందిన వారయినందున, సహజంగా వీరు ఘటనల ప్రతిమలుపులోనూ ఊగిసలాడతాడనీ, అతడు 1917 మార్చిలో గాఢమైన విప్లవకారుడుగా ఉన్నాడనీ, మేలో “మిశ్రమ ప్రభుత్వాన్నీ” ప్రశంసించాడనీ, జులైలో బోల్షివిక్కుల్ని ద్వేషించాడనీ, అక్టోబర్ ఆఖరులో కంగారులో వాళ్ళకు పెడమొగంగా ఉండి, డిసెంబర్‌లో వారిని బలపరిచి, చివరికి 1918 మార్చి, ఏప్రిల్‌లలో ఏవగింపు మొహం పెడతాడని ఆయన వ్యాఖ్యానించాడు.

సహజంగా చిన్న ఆస్తిపరుడు యుద్ధ బీభత్సాలచేతా, కరువు, విధ్వంసాల చేతా తలచెడి, బయట పడే మార్గం వెదుకుతూ, గావుకేకలతో అటూ ఇటూ ఉరుకుతూ, ఒక్క క్షణం కార్మికవర్గంలో విశ్వాసం ఉంచి, దాన్ని బలపరిచి, మరుక్షణం నిస్పృహకు లోనవుతుంటారనీ, వారి ఆలోచనల ప్రాపతికదిక మీద సోషలిజం నిర్మించబడజాలదని మనం గ్రహించాలని ఆయన హితబోధ చేశాడు. దోపిడీ చేయబడే శ్రామిక ప్రజల్ని నడిపించగల ఏకైక వర్గం ఏదంటే, అత్యంత కష్టమైన, శ్రమభరితమైన, ప్రమాదకరమైన దశలలో కూడా, ధైర్యం కోల్పోకుండా, నిస్పృహకు లోనుగాకుండా, తన మార్గాన్ని అనుసరించే వర్గం. అపస్మారపు ఆవేశాలు మనకు నిరుపయోగం. మనకు కావలసింది కార్మికవర్గపు ఉక్కు క్రమశిక్షణగల స్థిర పురోగమనమని ఆయన వక్కాణించాడు.

# ఆవు మాంసం అంటరానితనం

డా॥బిఆర్ అంబేద్కర్



రచయిత
భారత రాజ్యాంగ నిర్మాత

కొన్ని కులాలకు చెందినవారు తీసుకునే ఆహారంలో చనిపోయిన ఆవు మాంసం ప్రధానమైనదిగా 1910లో జనాభా లెక్కల నివేదికలో చెప్పబడింది. వారే సహజంగా అంటరాని కులాలకు చెందినవారుగా విభజింపబడినారు. హిందూమతంలోని క్రింది కులాలకు చెందినవారు కూడ గోమాంసాన్ని ముట్టుకోరు. ఇంకొకవైపు అసలు అంటరాని కులం అనేది ఒకటి లేనేలేదు. దానికి గోమాంసానికి ఏ సంబంధం లేదు. కొంతమంది గోమాంసాన్ని తింటారు. కొందరు ఆవు చర్మాన్ని వలుస్తారు. మరికొందరు గో చర్మం, ఎముకల నుండి కొన్ని వస్తువులు తయారుచేస్తారు.

**గోమాంస నిషేధానికి వ్యతిరేకంగా గోడ పత్రికలు:**

అంటరానివారు గోమాంసాన్ని తింటారన్న విషయాన్ని జనాభా లెక్కల కమీషనర్ సర్వే ద్వారా స్థిరపరిచారు. కానీ ప్రశ్న ఏమంటే: గోమాంసాన్ని తినడానికి అంటరానితనం పుట్టుకకు ఏమైనా సంబంధం ఉన్నదా? లేక ఇది (గోమాంసం తినడం) అంటరానివారి యొక్క ఆర్థిక జీవనంలో ఒక సంఘటనా? బక్కచిక్కిన పేదలు గోమాంసాన్ని తింటారు కాబట్టి మనం వారిని అంటరానివారుగా పేర్కొనవచ్చా? ఈ ప్రశ్నకు ఎటువంటి సంకోచం లేకుండా 'ఔను' అనే సమాధానం వస్తుంది. ఏ ఇతర సమాధానం స్థిరంగా ఉండదు.

మొదటగా అంటరానివారు లేక ఎక్కువ సంఖ్యలో ఉన్న కులాలు ఎవరైతే చనిపోయిన గోమాంసాన్ని తినేటట్లు ప్రోత్సహించబడినారో, ఎవరైతే తిన్నారో వారంతా అంటరానితనంతో కళంకితులయ్యారన్న వాస్తవం మనకు తెలిసిందే. అంటరానితనానికి, చనిపోయిన గోవు మాంస వినియోగానికి మధ్య చాలా గొప్ప సంబంధం ఉన్నది, చాలా దగ్గరి సంబంధం ఉంది అన్న సిద్ధాంతం - అంటరానితనానికి మూలం గోమాంసాన్ని వినియోగించడమేనన్న విషయం నిర్వివాదాంశం. రెండవది, హిందువుల నుండి అంటరానివారిని విడగొట్టింది ఏదైనా ఉందంటే అది గోమాంసాన్ని భుజించడమే. హిందువుల ఆహారానికి సంబంధించి పైకి కనిపించే నిషేధాలు కూడ మనకు రెండు విధాలుగా విభజింపబడినాయి. అందులో ఒకటి మాంసాహారాన్ని తినడానికి వ్యతిరేకమైనది. ఇది హిందువులను శాఖాహారులు, మాంసాహారులుగా విభజిస్తుంది. మరొక నిషేధం, గోమాంసం తినడానికి వ్యతిరేకమైనది. ఇది కూడా హిందువులను గోమాంసాన్ని భుజించే వారు, గోమాంసాన్ని భుజించని వారిగా విభజిస్తుంది. అంటరానితనానికి సంబంధించిన దృష్టితో చూస్తే మొదటి విభజన అంటరాని వారి నుండి మిగిలిన వారిని (స్పృశ్యులు) వేరు చేస్తుంది. శాఖాహారులైన లేదా మాంసాహారులైన స్పృశ్యులు గోమాంసాన్ని భుజించే విషయాన్ని వ్యతిరేకించే విషయంలో ఐక్యంగా ఉంటారు. గోమాంసాన్ని తినడం వారి అలవాటు కాబట్టి అస్పృశ్యులు,స్పృశ్యులకు వ్యతిరేకంగా నిలబడతారు.

ఈ సందర్భంలో గోమాంసం భుజించడాన్ని వ్యతిరేకిస్తూ, గోమాంసం భుజిస్తే వాంతులు అవుతాయన్న భావన కల్గిన వారికి, గోమాంసం తినేవారిని అస్పృశ్యులుగా చూడాలను కోవడం అత్యాశ కాదు.

వాస్తవానికి గోమాంస భక్షణ, అంటరానితనం సృష్టించబడడానికి కారణమా, కాదా అనే అంచనా లేదా ఊహకు రావడం అంత అవసరం కాదు. ఈ కొత్త సిద్ధాంతం హిందూ శాస్త్రాల నుండి మద్దతును పొందింది. వేదవ్యాస స్మృతిలో క్రింద ఇవ్వబడిన శ్లోకాలున్నాయి. ఆ శ్లోకాలు, అంత్యాజాల వర్గంలోకి ఏఏ కులాలు చేర్చబడినాయి, ఎందుకు చేర్చబడినాయి అనే వివరణలు యిచ్చాయి.

(12-13 వాక్యం) "చర్మకారులు (చెప్పులు కుట్టువారు), భట్టా (సైనికులు), భిల్లా, రజక (చాకలివారు), పుష్కర, నట (నటులు), వ్రత, మేద, చండల, దాస, స్వపాక, కొలిక, వీరు అంత్యజవర్గానికి, గోమాంసాన్ని భుజించే ఇతరుల వర్గానికి చెందినవారు.

స్మృతికారులు సాధారణంగా ఎవరికీ కూడ ఎందుకు, ఎలా అన్న వారి యొక్క మొండివాదనను వినిపించడానికి ఇష్టపడరు. కానీ ఇక్కడ మినహాయింపు ఉన్నది. దీనిలో వేద వ్యాసుడు అంటరానితనానికి (అస్పృశ్యతకు) కారణాన్ని వివరిస్తాడు. ఇక్కడ "ఇతరులతో పాటుగా, ఎవరైతే గోమాంసాన్ని తింటారో" అనే వాక్యంలోని భాగం ముఖ్యమైనది. అంటరానితనం యొక్క పుట్టుక గోమాంసాన్ని భుజించడంతోనే ఉంటుందన్న విషయం స్మృతికారునికి తెలుసన్న విషయం ఆ భాగం తెలియజేస్తుంది.

అంటరానితనం యొక్క మూలాలను వెదికే సందర్భంలో రెండు పద్ధతులు తెరపైకి వచ్చాయి. మొదటిది బౌద్ధ మతస్తులకు వ్యతిరేకంగా బ్రాహ్మణులు ప్రదర్శించే కోపం మరియు చెడ్డవారన్న భావనతో ఏర్పడే వాతావరణం. రెండవది బక్కచిక్కిన పేదల యొక్క గోమాంసాన్ని తినే అలవాటు. మొదటి పద్ధతిలో అంటరానితనం అనే మచ్చ బక్కచిక్కిన పేదలకు సరిపోదు. బౌద్ధ మతస్తుల పట్ల కోపం, వ్యతిరేకత ప్రదర్శించే బ్రాహ్మణులు బౌద్ధులందరిపై ప్రదర్శించడం తప్ప బలహీనులైన పేదలపై కాదు. బలహీనులైన పేదలు మాత్రమే అంటరానివారుగా పరిగణించబడుతుండడం ఎందుకంటే వారు బౌద్ధులుగా ఉండడమేకాక, గోమాంసాన్ని వినియోగించే అలవాటును కొనసాగించడం కూడ. అదే బ్రాహ్మణులు ఆవుపట్ల ప్రదర్శించే గౌరవం, ప్రేమకు భూమికగా నిలిచింది. కాబట్టి బలహీనులైన పేదలు బౌద్ధ మతస్తులుగా ఉన్నందువల్లనే అస్పృశ్యులుగా బ్రాహ్మణుల ఆగ్రహానికి, వ్యతిరేకతకు గురి అయ్యారని, వారు గోమాంసాన్ని భుజించడం వల్లనే అస్పృశ్యులుగా పరిగణించబడినారన్న నిర్ధారణకు రావచ్చు.

గోమాంసాన్ని భుజించడమే అస్పృశ్యతకు కారణం అన్న సిద్ధాంతం అనేక ప్రశ్నలను రేకెత్తిస్తుంది. విమర్శకులు ఖచ్చితంగా ఆ ప్రశ్నలను సంధిస్తారు. అవి: హిందువులకు గోమాంస

వినియోగం పట్ల ఏవగింపునకు కారణం ఏమిటి? హిందువులు ఎప్పుడూ గోమాంస వినియోగాన్ని వ్యతిరేకించారా? లేకుంటే, వారు దానిపట్ల ఎందుకంత ఏవగింపును పెంచు కున్నారు? అసలు ప్రారంభం నుండి అంటరాని వారు గోమాంసాన్ని వినియోగించారా? అంటరానివారు ఎప్పటికీ అంటరానివారేనా? అసలు అంటరానివారు గోమాంసాన్ని భుజించి నప్పటికీ అంటరానివారుగా పరిగణించబడని సందర్భం ఉంది. తరువాత కాలంలో గోమాంసాన్ని భుజించేవారు అంటరానివారుగా ఎందుకు పరిగణించ బడుతున్నారు? ఒకవేళ హిందువులు గోమాంసాన్ని భుజించి ఉన్నట్లైతే, వారు దానిని ఎప్పుడు వదిలేశారు? ఒకవేళ హిందువులకు గోమాంస భక్షణపట్ల ఉండే వ్యతిరేకత కారణంగా అంటరానితనంపై యథాలాపంగా ఏర్పడిన ఏవగింపు, హిందువులు గోమాంసాన్ని భుజించడం వదిలి వేసిన ఎంత కాలం తరువాత ఏర్పడింది. ఎపుడు అంటరానితనం ఉనికిలోకి తీసుకొనిరాబడింది?

**హిందువులు గోమాంసాన్ని అసలు భుజించలేదా?**

"హిందువులు అసలు గోమాంసాన్ని భుజించలేదా?" అన్న ప్రశ్నకు బ్రాహ్మణుడైనా, బ్రాహ్మణేతరుడైనా ప్రతి స్పృశ్యుడైన హిందువు నుండి 'లేదు' అన్న సమాధానం వస్తుంది. ఒక అర్థంలో అది సరియైనది. కొంతకాలంగా ఏ హిందువు మాంసాన్ని తినడం లేదు. ఒకవేళ ఏ స్పృశ్యుడైన హిందువు ఆ సమాధానం (లేదు) చెప్పాలనుకుంటే దానిపైన ఏ విధమైన తగవు అవసరం లేదు. కానీ అన్నీ తెలిసిన బ్రాహ్మణ పండితులు హిందువులు గోమాంసాన్ని భుజించక పోవడమే కాదు, వారు ఆవును పవిత్రంగా చూసుకున్నారు, గోవధను వ్యతిరేకించారంటే, వారి యొక్క ఈ దృష్టి కోణాన్ని అంగీకరించడం అసాధ్యం.

"ఒకవేళ ఏ స్పృశ్యుడైన హిందువు ఆ సమాధానం (లేదు) చెప్పాలనుకుంటే దానిపైన ఏ విధమైన తగవు అవసరం లేదు. కానీ అన్నీ తెలిసిన బ్రాహ్మణ పండితులు హిందువులు గోమాంసాన్ని భుజించకపోవడమే కాదు, వారు ఆవును పవిత్రంగా చూసు కున్నారు, గోవధను వ్యతిరేకించారంటే, వారి యొక్క ఈ దృష్టి కోణాన్ని అంగీకరించడం అసాధ్యం."



యజ్ఞం నిర్వహణ

**హిందువులు గోమాంసాన్ని అసలు భుజించలేదు. వారు గోవధను వ్యతిరేకించారు అన్న వాదనకు ఋజువు ఏమిటి?**

ఋగ్వేదంపై ఆధారపడి రెండు విధాలైన ఆధారాలున్నాయి. మొదటిది, ఆవు 'అఘ్న'గా చెప్పబడింది. ఋగ్వేదంలోని 1.164, 27; IV.1.6; V82-8; VI.69.71; X.87 'అఘ్న' అంటే 'చంపబడడానికి తగినటువంటిది కానిది' అని అర్థం. దీని నుండే గోవధకు వ్యతిరేకంగా 'నిషేధం' ఏర్పడిందన్న వాదనకున్న బలం ఏంటంటే మతంలో వేదాలు చెప్పినటువంటిదే దైనా 'అధికారం'గా పరిగణించబడడమే. ఆర్యులు గోమాంసాన్ని భుజించినప్పుడు, వారు గోవధ చేయకుండా ఉండలేరు. రెండవది, ఆవు పవిత్రమైనదని చెప్పబడింది. ఋగ్వేదంలోని VI.28.1.8 మరియు VIII. 101.15 శ్లోకాలలో ఆవు రుద్రుల తల్లిగా, వసుల కూతురిగా, ఆదిత్యుల సోదరిగా, మకరందానికి కేంద్రంగా గుర్తించబడింది. ఈ విషయంపై ఉన్న మరొక ఆధారం ఋగ్వేదంలోని VIII. 101.16 లో ఆవు దేవి (దేవత)గా పిలవబడింది.

బ్రాహ్మణ సూత్రాలలోని కొన్ని గద్యాల లో కూడ కొన్ని ఆధారాలు ఉన్నాయి. జంతుబలి, గోమాంస భక్షణకు సంబంధించిన రెండు గద్యములు స్వతంత్ర బ్రాహ్మణంలో ఉన్నాయి. ఒకటి III.1.2.21, ఈ క్రింది విధంగా ఉన్నాయి.

' 'అధ్వర్యుడు" అతనిని మందిరం లోపలికి ప్రవేశం అయ్యేట్లు చేశాడు. అతనిని గోవు లేదా ఎద్దు మాంసాన్ని భుజించనివ్వవద్దు. ఎందుకంటే గోవు, ఎద్దు ఈ భూమిపై ఉన్న ప్రతి దానికి నిస్సందేహంగా వెన్నుదన్నుగా ఉంటాయి. మనం గోవుకు, ఎద్దుకు ఇతర జంతువుల యొక్క జీవశక్తిని అందించి వాటిని మనం గౌరవించాలని దేవుళ్ళు స్పష్టంగా అంటారు. కాబట్టి అవి (గోవు మరియు ఎద్దు) బాగా తింటాయి. ఒకవేళ ఎవరైన గోవు, ఎద్దు మాంసం తిన్నారు అంటే ప్రతి జంతువును తిన్నారని అర్థం. ఒక విధంగా సర్వం నాశనం అయ్యిందని అర్థం. కాబట్టి అతన్ని గోమాంసం లేదా ఎద్దు మాంసాన్ని తిననియ్యవద్దు.

ఇతర గద్యాలు 1, 2, 3, 6 లలో ఉన్నాయి. అవి జంతు బలికి వ్యతిరేకంగా నైతిక నియమాల ప్రాతిపదికన మాట్లాడతాయి. ఇదే విధమైన వివరాలు అపస్తంభ ధర్మ సూత్రాలలోని 1, 5, 17, 29 లలో ఇవ్వబడినాయి. అపస్తంభ ధర్మం సాధారణంగానే గోమాంస భక్షణను బహిష్కరిస్తుంది.

ఇది హిందువులు అసలు గోమాంసాన్ని భుజించలేదు అని చెప్పడానికి ఋజువు. ఈ ఋజువు నుండి మనం ఏ విధమైన ముగింపు నివ్వాలి?

ఇప్పటి వరకు ఋగ్వేదం నుండి వచ్చిన ఋజువు, తప్పుగా చదివి, తప్పుగా అర్థం చేసుకోవడం ద్వారా వచ్చిందే. ఋగ్వేదంలో గోవు అన్వయింపబడిన 'అఘ్న' అనే విశేషణం

> **"కాబట్టి విష్ణుకు బలివ్వడానికి పొట్టి ఎద్దును ఎంపిక చేయాల్సివచ్చింది. వృత్తును నాశనం చేసే ఇంద్రునికి, వంకర తిరిగిన కొమ్ములు కలిగిన ఒక కోడెను, ఒక నల్లని గోవును పుషాన్‌కు, ఒక ఎరుపు గోవును రుద్రునికి ఇలా ఒక్కొక్కరికి, ఒక్కొక్క రకమైన గోవులను, ఎద్దులను బలిచ్చేవారు."**

యొక్క అర్థం 'ఆవు పాలిస్తుంది కాబట్టి వధించ బడటానికి తగినది కాదు'. ఋగ్వేదంలో ప్రాముఖ్యత నివ్వడం ద్వారా గోవు గౌరవించబడడం వాస్తవం. కానీ ఈ గోవులను గౌరవించే పద్ధతి వాస్తవానికి వ్యవసాయం చేసే భారతీయ ఆర్యుల నుండి మనం ఊహించాలి. ఆవు వల్ల కలిగే ఈ ప్రయోజనం, ఆహారం నిమిత్తం గోవులను వధించకుండా ఆర్యులను అడ్డుకోలేదు. వాస్తవానికి గోవు వధించబడింది. ఎందుకంటే అది పవిత్రమైనదిగా పరిగణించబడడం వలననే. పి.వి.కేన్ గమనించినంత వరకు "అంటే వేదకాలంలో గోవు పవిత్రమైనదికాదని కాదు, దాని యొక్క పవిత్రత కారణంగా వజసనేయి సంహితలో గోమాంసం తప్పకుండా తినాలని నిర్దేశించబడింది".

ఆర్యులు తమ ఆహారం కొరకు గోవులను వధించి గోమాంసాన్ని తిన్నారని ఋగ్వేదం స్పష్టంగా చెప్పింది. ఋగ్వేదంలోని శ.86.14 లో ఇంద్రుడు ఈ విధంగా అంటాడు. 'వారు ఒక్కరి కొరకు 15 గోవులు, 20 ఎద్దులు ఉంచుతారు." ఋగ్వేదంలోని X.91.14 లో అగ్నికి గుర్రాలు, ఎద్దులు, గోవులు మొదలగునవి బలివ్వబడేవని, X.72.6 లో గోవును కత్తితో లేదా గొడ్డలితో వధించేవారని పేర్కొనబడింది. సత్పథ బ్రాహ్మణంలో చెప్పబడిన దానిని మనం ప్రామాణికంగా తీసుకొని ఖాయంగా చెప్పలేము. ఎందుకంటే భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చే కొన్ని గద్యాలు బ్రాహ్మణాలలో ఉన్నాయి.

ఉదాహరణకు తైత్రేయ బ్రాహ్మణాలలో చెప్పబడిన కామ్యాస్తీలలో గోవుల, ఎద్దుల బలుల గురించే కాదు, ఏ రకమైన గోవులు, ఎద్దులను ఏ దేవతలకు బలివ్వాల్సి ఉంటుందో చెప్పడం జరిగింది. కాబట్టి విష్ణుకు బలివ్వడానికి పొట్టి ఎద్దును ఎంపిక చేయాల్సివచ్చింది. వృత్తను నాశనం చేసే ఇంద్రునికి, వంకర తిరిగిన కొమ్ములు కలిగిన ఒక కోడెను, ఒక నల్లని గోవును పుషాన్‌కు, ఒక ఎరుపు గోవును రుద్రునికి ఇలా ఒక్కొక్కరికి, ఒక్కొక్క రకమైన గోవులను, ఎద్దులను బలిచ్చేవారు. తైత్రేయ బ్రాహ్మణా లలో 'పంచసారదీయ సేవ' అనే వేరొక బలి గురించి చెప్పడం జరిగింది. దీని ప్రత్యేక లక్షణం ఏమంటే ఈ బలిలో 7 సం.ల వయసున్న మూపురం లేని పొట్టి కోడెలు, 3 సం.ల లోపు వయసున్న పొట్టి పడ్డలు బలివ్వబడతాయి.

ఒక అతిథి కొరకు చేసే గోవధ మూలం గా ఆ అతిథికి రాను రాను 'గోఘ్న' అంటే గో హంతకునిగా పేరు రావడం జరిగింది. ఈ గోవధను ఆపడానికి, ఆ అతిథి ఇంటికి వచ్చినపుడు గోవును వదిలిపెడితే వధ నుండి తప్పించుకుంటుందని, అలా అది ఒక ఆచారంగా వచ్చిందని 'అశ్వతేయాన గ్రాహ్య సూత్ర (1.24.25) లో చెప్పబడింది.

అది గోవధ, గోమాంస భక్షణకు సంబంధించిన ఋజువుపరిచే స్థితి. దీనిలోని ఏ భాగం వాస్తవమని ఒప్పుకోబడాలి? సరియైన దృష్టి ఏమిటంటే సత్పథ బ్రాహ్మణ, అపస్తంభ ధర్మసూత్రాలే సాక్ష్యం. ఎందుకంటే హిందువులు గోవధకు, గోమాంస భక్షణకు వ్యతిరేకం అన్న విషయాన్ని బలపరుస్తాయి కాబట్టి గోవధ ఎక్కువ చేయవద్దని బోధిస్తాయి. కానీ గోవధ నిషేధానికి వ్యతిరేకంగా కాదు. వాస్తవానికి గోవధ, గోమాంస భక్షణ చాలా సాధారణమైన విషయమని ఈ బోధనలు ఋజువు చేస్తాయి. ఈ బోధనలను అడ్డగించకుండా గోవధ, గోమాంసభక్షణ కొనసాగినాయి.

హిందువులు ఒకానొక కాలంలో గోవధ చేశారని, గోమాంసాన్ని భక్షించారని ఋజువు చేస్తూ బౌద్ధ సూత్రాలలో వర్ణించబడిన యజ్ఞాలలో చెప్పబడింది. గోవులు, జంతువులు చాలా పెద్ద మొత్తంలో వధించబడేవి. మతం పేరుతో బ్రాహ్మణులచే చేయించబడిన గోవుల, జంతువుల వధ ఎంత సంఖ్యలో జరిగిందో లెక్క చెప్పడం ఇప్పుడు సాధ్యం కాదు. దీనికి సంబంధించిన విషయాలు బౌద్ధ సాహిత్యం నుండి పొందవచ్చును. బ్రాహ్మణ కుటదంతకు చేసిన జంతు బలులను బుద్ధుడు వ్యతిరేకించాడు. బుద్ధుడు ఎగతాళిగా మాట్లాడినా వేదకాలం నాటి బలులకు సంబంధించిన కర్మకాండలు, అలవాట్లకు సంబంధించి మంచి అవగాహనను అందించాడు.

"ఓ బ్రాహ్మణోత్తమా! బలుల వద్ద ఎద్దులు, మేకలు, పందులు, పక్షులు లేదా ఏ విధమైన ప్రాణులను చంపవద్దు" ఏ విధమైన చెట్లను నరికి ఉపయోగించరాదు. దర్భలను కూడ ఆ ప్రాంతంలో ఉంచరాదు. అక్కడ పనిచేసే బానిసలు, వార్తాహరులు , పనివారు భయముచే లేదా కర్రలచే వెళ్ళగొట్టబడకూడదు. వారి కంట్లో కన్నీరు రాకూడదు" అని బుద్ధుడు పేర్కొంటాడు. అందుకు కుటుదంత బుద్ధునికి కృతజ్ఞతలు తెలియపరిచి ఈ విధంగా పేర్కొంటాడు. "నేను నేటి నుండి మాన్యులైన గౌతముని నా మార్గదర్శకునిగా స్వీకరిస్తున్నాను. ఆయన నన్ను తన శిష్యునిగా అంగీకరించాలి. నేను నా జీవితాంతం ఆయనను నా మార్గదర్శకునిగా స్వీకరిస్తాను. ఓ గౌతమా! నేను 700 కోడెలు, 700 పడ్డలు, 700 మేకలు మొదలైన జంతువులను స్వేచ్ఛగా వదిలివేస్తాను. నేను వాటికి జీవితాన్ని మంజూరు చేస్తున్నాను. అవి గడ్డి తినవచ్చు, పరిశుభ్రమైన నీరు త్రాగవచ్చు, చల్లని గాలిని పీల్చవచ్చును".

సంయుత నికాయ (111,1-9) లో కోసల రాజు అయిన పసేనది జరిపిన యజ్ఞం వర్ణించబడింది. 500 కోడెలు, 500 ఆవు దూడలు, పడ్డలు, మేకలు బలివ్వబడినాయి అని చెప్పబడింది.

ఈ ఋజువులతో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులైన హిందువులు ఒకనాడు మాంసమే కాదు గోమాంసం కూడ భుజించారని భావించవచ్చు.

**బ్రాహ్మణేతరులు గోమాంస భక్షణను ఎందుకు వదిలివేశారు?**

హిందువులలోని భిన్నమైన వర్గాల ప్రజలకు సంబంధించిన ఆహారపుటలవాట్లు వారియొక్క సామాజిక స్థితిగతులను బట్టి, జీవన విధానాలను బట్టి నిర్ణయించబడినాయి. హిందువులు వారియొక్క స్థితిగతుల బట్టి విభజింపబడిన విధంగానే వారి ఆహారపు అలవాట్లు కూడ దాని ఆధారంగానే వర్గీకరించబడినాయి. వారి జీవన విధానం ఆధారంగానే వారు శైవులుగా, వైష్ణవులుగా వర్గీకరించబడినారు. అదే విధంగా హిందువులు మాంసాహారులుగా, శాఖాహారులుగా వర్గీకరించబడినారు.

సాధారణ లక్ష్యం కొరకు హిందువులు శాఖాహారులు, మాంసాహారులు అనే రెండు విభజనలు సరిపోతాయి. కానీ హిందూ సమాజంలోనిఅన్ని వర్గాలను ఇది పరిగణనలోకి తీసుకోలేదన్న విషయం మనం ఒప్పుకొని తీరాలి. ఒక పరిపూర్ణమైన వర్గీకరణ కోసం, మాంసాహారులుగా ఉన్న హిందూ వర్గంలో మరి రెండు ఉపవర్గాలు విభజించబడినాయి. 1) గోమాంసం భుజించని మాసాంహారులు 2) గోమాంసం భుజించే మాంసాహారులు. ఇంకో మాటలో చెప్పాలంటే ఆహార నిషేధాల ఆధారంగా హిందూ సమాజం 3 వర్గాలుగా : 1) శాఖాహారులు 2) గోమాంసం భుజించని మాంసాహారులు 3) గోమాంసం భుజించే మాంసాహారులు. ఈ వర్గీకరణ ఆధారంగా హిందూ సమాజంలో 1) బ్రాహ్మణులు 2)బ్రాహ్మణేతరులు 3) అస్పృశ్యులు అనే మూడు వర్గాలు ఉన్నాయి. ఈ విభజన సమాజంలోని చాతుర్వర్ణ వ్యవస్థ ఆధారంగా జరగనప్పటికీ, ఉనికిలో ఉన్న వాస్తవాలను బట్టి జరిగినట్లుంది.

ఈ మూడు విభజనలు ఉనికిలో ఉన్న వాస్తవాలకు తగ్గట్టుగా ఉన్నాయి. ఎవడైనా శాఖాహారాన్ని అర్థం చేసుకోగలడు. ఎవడైనా మాంసాన్ని భుజించడాన్ని అర్థం చేసుకోగలడు. కానీ ఒక మాంసాహారి, గోమాంస భక్షణను ఎందుకు ఆక్షేపిస్తున్నాడో అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ఈ విపరీత ధోరణికి కారణాలు తెలియాలి. బ్రాహ్మణేతరులు గోమాంస భక్షణను ఎందుకు వదిలివేశారు? దీని సమాధానం కొరకు, ఈ విషయంపై ఉన్న చట్టాలను పరిశీలించాల్సిన అవసరం ఉన్నది. దీనికి తగిన శాసనం అశోకుని చట్టాలలో గాని, మనుధర్మశాస్త్రంలో గాని తప్పక దొరుకుతుంది.

అశోకునితో ప్రారంభిస్తే, అశోకుని శాసనాలు ఈ విషయానికి సంబంధించి రాతి శాసనం I, స్తంభంపై ఉన్న శాసనాలు II మరియు V. రాతి శాసనం I ఈ విధంగా ఉన్నాయి.

"ఈ పవిత్రమైన శాసనం రాజు ఆజ్ఞతో లిఖించ బడింది. ఇక్కడ ఏ జంతువును బలివ్వ కూడదు. ఏ విధమైన విందులు జరుపరాదు. ఎందుకంటే కొన్ని ప్రాంతాలలో సెలవులలో జరిగే విందులు అద్భుతాలైనప్పటికీ, రాజుగారి దృష్టిలో ఆ విందులు నేరాలుగా కన్పిస్తాయి".

"అంతకు ముందు రాజుగారి వంట గదిలో ప్రతిరోజు కొన్ని వందల, వేల జీవాలు వంటకాల కొరకు బలివ్వబడేవి. కానీ ఇప్పుడు ఈ పవిత్రమైన శాసనం వ్రాయబడేటప్పుడు ప్రతిరోజు వంటకాల కొరకు కేవలం 3

"ఈ మూడు విభజనలు ఉనికిలో ఉన్న వాస్తవాలకు తగ్గట్టుగా ఉన్నాయి. ఎవడైనా శాఖాహారాన్ని అర్థం చేసుకోగలడు. ఎవడైనా మాంసాన్ని భుజించడాన్ని అర్థం చేసుకోగలడు. కానీ ఒక మాంసాహారి, గోమాంస భక్షణను ఎందుకు ఆక్షేపిస్తున్నాడో అర్థం చేసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ఈ విపరీత ధోరణికి కారణాలు తెలియాలి."



బుద్ధుని అనుయాయులు

జంతువులే బలివ్వబడినాయి. ఒక జింక, రెండు నెమళ్ళు. ఇక మీదట ఆ మూడు జీవాలు కూడ బలివ్వబడవు".

**స్తంభంపై లిఖించబడిన శాసనంలో II ఈ విధంగా ఉంది:**

"భక్తి శాసనం అద్భుతం. కానీ ఎందులో ఈ భక్తి శాసనం ఉన్నది? చమత్కారం, చిరు భక్తి, మంచి పనులు, జాలి, సరళీకరణ, వాస్తవిక దృష్టి, పరిశుద్ధతలో ఉంది".

"నేనందించిన ఆధ్యాత్మిక ప్రవేశం పరిపరి విధాలుగా ఉన్నది. రెండు, నాలుగు కాళ్ళ జీవులు, పక్షులు, నీటిలో జీవించే ప్రాణులు అన్నింటికి నేను చాలా అనుకూలమైన సేవలు చేశాను".

"ఈ లక్ష్యంతోనే పవిత్రమైన శాసనాన్ని లిఖించాను. ఎవరైతే ఈ బోధనను అమలుచేస్తారో వారు మంచి పనిచేసినట్లు".

**స్తంభంపై లిఖించబడిన శాసనం V:**

నేను 26 సం.ల వయసులో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పక్షి జాతికి చెందిన బాతులు, రామచిలుకలు, గబ్బిలాలు, రాణీ చీమలు, ఆడ తాబేళ్ళు, ఎముకలు లేని చేపలు, ఉడతలు, కోతులు, కోడెలు, పావురాలు, నాలుగుకాళ్ళ జంతువులన్నీ బలుల నుండి మినహాయించబడినాయి.

మేకలు, ఆవులు, వాటి సంతానాలు, పాలిచ్చే జంతువులన్నీ బలుల నుండి మినహాయించబడినాయి. కొంటెతనంతో అడవులను తగులబెట్టి అక్కడ ఉన్న జీవులను నాశనం చేయడాన్ని కూడ నిషేధించడం జరిగింది.

ఒక జీవి వేరొక జీవిని భుజించకూడదు. మూడు కాలాలలో చంద్రుడు పూర్తిగా కనిపించిన రోజులలో, డిసెంబర్, జనవరి మాసాలలో పూర్తిగా, మొదటి పక్షంలోని 14, 15వ రోజున, రెండవ పక్షంలో మొదటి రోజున చేపలు అమ్మబడకుండా, చంపబడకుండా మినహాయింపు ఇవ్వబడింది.

అదే రోజులలో ఏనుగుల ఆహారంలో, చేపల కొలనులలో ఏ జీవి చంపబడకూడదు. పక్షంలోని 8వ, 14వ, 15వ రోజులలో, డిశంబర్, జనవరి మాసాలలో, పునర్వాస రోజులలో, పండుగ దినాల రోజున కోడెల అంగచ్ఛేదనం చేయరాదు.

తిష్య, పునర్వాస దినములలో, చంద్రుడు పూర్తిగా కనిపించిన రోజులలో గుర్రాలకు, ఎద్దులకు వాతలు పెట్టడం నిషేధించబడింది.

మనువు చెప్పిన చట్టాలలో మాంసాన్ని

> “అశోకునికి మానవుల, జంతువుల ప్రాణాల యొక్క పవిత్రత పట్ల శ్రద్ధ ఉన్నది. అవసరం లేనిచోట ప్రాణాలను తీయడాన్ని అడ్డుకోవడమే తన విధిగా అశోకుడు భావిస్తాడు. అందుకే ఆయన జంతు బలులను నిషేధించాడు. బలులను ఆయన అనవసరమైన చర్యగా భావిస్తాడు. ఉపయోగించబడని, తినబడని జంతువుల బలులను కూడా అనవసర చర్యగా భావించాడు.”



హిందుత్వవాదుల చేతిలో ఆయుధం ఆవు

భుజించడానికి సంబంధించిన ఈ క్రింది నిబంధనలున్నాయి.

**V.11** మాంసాహారం తినే పక్షులను, గ్రామాలలో నివశించే, ఒక డెక్క జంతువులను తినడం మానెయ్యాలి.

**V.12** పిచ్చుక, హంస, బ్రాహ్మణి బాతు, గ్రామాలలోని కోడిపుంజులు, సారస పక్షులు, వడ్రంగి పిట్ట, రామచిలుక, పెడిస పిట్ట.

**V.13** ముక్కుతో ఆహారాన్ని స్వీకరించే పక్షులు, వేలికి వేలికి నడుమ చర్మం గల పక్షులు, కోయష్టి పక్షులు, నీటిలో దూకి చేపలను ఆహారంగా స్వీకరించే పక్షులు, ఎండబెట్టిన మాంసం, మాంసపు దుకాణాలలో దొరికే మాంసం.

**V.14** బక, బాలక కొంగలు, బొంతకాకి, నీచేపలను తినే ఖంగర్బక జంతువు, గ్రామాలలోని పందులు, అన్ని రకాల చేపలు.

**V.15** ఏ జంతువు మాంసాన్నైనా తినేవారిని ఆ జంతువు మాంసభక్షకుడంటారు. చేపలు తినే వానిని ఏ మాంసాన్నైనా తినేవానిగా అంటారు. అతన్ని చేపలను వదిలివేయనివ్వు.

**V.16** కానీ పాఠైన్, రోహితా అనే చేపలను తినవచ్చు. దేవతలకు, భూతాలకు సమర్పిస్తే రగివ, సింహతుండ , ససల్కాలు అన్ని సందర్భాలలో తినవచ్చు.

**V.17** తెలియని జంతువుల, పక్షుల మాంసాలను అతనిని తిననివ్వవద్దు.

**V.18** ఒంటెలు తప్ప ఒక దవడకు పళ్ళు ఉన్న జంతువులు, ముండ్ల పంది, ఉడుము, ఖడ్గమృగము, తాబేలు, కుందేలు తినదగినవిగా ప్రకటించబడినాయి.

జంతు బలులకు సంబంధించి అశోకుడు, మనువు చేసిన శాసనాలున్నాయి. మనం ప్రధానంగా ఆవును గురించి మాట్లాడుతున్నాం. అశోకుని శాసనాలను పరీక్షిస్తే, ఆయన గోవధను నిషేధించాడా? ఈ విషయంపై భిన్నాభిప్రాయం కనిపిస్తుంది. అశోకుడు గోవధను నిషేధించలేదని ప్రొ. విన్సెంట్ స్మిత్ అభిప్రాయపడతాడు. అశోకుని శాసనాలపై మాట్లాడుతూ, ప్రొ. స్మిత్ ఈ విధంగా పేర్కొంటాడు “అశోకుని శాసనాలు గోవధను అడ్డుకోలేదనేది చెప్పదగిన విషయం. అది స్పష్టంగా, చట్టబద్ధంగా కొనసాగుతుంది”.

ప్రొ. రాధాముకుడ్ ముఖర్జీ, విషయాన్ని ప్రొ. స్మిత్‌తో జోడిస్తూ అశోకుడు గోవధను నిషేధించాడని పేర్కొంటాడు. స్తంభ శాసనం 5పై ఉన్న “నాలుగు కాళ్ళ జంతువులు’ అన్న మాటపై వాదిస్తూ ఆ మాట ప్రకారం గోవు వధించడం నుండి మినహాయింపబడిందని ముఖర్జీ అంటాడు. ఆ శాసనాన్ని తగిన విధంగా అధ్యయనం చేయలేదు. ఆ శాసనంలోని ప్రకటన సరియైనది. ఆ ప్రకటన అన్ని నాలుగు కాళ్ళ జంతువులకు సంబంధించింది కాదు, కానీ తినడానికి ఉపయోగించబడని నాలుగుకాళ్ళ జంతువులకు సంబంధించింది మాత్రమే. “గోవు తినడానికి ఉపయోగించబడని నాలుగుకాళ్ళ జంతువుగా చెప్పబడలేదు. అశోకుడు గోవధను నిషేధించలేదని ప్రొ. విన్సెంట్ స్మిత్ చెప్పిన విషయం సరియైనదని అనిపిస్తుంది. అశోకుని కాలంలో గోమాంసం భక్షించబడలేదు కాబట్టి గోవు, గోవధ నిషేధం పరిధిలోకి వస్తుందని చెప్పడం ద్వారా ప్రొ. ముఖర్జీ ఇబ్బందికరమైన స్థితి నుండి బయటపడే ప్రయత్నం చేశాడు. అతని ప్రకటన అనుచితమైనది, ఎందుకంటే అన్ని వర్గాలచే తినబడిన జంతువు ఆవు.

శాసన నిర్మాణంలో అశోకుడు గోవధను నిషేధించాడన్న ముఖర్జీ నిర్ణయం అనవసరమైనది. అశోకునికి ఆవుపై ప్రత్యేకమైన శ్రద్ధ ఏమీలేదు. ప్రత్యేకంగా గోవును వధ నుండి రక్షించాల్సిన బాధ్యత కూడ లేదు. అశోకునికి మానవుల, జంతువుల ప్రాణాల యొక్క పవిత్రత పట్ల శ్రద్ధ ఉన్నది. అవసరం లేనిచోట ప్రాణాలను తీయడాన్ని అడ్డుకోవడమే తన విధిగా అశోకుడు భావిస్తాడు. అందుకే ఆయన జంతు బలులను నిషేధించాడు. బలులను ఆయన అనవసరమైన చర్యగా భావిస్తాడు. ఉపయోగించ బడని, తినబడని జంతువుల బలులను కూడా అనవసర చర్యగా భావించాడు.

మనువు కూడ అదే విధంగా చేశాడనడానికి ఏ సందేహం లేదు. మనువు కూడ గోవధను నిషేధించలేదు. అంతేకాక ఆయన కొన్ని సందర్భాలలో గోమాంసాన్ని తినవచ్చని పేర్కొన్నాడు. మరి బ్రాహ్మణేతరులు గోమాంసం తినడం ఎందుకు మానేశారు? వారివైపు నుండి స్పష్టమైన కారణాలు ఏమీ కనబడడం లేదు. కానీ దాని వెనుక ఏదో ఒక కారణం ఉండి ఉంటుంది. నేను అనుకునే ఒక కారణం ఏమంటే బ్రాహ్మణేతరులు బ్రాహ్మణులను అనుకరించాలన్న కోరికతో వారు గోమాంసాన్ని తినడం మానేశారు. ఇది ఒక కొత్త సిద్ధాంతం కావచ్చుకానీ అసాధ్యమైన సిద్ధాంతం కాదు. ఫ్రెంచ్ రచయిత సేబ్రియల్ టార్టే ఒక సమాజంలోని సంస్కృతి, ఉన్నత వర్గాల పద్ధతులు, రీతులను, క్రింది వర్గాలు అనుకరించడం ద్వారా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటాడు. ఈ అనుకరణ చాలా యాంత్రికంగా నడుస్తుంది.

బ్రాహ్మణేతరులలో గోపూజ వ్యాప్తి, గోమాంసం భుజించడం నిలిపివేయడానికి గల కారణం ఏమంటే బ్రాహ్మణేతరులకు ఉన్నత వర్గీయులుగా కనిపించే బ్రాహ్మణులను అనుకరించాలన్న కోరిక కలిగి ఉండడమే.

గోపూజ వ్యాప్తికి బ్రాహ్మణవర్గం నుండి చాలా విస్తారమైన ప్రచారం కూడ జరిగింది. ఆ ప్రచారంలో 'గాయత్రీ పురాణం' ప్రముఖ భాగంగా ఉంది. కానీ ప్రధానంగా అనుకరించాలనే భావన కలిగి ఉండడమే. ఇది మరొక ప్రశ్న: 'బ్రాహ్మణులు గోమాంసాన్ని ఎందుకు వదిలివేశారన్న' దానిని లేవనెత్తుతుంది.

**బ్రాహ్మణులు శాఖాహారులుగా ఎందుకు మారారు?**

గోమాంస భక్షకుల నుండి గోమాంసాన్ని తిననివారిగా మారడం, బ్రాహ్మణేతరులకు నిజంగా ఒక విప్లవాన్ని తీసుకొచ్చినంత పని అయింది. కానీ బ్రాహ్మణేతరులు ఒక విప్లవాన్ని తీసుకొస్తే, బ్రాహ్మణులు రెండు విప్లవాలను తెచ్చారు. గోమాంస భక్షణను విరమించడం ఒక విప్లవం. అసలు మొత్తంగా మాంసాహార భక్షణను వదిలేసి శాఖాహారులుగా మారడం ఇంకొక విప్లవం.

ఒకానొక కాలంలో బ్రాహ్మణులు గొప్ప గోమాంస భక్షకులు. బ్రాహ్మణేతరులు గోమాంసాన్ని భుజించినప్పటికీ వారు ప్రతిరోజు దానిని భుజించలేరు. గోవు చాలా ఖరీదైన జంతువు. కేవలం ఆహారం కొరకు బ్రాహ్మణేతరులు గోవుపై అంత మొత్తాన్ని వెచ్చించలేరు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో మాత్రమే, మతపరమైన ఆచారాలు, పండుగల సందర్భంగా మాత్రమే ఉపయోగించేవారు. కానీ బ్రాహ్మణుల విషయంలో భిన్నంగా ఉండేది. అతడు పూజారి. ఆచార, కర్మకాండలు చేసే సందర్భంలో ఏదో ఒక అరుదైన రోజున మాత్రమే గోవధ జరిగేది కాదు. ఆరోజున బ్రాహ్మణులు బ్రాహ్మణేతరులచే ఆహ్వానింపబడేవారుకాదు. బ్రాహ్మణులకు ప్రతిరోజు కాల్చిన మాంసం ఆహారంగా ఉండేది. కాబట్టే బ్రాహ్మణులు గొప్ప గోమాంస భక్షకులుగా చెప్పబడినారు. బ్రాహ్మణుల యజ్ఞం అంటే మతం పేరుతో అమాయకపు జంతువులను తీసుకొచ్చి ఆడంబరంగా, ఆచార వ్యవహారాలతో బలి ఇవ్వడం తప్ప వేరే ఏదీకాదు. ఎవరికీ తెలియకుండా, ఆ జంతువు కనపడకుండా చుట్టుముట్టి గోమాంసం పట్ల వారికున్న ఆకలి తెలియకుండా చేసే ప్రయత్నం చేసేవారు. ఈ విధమైన ఆడంబర, ఆచార వ్యవహారాలు యజ్ఞంలో జంతు బలులను సృష్టించే ఐతరేయ బ్రాహ్మణాలలోని మార్గదర్శకాల నుండి పొందవచ్చును.

**“ బ్రాహ్మణులకు ప్రతిరోజు కాల్చిన మాంసం ఆహారంగా ఉండేది. కాబట్టే బ్రాహ్మణులు గొప్ప గోమాంస భక్షకులుగా చెప్పబడినారు. బ్రాహ్మణుల యజ్ఞం అంటే మతం పేరుతో అమాయకపు జంతువులను తీసుకొచ్చి ఆడంబరంగా, ఆచార వ్యవహారాలతో బలి ఇవ్వడం తప్ప వేరే ఏదీకాదు. ”**


**అశోకుడు**

వాస్తవానికి జంతు బలికి ముందుగా బాలబోధ ఆచారాలు మంత్రోచ్ఛారణ జరుగుతుంది. జంతువును బలివ్వడానికి 'యూప' అనే ఆయుధాన్ని నిలబెడదతారు. యూప ఏర్పాటు అవసరం ఏమిటో ఐతరేయ బ్రాహ్మణం వివరిస్తుంది.

ఈ 'యూప' అనేది ఒక ఆయుధం. దాని చివరకు ఎనిమిది అంచులుంటాయి. ఇది శత్రువును చంపడానికి వీలుగా నిలబెట్టబడి ఉంటుంది. ఆహారం ఎక్కువ దొరకాలని, బలంగా తయారు కావాలని ఎవరు కోరుకుంటారో వారు బిల్వచెట్టుతో యూపను తయారు చేయటానికి పూనుకుంటారు. బిల్లచెట్టు పునరుత్పత్తికి ప్రధానమైనది. అది ప్రతి సంవత్సరం ఫలాలనిస్తుంది. అది ప్రతి సంవత్సరం వేర్లనుండి కొమ్మల వరకు లావుగా, బలంగా పెరుగుతుంది. కాబట్టి అది త్వరగా పెరగటానికి చిహ్నంగా భావించబడుతుంది. ఎవరికైతే అటువంటి అవగాహన ఉన్నదో వారు తమ పిల్లలు, పశువులు త్వరగా పెరిగి, బలంగా తయారు వకావటానికి యూప స్థంభాన్ని బిల్వచెట్టు కొమ్మలతో తయారు చేసుకుంటారు.

ఈ వాస్తవాలను పరిశీలిస్తే బ్రాహ్మణులు ఆవుమాంసాన్ని తినేవారు మాత్రమే కాక, ఆవులను చంపేవారని కూడా రుజువు చేయటానికి వేరేసాక్ష్యం అవసరం లేదు.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

**చట్టాలు**

# బాల కార్మిక చట్ట సవరణలో లోపాలు

**కోమల్ గనోత్ర**

**14** సంవత్సరాలలోపు కుటుంబ ఆధారిత పనులలో బాల కార్మిక వ్యవస్థను సంస్థాగతం చేయడం ద్వారా అనేక ప్రమాద కరమైన వృత్తుల లోకి బాలలను ఉద్యోగులుగా (పనివాళ్లు) అనుమ తించడం బాలల విషయంలో భారతదేశ వైఫల్యాన్ని సూచిస్తుంది.

2011 జనాభా లెక్కల ప్రకారం 0-18 సంవత్స రాల వయసు బాలల్లో 3,30,00,000 మంది బాల కార్మికులు మనదేశంలో ఉన్నారు. దురదృష్టవశాత్తూ సగటున ప్రతి 11 మందిలో ఒకరు పని చేస్తున్నారు. బాల్యంలో పని నుంచి స్వేచ్ఛ (విముక్తి) లభించే అర్హతను బాలలు పొందిన సమయంలోనే ఆర్థికంగా పెద్దవాళ్ళ పాత్రను భర్తీ చేయాలనే ఒత్తిళ్ళు కూడా వస్తున్నాయి. ఆ రకమైన క్లిష్ట పరిస్థితుల్లో దాదాపు మూడు దశాబ్దాల తరువాత బాల కార్మికచట్టం (నిషేధము మరియు నియంత్రణ చట్టం) 1986 (సిఎల్‌పిఆర్ఎ) పునర్వ్యవస్థీకరించబడింది. బాలలకు సురక్షిత మైన బాల్యాన్ని అందించే విధంగా కఠినమైన చట్టాన్ని తేవడం ద్వారా బాలల హక్కులను పరిరక్షించే విధంగా వాస్తవమైన విశ్లేషణ చేయడానికి పాలకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారని అను కోవచ్చు. ఏది ఏమైనా బాలకార్మిక (నిషేధ మరియు నియంత్రణ) చట్ట సవరణ బిల్లు 2016 కొన్ని తీవ్రమైన విషయాలను తాకకుండా వదిలివేసింది.

ఈ సవరణలు 14 సంవత్సరాల లోపు బాలలను కుటుంబ వ్యాపారాలు చేయడానికి అనుమతిం చడంతోపాటు, 'ప్రమాదకరమైన' పనులు అనే నిర్వచనాన్ని పరిమితం చేయడం, ప్రమాదకరమైన వృత్తుల యొక్క జాబితాలను తగ్గించడాలను బుద్ధి పూర్వకంగా చేశారు. దీర్ఘకాలంలో ఇది పిల్లల యొక్క అభ్యసనము, ఆటలు, అభివృద్ధిమీద తీవ్రమైన ప్రభా వాన్ని చూపుతుంది. భారతదేశంలో బాల కార్మిక చట్టాలకు జరిగిన సవరణలు సమీప భవిష్యత్తులో బాలలపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయి అనే దానిని ఈ వ్యాసం విమర్శనాత్మకంగా పరిశీలిస్తుంది. ఇంకా అనుకున్న ఉద్దేశ్యాలను చేరుకోవడానికి కేవలం మరొక బాల కార్మిక చట్టాన్ని తేవడానికంటే సామాజిక రక్షణ ఆధారంగా మరింత ఎక్కువ న్యాయం కల్పించే ఆలోచనను ఈ వ్యాసం ముందుకు తెస్తుంది. బాలల హక్కులు మరియు మీరు (సిఆర్‌వై) ద్వారా జరిగిన 2001, 2011 జనాభా లెక్కల సమాచార విశ్లేషణ 5-14 సంవత్సరాల మధ్య ఉన్న బాల కార్మికుల సంఖ్య గడిచిన ఒక దశాబ్దం పైగా సంవత్సరానికి 2.2 శాతం తగ్గడం ఒక భాగం మాత్రమేనని బహిరంగపరిచింది. వాస్తవమైన తగ్గుదలను పరిశీలిస్తే దానికి విరుద్ధమైన అంశాన్ని గమనించవచ్చు. దాదాపు కోటిమందికిపైగా బాలలు భారతదేశపు శ్రామికశక్తిలో భాగంగా కొనసాగుతున్నారు. ఈ రకంగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్తే ఈ బాల కార్మికులు బాల కార్మికవ్యవస్థ నుంచి బయటపడడానికి దాదాపు ఒక శతాబ్దం పైనే పడుతుంది. ఈ విశ్లేషణ ప్రముఖంగా బయటకు తెచ్చిన మరొక తీవ్రమైన పోకడ ఏమంటే 2001-2011 మధ్య పట్టణ ప్రాంతాల్లో 5-14 సంవత్సరాల మధ్య వయసుగల బాల కార్మికుల సంఖ్య 53 శాతంకు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ప్రాథమికంగా ఉన్న నియంత్రణా చర్యలను అమలుపరిచే యంత్రాంగం, బలమైన బాలల రక్షణ వ్యవస్థలను పోల్చి చూడగా పట్టణ భారతదేశం ఈ వ్యవహారాన్ని చాలా తీవ్రమైన ఆందోళన కలిగించే అంశంగా పరిగణించవలసి ఉ ంటుంది. ఈ పోకడ వలసలను పెంచే లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఉపాధి కోసం వెళ్ళే కాలానుగుణమైన వలసలను కూడా కలుపుకొని, బాలల అక్రమ రవాణా లాంటి లక్షణాలను కూడా కలిగి ఉంటుంది.

ఇంకా ఈ అధ్యయనం చెప్పిన విషయమే మంటే, బాల కార్మికులు కళ్ళు తిరిగేంత ఎక్కువ సంఖ్యలో (80 శాతం) గ్రామీణ ప్రాంతాల మీద ఆధారపడి ఉన్నారు. మరీ ముఖ్యంగా ప్రతి ఐదుగురిలో ముగ్గురు వ్యవసాయంలో పనిచేస్తున్నారు. వ్యవసాయదార్లుగా లేక వ్యవసాయ కార్మికులుగా గృహ ఆధారిత ఉ పాధిపై ఆధారపడి ఉన్నారు. భారతదేశంలో బాల కార్మికవ్యవస్థ కొన్ని ఆక్షేపణీయ వయో పరిమితి గల గ్రూపులలో కూడా కనిపిస్తుంది. 2001-11 దశాబ్దం మొత్తంమీద 10-14 సం॥ల వయో పరిమితిగల బాల కార్మికుల్లో 30 శాతం (దాదాపు 32 లక్షలు) తగ్గుదల కనిపించింది. దీనికి విరుద్ధంగా 5-9 సంవత్సరాల వయో పరిమితి గల బాల కార్మికుల్లో 6,80,000 పెరుగుదల, 2001 నుండి 37 శాతం పెరుగుదల ఉంది. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో 5-9 సంవత్సరాల వయోగ్రూపులో బాల కార్మికుల పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. 2001 నుంచి పనిచేసే బాలుర సంఖ్యలో 154 శాతం (2,20,214 పెరుగుదల), పనిచేసే బాలికల్లో 240 శాతం (2,00,791) పెరుగుదల ఉ ంది.

చాలా తీవ్రమైన, బహుముఖమైన ఈ సమస్యను మరింత లోతుగా చూస్తే సవరించబడిన చట్టంలో బాలలను కుటుంబ ఆధారిత వృత్తులలోకి అనుమతించడం ఒక ప్రధాన సమస్యగా ఉన్నది. వాస్తవంగా ప్రతి 100 మంది బాలల్లో కేవలం 23 మంది మాత్రమే తమ వయసుకు తగిన ఉన్నత సెకండరీ విద్యను పూర్తి చేయడం జరుగుతుందని 2014-15 జిల్లా విద్యా సమాచార వ్యవస్థ (డిఐఎన్ఇ) ఆధారంగా తెలుస్తున్నది. "ఆర్థికపరమైన పరిస్థితులలో" పాఠశాలలో చేరిన బాలలు పెంచబడిన పనిగంటల నేపథ్యంలో అంతిమంగా పాఠశాల నుండి డ్రాపౌట్స్‌గా మిగులుతారు.

పూర్తికాలపు కార్మికులు (ఒక సంవత్సరంలో 6 నెలలకంటే ఎక్కువకాలం పనిచేసే బాలలు), తాత్కాలిక కార్మికులు (ఒక సంవత్సరంలో 6 నెలల కంటే తక్కువకాలం పనిచేసే బాలలు) మధ్య పోలిక చూసేటట్లయితే, పూర్తికాలపు కార్మికులలో 7-14) సంవత్సరాల వయోగ్రూపులో ప్రతి ముగ్గురిలో ఒకరు, దాదాపుగా 14 లక్షల మంది బాల కార్మికులు) నిరక్షరాస్యులుగా ఉన్నారు. 2011 జనాభా లెక్కల సమాచార విశ్లేషణ ప్రకారం దాదాపు 20 లక్షల మంది తాత్కాలిక కార్మికులు తమ చదువు విషయంలో రాజీపడటం ఆందోళన కలిగించే విషయం. పాఠశాల, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణ ప్రతి ఒక్కరూ పూర్తి చేయాల్సిన అవసరం లేదని ప్రత్యేకంగా

చెప్పాల్సిన పనిలేదు. ప్రభుత్వ గణాంకాలు జాతీయ దృశ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. బీహార్‌లో నిరక్షరాస్య బాలలు 45 శాతం, రాజస్తాన్, జార్ఖండ్‌లలో అది 40 శాతంగా ఉన్నారు. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలో ఆ సంఖ్య 38 శాతంగా ఉన్నది. పనిచేసే బాలలు ముంద స్తుగా బడి మానివేయటం ద్వారా (డ్రాపౌట్స్) నిరక్షరాస్యతా శాతాన్ని పెంచు తుంది. బడిలో నేర్చుకోనివారు ఉద్యోగ ప్రపంచంలో బయట మిగిలిపోతారు. ఈ విధంగా అది పేదరికం, నిరుద్యోగం లాంటి విషవలయాలను ఉద్దేశ్య పూర్వకంగా పెంచుతూ, తరాల మధ్య అంత రాలను పెంచేటందుకు ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో బలమైన జాతి నిర్మాణం కోసం మన బాలలపై పెడుతున్న పెట్టు బడులను పునః పరిశీలన చేయడం తప్పనిసరి.

**ఉద్దేశ్యాన్ని ఓడించాలి**

కుటుంబ వ్యవస్థలో భాగంగా ఉన్న ఒకస్థా యి కార్యకలాపాలు, అనేక రకాల ఒత్తిళ్ళు పిల్లల యొక్క శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే అనేక రకాల అంశాలు కూడా విస్మరించ బడ్డాయి. వాటిలో ఇవి కలిసి ఉన్నాయి.

1) ఎక్కువ కష్టంతో కూడిన కార్యకలా పాలైన ఎంబ్రాయిడరీ పని, తివాచీల అల్లకం, గాజుల తయారీ, బీడీలు చుట్టడం మొదలైనవి 2) అననుకూల వేళల్లో పనిచేయమని బల వంతం చేయడం 3) లైంగిక, శారీరక భావోద్వే గాల మీద దాడులతో కూడిన బెదిరింపుల ద్వారా దోపిడీ చేయడం ఉదా: గృహ సంబంధ మైన బాల కార్మిక వ్యవస్థ, వ్యవసాయక పొలాల్లో పని) 4) కొన్ని ప్రత్యేక వృత్తులలో గుర్తించదగిన ఆరోగ్య సమస్యలు (ఉదా: ఆహా రాన్ని శుద్ధి చేయడం, రసాయన పరిశ్రమలు, ఇటుక బట్టీలు) 5) వలసల బాధ (ఉదా: కాలనుగుణమైన వలస, చెరకు, నూలు, సోయాబీన్స్ పరిశ్రమలలాంటి కాలానుగుణమైన పనుల నిర్వహణకు వలస)

దీనికి అదనంగా, చట్టబద్ధంగా లభించిన ఈ అవకాశాన్ని కాంట్రాక్టర్లు దుర్వినియోగ పరుస్తూ బాల కార్మికులను పొరుగు సేవలకు, తేలిక పనుల్లో కుటుంబ సభ్యుల్లో పెద్దవారికి సహాయకులుగా ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా పనిలో ఎక్కువ భాగాన్ని పిల్లలకు మళ్ళించడానికి, తక్కువ వేతనాలు ఇవ్వడానికి, దోపిడీ చేయడానికి కాంట్రాక్టర్లకు మంచి అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ సవరణ క్రింద కుటుంబం, కుటుంబ వ్యాపారం అనే వాటికి అనేకరకాలైన నిర్వచనాలను ఇవ్వవచ్చు. ఈ చట్టం యొక్క ఉద్దేశ్యప్రకారం 'కుటుంబం' అంటే

"దీనికి అదనంగా, చట్టబద్ధంగా లభించిన ఈ అవకాశాన్ని కాంట్రాక్టర్లు దుర్వినియోగపరుస్తూ బాల కార్మికులను పొరుగు సేవలకు, తేలిక పనుల్లో కుటుంబ సభ్యుల్లో పెద్దవారికి సహాయ కులుగా ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా పనిలో ఎక్కువ భాగాన్ని పిల్లలకు మళ్ళించడానికి, తక్కువ వేతనాలు ఇవ్వడానికి, దోపిడీ చేయడానికి కాంట్రాక్టర్లకు మంచి అవకాశాన్ని కల్పిస్తుంది."



భవన నిర్మాణాలలోయ బాలకార్మికులు

బిడ్డతో సంబంధం కలిగిన తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి, చిన్నాన్న, చిన్నమ్మ, అత్త, మామ 'కుటుంబ వ్యాపారం అంటే ఏదైనా పని, వృత్తి, ఉత్పత్తి లేదా వ్యాపారం పనిలో ఇతర వ్యక్తులను ఉపయోగించుకొని కుటుంబ సభ్యులు నిర్వహించేది. వాస్తవానికి ఈ నిర్వచనాలు పిల్లలచేత పనిచేయించడానికి ఒక స్థాయిలో చేసిన ఏర్పాట్లు. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా సొంతంగా లేదా ఈ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా, ఎక్కడైనా పనిలో ఉండడం లేదా ఈ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా, ఎక్కడైనా ఒక పెద్ద కాంట్రాక్టరు క్రింద పనిచేయడం లాంటి వాటికి ఇవి ఏర్పాట్లు. వాస్తవానికి ఇది ఆచరణలో అన్ని వృత్తులను కలుపుకునే ప్రమాదముంది. దీనికి అదనంగా, ఈ నిర్వచనం బాలల అక్రమ రవాణను పెంచడానికి ఒక సాధనంగా, చట్టంలో కనబడు లోపం వారికి ఉ పయోగపడుతుంది. బాలల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులలో దగ్గరి కుటుంబ సభ్యులు లేదా సామాజిక సభ్యులు ఉంటున్నారు. ఆ విధంగా విస్తరింపబడిన ఈ నిర్వచనం ముగుసులో కుటుంబం, కుటుంబ వ్యాపారం, బాలల అక్రమ రవాణా వ్యాపారం చక్కగా అభివృద్ధి చెందుతుంది.

అందువలన ప్రభుత్వవాదన అయినటువంటి "పిల్లల తల్లిదండ్రులకు సహాయపడడం... అలా సహాయపడడం ద్వారా వృత్తుల యొక్క మౌలిక అంశాలను నేర్చుకోవడం' అనేది బాలలను శ్రమదోపిడీ నుంచి కాపాడాలి అనే ఉద్దేశ్యాన్ని పూర్తిగా ఓటమి పాల్జేస్తుంది. బాలల సంక్షేమం పట్ల సరిపోయినంత నియంత్రణ, సంస్థాగతమైన సామర్థ్యం లేని పరిస్థితులలో, బాల కార్మికులు క్రమపద్ధతిలేని వ్యాపారాలు, ఇతర కుటుంబ ఏర్పాట్లలోకి రక్షణలేని విధంగా తరలించబడి శ్రమదోపిడీకి గురిచేయబడుతున్నారు. ఎప్పుడైతే పిల్లలకు చదువుకోవడానికి తగిన వాతావరణం కల్పించబడుతుందో, ఎక్కడైతే వారు ప్రత్యేకించి పనిలో కాకుండా బడిలో ఉంటారో అక్కడ ఈ సమస్య వాస్తవంగా పరిష్కరించబడుతుంది.

అంతేకాకుండా బాలలను కుటుంబ వ్యాపారాలలోకి అనుమతించడం అనేది వృత్తులపై ఆధారపడిన కులవ్యవస్థకు బద్ధులను చేసి, వారియొక్క కుటుంబ సాంప్రదాయక వృత్తులలో చిరస్థాయిగా కొనసాగేదానికి రక్షణ

> **"విషయమేమంటే ఫ్యాక్టరీల చట్టం అనేది పెద్దదైన కార్మికుల కోసం, అలాగే నియంత్రణా వ్యవస్థ అనేది యువజనులు, పెద్దలకు మాత్రమే వర్తిస్తుంది తప్ప, బాల కార్మికులకు ఏ రకంగానూ వర్తించదు. బాలలను ఒక ప్రత్యేక గ్రూపుగా పరిగణించి అభివృద్ధి, రక్షణకు మరింత స్పష్టమైన చర్యల అవసరాన్ని గుర్తించడంలో శాసన నిర్మాతలు విఫలమయ్యారు."**



రాళ్ళమధ్య బుగ్గి అవుతున్నబాల్యం

కల్పిస్తుంది. ఇది బాలలకు కొత్తవాటిని నేర్చుకోవడానికి, వారి విద్యలో భాగంగా ఉద్యోగితా వ్యాపారాలు నేర్చుకోవడానికి సరిపోయినన్ని అవకాశాలను కల్పించదు. భారతదేశంలో పనిచేసే బాలల్లో (5-14 సంవత్సరాల వయసు) దాదాపు 35 శాతం మంది సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారు. కాబట్టి సామాజిక నిర్మాణంలో యథాతథస్థితిని కొనసాగించడమనేది ఈ బాలల పట్ల సామాజిక, ఆర్థిక ప్రమాదంగా మారుతుంది. ఈ సవరణలు సంవత్సరాలు గడుస్తున్నా బాలలను పాఠశాలల్లో నిలకడగా ఉండుటకు సహాయపడని, నాణ్యమైన విద్యను అందుకోలేని, అంతిమంగా సమాన అవకాశాలను కల్పించడానికి వ్యతిరేకమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది.

బాల కార్మిక చట్ట సవరణ బిల్లు ప్రధానంగా బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 (ఆర్‌టిఇ 2009) క్రమంలో తేబడింది. అందులో చెప్పబడిన లక్ష్యాలలో దృఢంగా చెప్పబడిన ఒక లక్ష్యం ఏమంటే, 6-14 సంవత్సరాల మధ్య వయసుగల పిల్లలందరూ పనిచేసే ప్రదేశాలలో కాకుండా పాఠశాలల్లో ఉండాలని సవరించబడిన బిల్లు మూలంలో ఏకకాలంలో రెండు చట్టాలను సవరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చూడటానికి ఇది 14 సంవత్సరాల లోపు బాలలను ఆదర్శవంతంగా తయారు చేయడానికి తోడ్పడేదానిలాగా కనిపిస్తుంది. అమలులోకి వచ్చినప్పుడు, విధానపరమైన లోపాలతో చివరకు పిల్లవాడు బాధితుడుగా తయారయ్యేటట్లు చేస్తుంది. అందువల్ల చట్టసవరణ ద్వారా ప్రభుత్వం చెప్పే న్యాయం, బిడ్డకు విద్యయొక్క అవసరం, సామాజిక ఆర్థిక పరిస్థితుల సమతూకాన్ని సాధించలేని నినాదానికి ఒక ముఖ్య కారణంగా మిగులుస్తుంది.

విద్యాహక్కు చట్టం 4వ క్లాజులోని షరతుల ప్రకారం ఎవరైనా బాలలు పాఠశాల విద్య చదవలేకపోవచ్చు. అందువల్ల 14 సం॥లలోపు ప్రాథమిక విద్యను పూర్తి చేయలేకపోతే, ప్రాథమిక విద్యను పూర్తి చేసేవరకూ, 14 సం॥లు లేదా ఆ తరువాత కూడా ఉచిత విద్యాహక్కును కలిగించవచ్చు. 14 సం॥లు పైబడిన బాలలను పనిచేయడానికి అనుమతించినట్లయితే ఎవరైతే ప్రాథమిక విద్యను పూర్తి చేయకుండా పాఠశాలలను వదిలిపెట్టారో, వారు పనిలోకి నెట్టబడి అనివార్యంగా పనిచేసేటట్లు చేస్తుంది. ఇది బాలలందరికీ విద్యను అందించాలనే రాజ్యాంగ ఉత్తర్వులకు విరుద్ధమైన విషయం.

''ప్రమాదకరమైన వృత్తుల''లో పనిచేసేవారుగా బాలలను నిషేధించాలని బాల కార్మికచట్టం నిర్వచిస్తుంది. బాల కార్మిక నిషేధ మరియు నియంత్రణ చట్టం 1986 (సిఎల్‌పిఆర్ఎ 1986) 18 రకాల వృత్తులు, 66 రకాల పని పద్ధతులను ప్రమాదకరమైన పనుల జాబితాగా స్పష్టం చేసింది. ఈ జాబితా ఒక అభివృద్ధికరమైన పరిణామంగా 30 సంవత్సరాల పైబడిన దానిని కేంద్ర సాంకేతిక సలహామండలి (సిటిఎసి), బాల కార్మిక నిషేధ మరియు నియంత్రణ చట్టం క్రింద ఏర్పాటు చేయబడిన దాని ప్రకారం, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రెండింటి ద్వారా సిఫార్సులు చేయడం జరిగింది. అయితే దురదృష్టవశాత్తూ సవరించబడిన చట్టం ప్రమాదకరమైన వృత్తుల జాబితాను తిరగరాసింది. అందులో కేవలం గనులు, పేలుడు సంబంధమైన, ప్రమాదకరమైన పని పద్ధతులను 1948 ఫ్యాక్టరీల చట్టం ప్రకారం నిర్వచించడం చేశారు. ఇక్కడ తప్పనిసరిగా గమనించాల్సిన విషయమేమంటే ఫ్యాక్టరీల చట్టం అనేది పెద్దదైన కార్మికుల కోసం, అలాగే నియంత్రణా వ్యవస్థ అనేది యువజనులు, పెద్దలకు మాత్రమే వర్తిస్తుంది తప్ప, బాల కార్మికులకు ఏ రకంగానూ వర్తించదు. బాలలను ఒక ప్రత్యేక గ్రూపుగా పరిగణించి అభివృద్ధి, రక్షణకు మరింత స్పష్టమైన చర్యల అవసరాన్ని గుర్తించడంలో శాసన నిర్మాతలు విఫలమయ్యారు.

**సంకుచిత వివరణ**

ఒక స్థాయి వృత్తులైన ఇండ్లలో చేసే శ్రమ, ఇటుక బట్టీలలో పని, వ్యవసాయంలో రసాయనిక క్రిమిసంహారక మందులను చల్లడం, వజ్రాలు కోయడం, జంతువులను చంపే ప్రదేశాలలో పనిచేయడం, తివాచీల అల్లకం, ప్రత్తి నుండి గింజలను వేరుచేయడం, రాళ్ళు పగులగొట్టడం, పిండిచేయడం, టైర్లకు తిరిగి చారలు వేయడం లాంటి పనులన్నీ పిల్లలకు ప్రమాదకరమైన వృత్తులు కాదని, ప్రమాదకరమైన వృత్తులను పునర్నిర్వచించారు. సవరించబడిన చట్టం 15-18 వయో పరిమితి గ్రూపుకు చెందిన బాలలను కుటుంబ పనులలో ఉన్నవారిలాగా ప్రమాదకరమైన వృత్తులలో పనిచేయడాన్ని ఇది నిషేధిస్తుంది. ఆ విధంగా ప్రమాదకరమైన వృత్తులు అనే దానికి ఇవ్వబడిన పరిమితమైన వివరణ వలన కేవలం వ్యవస్థీకృత రంగంలో పనిచేసే వారికి మాత్రమే నిషేధపు నిబంధనలు వర్తిస్తాయి. ఆ విధంగా బాలలను ఆరోగ్యానికి హాని కలిగించే, దోపిడీకి గురిచేసే, గాయపరిచే, నియంత్రణలేని అసంఘటిత రంగంలోకి వెళ్ళే దుర్వినియోగం చేసే అవకాశాన్ని కల్పిస్తుంది. ఆ రెండు రకాల

సవరణల యొక్క ప్రభావాన్ని ఒకచోట చేర్చి లోతుగా పరిశీలన చేసినట్లయితే, 14 సంవత్స రాల లోపు హానికరమైన కుటుంబ పనులలో చేసే పనులు ఏవీ కూడా ప్రమాదకరమైనవి కావు – అని పరిగణించే విధంగా చట్టం ఈ నిర్వచనం యొక్క పరిధిని విస్తరించడం జరిగింది.

ఈ సమస్యను లైంగిక దృష్టితో చూసినప్పుడు మరింత సంక్లిష్టమవుతుంది. దీనిమీద కదలిక మొదలై, పెరుగుతున్న పరిస్థితులలో, కుటుంబ ఆధారిత పనులలో జోక్యం కలిగిన బాలికలు అత్యధికంగా ప్రభావితులవుతారు. ప్రత్యేకించి కుటుంబ ఆధారిత పనులు (పొరుగు సేవలను కూడా కలుపుకొని) అత్యధికంగా ఉన్నాయి. 2001 జనాభా లెక్కల నివేదిక ప్రకారం భారతదేశంలో 14 సం॥లలోపు 1,85,505 మంది బాలలు గృహ సంబంధమైన పనులలో ఉన్నారు. వారిలో అత్యధిక శాతంమంది బాలికలే. ఇంటిపనివారు అనేది ప్రమాదకరమైన వృత్తిగా ఎక్కువకాలం నుంచి విధించబడి ఉండలేదు. అన్ని వయసుల బాలికలు హానికరమైన కుటుంబ పనులు చేసేవిధంగా 18 సం॥ల లోపు బాలికలు తల్లికి తోడుగా సహాయం చేసే ముసుగులో ఇంటి పనివారలుగా ఉన్నారు. ఇది కూడా 15-18 సం॥ల బాలికల అక్రమ రవాణాను శాశ్వత పరచడానికి దారితీస్తుంది.

ప్రమాదకరమైన పనులకు సంబంధించిన తీర్మానంలో ఉన్న మరొక లోపమేమిటంటే, అది శాస్త్రీయమైన పద్ధతి మీదగానీ, మౌలికమైన ఋజువుల మీదగానీ ఆధారపడిలేదు. వివిధ రకాలైన సమూహాలకు చెందిన వాటాదారులతో సంప్రదించడం లాంటి దానిమీద కూడా ఆధారపడి లేదు. ఇంకా కేంద్ర సాంకేతిక సలహామండలి (సిటిఎసి), సుప్రీంకోర్టు తీర్పులు, సిఫార్సులను కూడా బలహీనపరిచే విధంగా ఉన్నది. అంతర్జాతీయ ప్రమాణాలు, సంప్రదింపుల ప్రక్రియ, అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్ఒ) యొక్క ఆర్టికల్ 3(డి), ఆర్టికల్ 4 గురించి కూడా చర్చించడం జరిగింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) 182 ఆర్టికల్ 3 (డి) ప్రకారం 'స్వభావరీత్యా లేదా బాలల యొక్క ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా, బాలల నడవడిక మీద తీవ్రంగా హానికరమైన ప్రభావం చూపుతుందో, ఏ పనులైతే నిషేధించాల్సిన అవసరముందో అవి బాల కార్మిక వ్యవస్థ యొక్క వికృతరూపము" అని సూచించింది. ఇంకా ఆర్టికల్ 4 చెప్పిన విషయమేమంటే...

ఆర్టికల్ 3(డి) క్రింద సూచించబడిన పనుల రకాల జాతీయ చట్టాల ద్వారా లేదా నియంత్రణల ద్వారా లేదా తగిన అధికారం ద్వారా సంబంధిత ఉద్యోగ సంఘాలతో, కార్మికులతో సంప్రదింపుల తరువాత అంతర్జాతీయ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని, బాల కార్మిక సిఫార్సులు 1999లోని నిర్దిష్టంగా 3,4 పేరాలను అమలు చేయాలి.

> **"ప్రమాదకరమైన పనిని నిర్వచించే సమస్యమీద, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఉపాధి కల్పన మరియు కార్మిక మంత్రిత్వశాఖ ప్రమాదకరమైన పనులను గుర్తించడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదని, ఫ్యాక్టరీల చట్టం లోని ప్రస్తుత జాబితా తీసుకోవడం జరిగిందని స్పష్టంగా అభిప్రాయం చెప్పింది."**


వ్యవసాయరంగంలో బాలకార్మికులు

ప్రమాదకరమైన పనిని నిర్వచించే సమస్యమీద, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఉపాధి కల్పన మరియు కార్మిక మంత్రిత్వశాఖ ప్రమాదకరమైన పనులను గుర్తించడానికి ఎటువంటి ప్రయత్నం చేయలేదని, ఫ్యాక్టరీల చట్టంలోని ప్రస్తుత జాబితా తీసుకోవడం జరిగిందని స్పష్టంగా అభిప్రాయం చెప్పింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇంకా నొక్కి చెప్పిన విషయమేమంటే అంతర్జాతీయ కార్మికసంస్థ 138వ సభ ప్రమాదానికి అవకాశం కల్పించే ఆ రకమైన అంశాలను, యువతకు సురక్షితమైన నియమాలను కూడా అందులో కలపాలని చెప్పిన విషయాన్ని – సంబంధిత మంత్రిత్వశాఖ విస్మరించింది. కాబట్టి ఇది ఉపాధి కల్పన మరియు కార్మిక మంత్రిత్వశాఖ సిఫార్సులు, పనుల సమీక్ష "ప్రమాదకరమైన పని పద్ధతులు" అనే నిర్వచనం యొక్క పరిధిని విస్తరించింది. ఆ రకంగా అన్నిరకాల ప్రమాదకారకాలైన పని పద్ధతులను ఆరోగ్యం, రక్షణ మరియు కౌమార వయస్కులకు నీతి నియమాలను కలపాలని చెప్పింది.

1992లో బాలల హక్కుల మీద ఐక్యరాజ్య సమితి చెప్పిన విషయాలను స్థిరపరిచింది. భారత ప్రభుత్వం అభివృద్ధికరంగా అన్ని రకాల బాల కార్మిక రూపాలను నిషేధిస్తూ ఆర్టికల్ 32లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా స్పష్టంగా చెప్పింది. ఈ చట్టానికి సవరణ చేసిన సమయంలో ఒక అవకాశం ద్వారా పైకి ఎగబాకి అభివృద్ధికరమైన చట్టం ద్వారా బాలలందరినీ కాపాడడానికి దీనిని ఉపయోగించుకోవచ్చు. మూడు దశాబ్దాల తరువాత 14 సంవత్సరాలలోపు బాలలను కుటుంబ ఆధారిత వృత్తులలో బాల కార్మికులుగా సంస్థాగతం చేయడం ద్వారా, ప్రమాదకరమైన పనులను, పనిపద్ధతుల జాబితాను పరిమితం చేయడం ద్వారా, భారతదేశం వాస్తవంగా తన పిల్లల హక్కులను కాపాడే విషయంలో విఫలమైంది.

**అనువాదం: కె నాగమల్లేశ్వరరావు**

# గుజరాత్ అభివృద్ధి నమూనా


రచయిత ప్రొఫెసర్

**ఆర్ రామకుమార్**

ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్రమోడిని తెరపైకి తీసుకొచ్చినప్పుడు ప్రత్యామ్నాయ అభివృద్ధికి గుజరాత్‌ను నమూనాగా చూపుతూ బిజెపి పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. బిజెపి చేపట్టిన ఈ ప్రచారానికి కార్పొరేట్ రంగం నుంచి, మితవాద ఆర్థికవేత్తల నుంచి, భారత ఉదారవాద రచయితల్లో ఒక సెక్షన్ నుంచి, అన్నిటికి మించి బూర్జువా మీడియా నుంచి భారీ మద్దతు లభించింది.

బిజెపి ప్రచారాన్ని సంక్షిప్తంగా గమనిస్తే మూడు ప్రధానాంశాలు కనిపిస్తాయి. మొదటిది, ముఖ్యమంత్రిగా మోడీ పాలనలో గుజరాత్ గతంలో ఎన్నడూ లేనంత అపూర్వమైన ఆర్థిక ప్రగతి సాధించిందనేది. మోడీగారి మాటల్లోనే చెప్పాలంటే 'గుజరాత్..భారత అభివృద్ధి యంత్రం'. రెండోది, మోడీ హయాంలో 'అభివృద్ధికి గుజరాత్ పర్యాయపదం'గా మారిందనేది. ప్రత్యేకించి ఆదాయంలోనూ, ఉద్యోగిత స్థాయిల్లోనూ గణనీయమైన మెరుగుదల సాధించిందనేది బిజెపి ప్రచారం. ఇక మూడోది మోడీ పాలనలో గుజరాత్‌లోని మెజార్టీ ప్రజల జీవన ప్రమాణాల్లో మెరుగుదల వచ్చిందని, గుజరాత్‌లో నమోదైన వృద్ధి సమగ్రమైనదని, ఇదంతా కూడా మోడీ సుపరిపాలన ఫలితమని బాకాలూదారు. అయితే బిజెపి, మోడీ వాదనలను తిప్పికొట్టే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అనేక మంది సామాజిక శాస్త్రవేత్తలు బిజెపి, మోడీ చేస్తున్న ప్రచారమంతా అర్థసత్యాలనీ, వాస్తవాలైతే ఆధారాలు చూపాలని నిలదీశారు. కొన్ని ఎంపిక చేసుకున్నవాటిలో వాస్తవిక సమాచారాన్ని ఉన్నదానికంటే అధికంగా చూపుతూ అవాస్తవాలను ప్రచారం చేశారనీ నిగ్గుతేల్చారు. వివాదస్పదమైన గుజరాత్ అభివృద్ధి నమూనా లోగుట్టుపై లోతైన విశ్లేషణే ఈ కథనం.

అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి భారత్‌లోని వివిధ రాష్ట్రాల గణాంకాలను విశ్లేషిస్తే బిజెపి, మోడీ చెబుతున్నట్లుగా గుజరాత్ ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాగా నిలుస్తోందా?, లేదా అదంతా ఒట్టి ప్రచారమేనా అనే విషయం బోధపడుతుంది.

**గుజరాత్ భారత్ అభివృద్ధి యంత్రమనే ప్రచారంలో వాస్తవమెంత?**

గుజరాత్ చరిత్రను ప్రస్తావించకుండా దాని ఆర్థిక ప్రగతిని విశ్లేషించడం సాధ్యపడదు. ఆర్థిక చరిత్రకారుల వాదనల ప్రకారం వలసవాద పాలన ఫలితంగా భారత్‌లో సాంప్రదాయ వ్యవసాయ ప్రాంతాలకు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతాలకు మధ్య ఊగిసలాట దోరణి కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే, పెట్టుబడిదారులు, వ్యాపారవర్గాల అభివృద్ధి, అసమానతల సృష్టితో వలసవాద వృద్ధి ప్రక్రియ ముడిపడివుంటుంది. ఇది సహజంగానే దీర్ఘకాలంలో ప్రాంతాల మధ్య ఆర్థిక వృద్ధి రేటులో వ్యత్యాసాలకు దారితీస్తుంది.

చారిత్రకంగానే గుజరాత్ తలసరి ఆదాయం భారత్‌లో ఏ రాష్ట్రంతో పోల్చినా అత్యధికంగా ఉండే వాటిలో ఒకటిగా ఉంటుంది. ప్రపంచ యుద్ధాల మధ్య సంవత్సరాల నుంచే సాగునీరు, తయారీ పరిశ్రమలు వంటి రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులకు అనువైన ప్రాంతాల్లో గుజరాత్ ఒకటిగా ఉండేది. వ్యవసాయంలో పెట్టుబడిదారీ సంబంధాలు మొగ్గ తొడిగిన అనుభవమున్న ప్రాంతాల్లోనూ గుజరాత్ ఒకటిగా ఉంది. 20వ శతాబ్ది పూర్వార్ధంలో బొంబాయితో పాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్, బరోడా ప్రాంతాల్లో పత్తిపంట, వస్త్ర పరిశ్రమ బాగా వేళ్లూనుకున్నాయి. ఈ పట్టణాల్లోని పెట్టుబడిదారి వర్గాలు టెక్స్‌టైల్ పరిశ్రమల్లో వచ్చిన లాభాలను సిమెంటు, చక్కెర, రసాయనాలు వంటి కొత్త రంగాల్లో తిరిగి పెట్టుబడి పెట్టారు.

**తలసరి ఆదాయాల స్థాయి**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం గుజరాత్ ఆర్థిక వృద్ధి రేటు బాగా పెరగడానికి పైన పేర్కొన్న చారిత్రక కారణాలు గణనీయమైన ప్రభావం చూపాయి. 1960-61 నాటికే భారత్‌లో అన్ని రాష్ట్రాల తలసరి ఆదాయాల స్థాయిలను చూస్తే గుజరాత్ మూడో ర్యాంకులో నిలిచింది. 1980-81లోనూ అదే విధంగా 2009-10లోనూ తలసరి ఆదాయం పరంగా గుజరాత్ మొదటి ఐదు రాష్ట్రాల్లోనే తన స్థానాన్ని నిలబెట్టుకుంటూవచ్చింది. అందువల్ల 2000లలో కూడా గుజరాత్ తలసరి ఆదాయాలు పెరగడమనేది యాదృచ్ఛికమే మినహా అదేదో నరేంద్ర మోడీ ప్రభుత్వం సాధించిన గొప్ప లక్ష్యమేమీ కాదన్నది చాలా స్పష్టం. స్వాతంత్ర్యానంతరం ఆర్థికవృద్ధిలో గుజరాత్ అగ్రపీఠాన నిలవడమనేది తీవ్రమైన ప్రాంతీయ అసమానతలకు ప్రతిబింబం కూడా.

**స్థూల రాష్ట్రీయోత్పత్తి వృద్ధి (ఎన్ఎస్‌డిపి)**

1980లలోనూ, 1990లలోనూ, 2000లలోనూ జాతీయ సగటు కంటే స్థూల రాష్ట్రీయోత్పత్తి వృద్ధి (ఎన్ఎస్‌డిపి) రేటు గుజరాత్‌లో అత్యధికంగా ఉంది. ఈ మూడు దశాబ్దాల్లోనూ ఎన్ఎస్‌డిపి వృద్ధి రేటులో గుజరాత్ మొదటి మూడు స్థానాలలోనే కొనసాగుతూ వచ్చింది. 1990-2000లలో గుజరాత్ వృద్ధి సూచీలు 6.8 శాతం నుంచి 8.6 శాతానికి పెరుగుతూ రావడం ఆశ్చర్యకరమూ కాదు. లేదా మోడీగారి పాలన ఫలితమూ కాదు. మొదటిది వృద్ధి రేటు పెరిగిన ర్యాంకుల పరంగా చూస్తే గుజరాత్ 1990లలో మొదటి స్థానంలో ఉండగా 2000లలో మూడో స్థానికి పడిపోయింది. గుజరాత్ ఎన్ఎస్‌డిపితో పోలిస్తే బీహార్, హర్యానా వృద్ధి సూచీలే అధికంగా ఉన్నాయి. దీనికి తోడు 1990-2000ల మధ్యకాలంలో వృద్ధి రేట్ల పరంగా చూసినా గుజరాత్ కంటే హర్యానా, బీహార్, ఒడిశా వంటి రాష్ట్రాలు ఎక్కువ పెరుగుదల సాధించాయి. రెండోది 2000లలో మొత్తం దేశవ్యాప్తంగానే వృద్ధి రేట్లు బాగా పెరిగాయి. దాని ప్రభావంతోనే గుజరాత్‌లోనూ వృద్ధి రేట్లు పెరిగాయి. చాలా రాష్ట్రాలు,

ప్రత్యేకించి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ కూడా 1990లతో పోలిస్తే 2000లలో అత్యధిక వృద్ధి రేట్లు సాధించాయి. ఇంకో మాటలో చెప్పాలంటే మోడీ ముఖ్యమంత్రి అయిన తర్వాత గుజరాత్ ఆర్థికవృద్ధి రేట్లలో సాధించిన ప్రత్యేక అభివృద్ధి ఏదీ లేదు.

1990, 2000ల మధ్య జరిగిన గుజరాత్ ఆర్థిక వృద్ధిని అధ్యయనం చేసిన ఆర్థిక వేత్తలు రెండు ముఖ్యమైన అంశాలు స్పష్టం చేశారు. మొదటిది, 1990లతో పోలిస్తే 2000లలో దేశీయ సగటు మించి గుజరాత్ తన వృద్ధిని విస్తరింప చేసిందనడానికి ఆధారమేది లేదని ఘటక్, రాయ్ తెలిపారు. ఇంకా చెప్పాలంటే 1990-2000 మధ్యకాలంలో భారత్ ఎన్ఎస్‌డిపి రేటుకు, గుజరాత్ ఎన్ఎస్‌డిపి రేటుకు మధ్య వ్యత్యాసం స్థిరంగానే కొనసాగిందని వారంటారు. ఇక రెండోది, మోడీ నాయకత్వ పటిమ వల్లే 2000లలో గుజరాత్ వృద్ధిరేటు గణనీయంగా పెరిగిందనడానికి కానీ, గణనీయమైన అదనపు ప్రభావం చూపిందనడానికి కానీ ఒక్క ఆధారమూ లభించలేదని స్పష్టం చేశారు. 1990లలోనూ, 2000లలోనూ గుజరాత్ పారిశ్రామిక వృద్ధికి రెండు ప్రధానమైన అంశాలు కారణంగా కనిపిస్తున్నాయి. ఒకటి గుజరాత్ పారిశ్రామిక పనితీరు చాలా అసమతుల్యమైనది. కొన్ని ఎంపిక చేసిన రంగాలపైనే దృష్టి కేంద్రీకరణ జరిగింది. 2000లలో పెరిగిన ఉత్పాదక వృద్ధిరేటులో అత్యధిక భాగం ఒకే ఒక్క పెట్రోలియం శుద్ధి రంగం నుంచే నమోదైంది. నాగరాజ్, పాండే వాదన ప్రకారం 2000-01లో 4.1 శాతం ఉన్న ఉత్పాదక వృద్ధిరేటు పెట్రోలియం శుద్ధిరంగం వాటాను ఉత్పాదక వృద్ధిలో చేర్చడంతో 2008-09లో 25శాతానికి ఎగబాకింది. పెట్రోలియం శుద్ధిరంగం వాటాలో కూడా అత్యధిక భాగం జామ్‌నగర్‌లోని రిలయన్స్, ఎస్సార్ సంస్థలదే. ఈ గణాంక సమాచారాన్ని బట్టి నాగరాజ్, పాండే రెండు నిర్ధారణలకు వచ్చారు. మొదటిది గుజరాత్‌లో రిఫైనరీలు మినహా మిగిలిన ఉత్పాదక పరిశ్రమల వృద్ధి రేటు వాస్తవానికి 2000లలో బాగా తగ్గింది. రెండోది గుజరాత్ ఆర్థిక వ్యవస్థతో పెట్రోలియం పరిశ్రమకు ఉన్న సంబంధాలు చాలా బలహీనమైనవి. ఎందుకంటే ఈ పరిశ్రమ చాలా వరకు దిగుమతులపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడులు ఎక్కువగా ఉంటాయి. వ్యయంతో కూడుకొని ఉంటుంది. పైగా ఎగుమతులతో కూడుకున్న పరిశ్రమ.

**"మొదటిది గుజరాత్‌లో రిఫైనరీలు మినహా మిగిలిన ఉత్పాదక పరిశ్రమల వృద్ధి రేటు వాస్తవానికి 2000లలో బాగా తగ్గింది. రెండోది గుజరాత్ ఆర్థిక వ్యవస్థతో పెట్రోలియం పరిశ్రమకు ఉన్న సంబంధాలు చాలా బలహీనమైనవి. ఎందుకంటే ఈ పరిశ్రమ చాలా వరకు దిగుమతులపై ఆధారపడి ఉంటుంది. పెట్టుబడులు ఎక్కువగా ఉంటాయి. వ్యయంతో కూడుకొని ఉంటుంది."**



నరేంద్రమోడి

(సంబంధాలు బలహీనమైనవి అంటే దానర్థం గుజరాత్ ఆర్థిక వ్యవస్థతో పెట్రోలియం రిఫైనరీ పరిశ్రమను ముడిపెట్టడం వల్ల ఒరిగేదేమీ లేదని). 2000లలో గుజరాత్ ఉపాధి వృద్ధిరేటు చాలా తక్కువగా ఉండటం ఈ నిర్ధారణకు రావడానికి మద్దతునిచ్చే అంశం.

### ప్రయివేటు సుసంపన్నతకు ప్రధాన వనరుగా భూమి

గుజరాత్‌లో పారిశ్రామిక వృద్ధి ప్రయివేటు రంగాన్ని సుసంపన్నం చేసే నయా ఉదారవాద నమూనాకు చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. 1990లలోనూ, 2000లలోనూ గుజరాత్ పారిశ్రామిక వృద్ధి ప్రక్రియలో భాగంగా భూసంస్కరణ చట్టాలను బలహీనపర్చడం, భూ నిబంధనలను ఎత్తివేసి ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడం వంటివి కీలక పాత్ర పోషించాయి. అటు 1995 వరకు కాంగ్రెస్ ఏలుబడిలోనూ, 1996 తర్వాత బిజెపి ప్రభుత్వంలోనైనా 'ప్రయివేటుకు దోచిపెట్టే' విధానమే ఎటువంటి అంతరాయాలు లేకుండా యధేచ్ఛగా కొనసాగింది.

### నయా ఉదారవాద ప్రకరణం

నయా ఉదారవాద విధానం కింద భారత్‌లో ప్రాంతాల అభివృద్ధి అంటే ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్య 'పోటీ'ని ప్రోత్సహించడం, ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ప్రధానాంశంగా మారింది. అహ్లూవాలియా ఈ నూతన విధానం గురించి చర్చను లేవనెత్తారు. ఆయన ప్రకారం ప్రయివేటు పెట్టుబడులకు ప్రభుత్వ పెట్టుబడులు చాలా బలహీనమైన ప్రత్యామ్నాయమనీ, పైగా ప్రయివేటు రంగం చాలా పోటీతత్వంతో ఉండి సమర్థవంతంగా పనిచేస్తుందనీ, అందువల్ల భారత్‌లో ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపయోగం చాలా పరిమితం అని ఆయన అంటారు. కొత్త విధానంలో ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానించడం రాష్ట్రాల బృహత్తర బాధ్యతగా మారిపోయింది. 1991తర్వాత రాష్ట్రాల మధ్య అంతరాలు పెరిగిపోయాయంటే దానికి ప్రాథమిక కారణం తగినన్ని ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించడంలో వెనుకబాటు, రాష్ట్రాల చేతగానితనమేనని అంటారాయన. ఖర్చులు ఎక్కడయితే తక్కువగా ఉంటాయో అక్కడకు రావటానికి ప్రయివేటు పెట్టుబడులు మొగ్గుచూపుతాయి కాబట్టి ప్రోత్సాహకాల్లో పోటీ బాగా పెరిగిపోయిందనేది అహ్లూవాలియా ఉవాచ. అంతిమంగా, ప్రయివేటు పెట్టుబడులను ఎక్కువగా ఆకర్షించాలంటే పెట్టుబడి ఖర్చులను తగ్గించాలి. కాబట్టి కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా సాధ్యమైన ఎక్కువగా నిర్వీర్యం చేయడం రాష్ట్రాలకు తప్పని పరిస్థితి.

ఏదేమైనప్పటికీ అనుభవంలోకి వచ్చేసరికి ఏం జరుగుతోందంటే ప్రయివేటు పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రాష్ట్రాల మధ్యన అరాచకమైన, అసంబద్ధమైన పోటీ పెరిగిపోయింది. ప్రయివేటు పరిశ్రమలను నెలకొల్పడంలో వ్యయాల విషయంలో రాష్ట్రాల మధ్యన తేడాలొస్తే.. పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వాలు ఆకర్షణీయమైన పన్ను రాయితీలు

> "కొత్త పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పన్ను రాయితీలు ప్రకటిస్తూ, కొన్ని రాష్ట్రాలు కార్మిక చట్టాలకు పాక్షిక సవరణలు చేస్తూ ఆహ్వానిస్తుంటే గుజరాత్ ప్రభుత్వం మాత్రం మరో ముఖ్యమైన అదనపు సాధనాన్ని బయటకు తీసింది. అదే ప్రభుత్వ భూమిని ఉచితంగా ప్రయివేటుకు కట్టబెట్టడం (ఫ్రీయింగ్ ద ల్యాండ్ మార్కెట్)."

ఆఫర్ చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా, దాదాపు పూర్తిగా ప్రయివేటు పెట్టుబడులపైనే ఆధారపడాల్సిరావడంతో కొత్తగా వచ్చే ప్రయివేటు పెట్టుబడులపై పన్నుల విధింపులో పోటీ లేకుండా పోయింది. మరోవైపు ప్రయివేటు పెట్టుబడిదారులు ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాల ప్రభుత్వాలతో పన్ను రాయితీల కోసం బేరాలాడుతూవస్తున్నారు. కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలు ఖర్చు తగ్గింపు అవకాశాలపై ఎక్కువకాలం ఆధారపడవు. అయితే ఇందుకోసం ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము అంతాకూడా పెట్టుబడిదారుల జేబుల్లోకి వెళ్లిపోతుంది. ఒకరకంగా చెప్పాలంటే దీన్ని 'సాంఘిక లంచం (సోషల్ బ్రైబ్)'గా పిలువవచ్చు.

దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల కంటే ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా గుజరాతే ఈ 'సాంఘిక లంచం' అనుభవాన్ని చాలా ముందుగా మొదలుపెట్టింది. 1990ల ప్రారంభంలోనే గుజరాత్ కొత్తగా వచ్చే ప్రయివేటు పెట్టుబడిదారులకు అమ్మకపు పన్ను తగ్గించడం లేదా మినహాయించడం లేదా వాయిదా వేయడం వంటి చర్యలు చేపట్టింది. ధోలాకియా (2006) అంచనా ప్రకారం 1991-95 మధ్యకాలంలో ఈ అమ్మకం పన్ను నజరానాల వల్ల గుజరాత్ ప్రభుత్వం ఏటా రూ.210 కోట్లు ఆదాయన్ని కోల్పోయింది. 1995లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నష్టం అమాంతంగా పెరిగింది. ఒక్క అమ్మకపు పన్ను మినహాయింపుల వల్లే 1997-98లో రూ.1343 కోట్లు, 1998-99లో రూ.2000 కోట్లు చొప్పున ప్రభుత్వం ఆదాయం కోల్పోయింది. ఇది చాలదన్నట్టు 1997లో ప్రభుత్వం టర్నోవర్ పన్నును ఎత్తివేసింది. ఇది కూడా చాలదనీ 2001 మే నుంచి 143 పట్టణాలు, 14,000 గ్రామాల్లో ఆక్ట్రాయ్ పన్ను (రవాణా, నగర సుంకం) సైతం రద్దు చేశారు. ఆదాయం బాగా తగ్గిపోయిన కారణంగా అదే సంవత్సరం గుజరాత్‌లోని ఏడు పెద్ద నగరాల్లో ఆక్ట్రాయ్ పన్నును అనుమతించారు. ఏదేమైనా 2007లో ఈ ఏడు పెద్ద నగరాలతో పాటు మొత్తం గుజరాత్ రాష్ట్ర మంతటా ఆక్ట్రాయ్ పన్నును రద్దు చేశారు. సుద్ (2014) అంచనా ప్రకారం ఆక్ట్రాయ్ పన్ను రద్దు వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.1800 కోట్లు ఆదాయం కోల్పోయింది.

### కార్మిక రక్షణ చట్టాలకు తూట్లు

అహ్లూవాలియా సూచించినట్లుగానే యాజమాన్యాలకు అనుగుణంగా కార్మికుల రక్షణ నిబంధనలను పూర్తిగా తొలగించి, కార్మిక చట్టాలలో సరళీకృత సంస్కరణలకు గుజరాత్ శ్రీకారం చుట్టింది. షా పరిశీలన ప్రకారం మహారాష్ట్రతో కానీ, లేదా ఏ ఇతర పోటీ రాష్ట్రాలతో పోల్చినా గుజరాత్‌లో కనీస వేతనాలను చాలా తక్కువగా నిర్ణయించారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే వేతనాల చెల్లింపునకు భరోసా కూడా చాలా తక్కువే. ఎన్ఎస్ఎస్ఒ 2011-12 సర్వే ప్రకారం జాతీయ సగటు వేతనాలతో పోలిస్తే గుజరాత్‌లో గ్రామీణ వేతనాలు 20 శాతం, పట్టణాల్లో ఇచ్చే వేతనాలు 15 శాతంగా తక్కువగా ఉన్నాయి. దీని ఫలితంగా 2006లో గుజరాత్‌లో మూలధన పెట్టుబడిలో వేతనాల శాతం 2.42 గా మాత్రమే ఉంది. ఇది కర్నాటకలో 4.04 శాతంగాను, మహారాష్ట్రలో 4.4 శాతంగాను, ఆంధ్రప్రదేశ్‌లో 4.94 శాతంగాను, హర్యానాలో 5.42 శాతంగాను, తమిళనాడులో 5.5 శాతంగాను ఉంది. దీనినిబట్టి చంద్రశేఖర్, ఘోష్ నిర్ధారణకు వచ్చిందేమిటంటే బాగా డప్పాలు కొడుతూ ప్రచారం చేస్తున్న గుజరాత్ అభివృద్ధి అంతా కూడా అతిగా చేస్తున్నదే కాక, దాని ఫలితాల పంపిణీ కూడా అసమతుల్యంగా ఉంది. అందువల్ల భారత్‌లో ఏ మూలన ఉన్న శ్రామికులతో పోల్చినా గుజరాత్‌లోని కార్మికులు కడు దయనీయులైన వారిలో ఒకరిగా ఉంటారు. కొత్త పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పన్ను రాయితీలు ప్రకటిస్తూ, కొన్ని రాష్ట్రాలు కార్మిక చట్టాలకు పాక్షిక సవరణలు చేస్తూ ఆహ్వానిస్తుంటే గుజరాత్ ప్రభుత్వం మాత్రం మరో ముఖ్యమైన అదనపు సాధనాన్ని బయటకు తీసింది. అదే ప్రభుత్వ భూమిని ఉచితంగా ప్రయివేటుకు కట్టబెట్టడం (ఫ్రీయింగ్ ద ల్యాండ్ మార్కెట్). వాస్తవానికి 2000లలో గుజరాత్‌లో ప్రయివేటు సుసంపన్నతకు అన్ని రకాల ఇతర పన్ను మినహాయింపులు, రాయితీల కంటే అత్యంత ప్రధాన వనరుగా నిలిచింది భూమే అని చెప్పాలి. ప్రయివేటుకు ప్రయోజనం చేకూర్చే ఈ ఉద్దేశ్యంతోనే భూ సంస్కరణ చట్టాలను స్వేచ్ఛగా సవరించారు. చట్టబద్ధంగా బరితెగించి దోపిడి చేసుకునేందుకు వీలుకల్పించిన నేరంలో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలకు సమాన భాగస్వామ్యముంది.

### భూసంస్కరణల వైపరీత్యం

1940ల తర్వాత నుంచి ఆమోదించిన చట్టాలను అనుసరించి 1980ల ఆఖరు వరకు గుజరాత్‌లో భూ సంస్కరణలు జరిగాయి. సొంత భూ సంస్కరణ చట్టాలు కలిగియున్న ఒక్క సౌరాష్ట్ర ప్రాంతాన్ని మినహాయిస్తే మిగిలిన రాష్ట్రమంతా బొంబాయి కౌలు, వ్యవసాయ భూమి చట్టం - 1948 అమల్లో ఉండేది. ప్రయివేటుకు పెద్దమొత్తంలో భూమిని కట్టబెట్టేందుకు వీలు కల్పిస్తూ అప్పటివరకు ఉన్న చట్టాలలో కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు అనేక మార్పులు చేశాయి.

మొదటిది, 1987లో కాంగ్రెస్ ప్రభుత్వం బొంబాయి కౌలు, వ్యవసాయ భూమి చట్టం - 1948లోని నిబంధనల్లో సెక్షన్ 2(6)ను ఎత్తివేసింది. ఈ సెక్షన్ ప్రకారం ఏ వ్యక్తి అయినా తమ వ్యవసాయ భూమిని ఎనిమిది కిలో మీటర్ల ఆవల నివాసముండే వ్యక్తులకు క్రయ విక్రయాలు జరిపేందుకు వీలుండదు. భూస్వాములకు ఈ నిబంధన రుచించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చట్టానికి తీసుకొచ్చిన కొత్త సవరణ ప్రకారం ఏ వ్యక్తి అయినా రాష్ట్రంలో ఎక్కడైనా వ్యవసాయ భూమిని కొనుగోలు చేయవచ్చు. ప్రారంభంలో దీనిని కరువు పీడిత ప్రాంతాల్లో మాత్రమే వర్తింపజేశారు. 1995లో దీనిని రాష్ట్రమంతటికి విస్తరింపజేసి అమల్జేశారు. దీనివల్ల స్థబ్దత వీడి చలనం వస్తుందనీ, పారిశ్రామికీకరణ పెరుగుతుందని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సవరణ చట్టాన్ని

సమర్థించుకుంది.

రెండోది, 1995లో బిజెపి ప్రభుత్వం బొంబాయి భూ రెవెన్యూ చట్టంలోని సెక్షన్ 65కు సవరణ చేసింది. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు బదలాయించేందుకు అవరోధంగా ఉన్న అన్ని నిబంధనలను ఈ ఒక్క సవరణతో బిజెపి తుడిచిపెట్టేసింది. 'ఇది విప్లవాత్మక చర్య' అని నాటి పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ మెహతా అభివర్ణించారు. ఏదేమైనా ఈ సవరణపై వెనువెంటనే గుజరాత్‌లో పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. పేద రైతుల చేతిలోని భూమిని గుంజేసుకొని వారిని భూమి లేని కూలీలుగా మార్చేసి మళ్లీ జమీందారి వ్యవస్థను పునరుద్ధరించేందుకు బిజెపి ప్రభుత్వం చేసిన ప్రయత్నంగా గుజరాత్‌లో భూసంస్కరణల మాజీ కమిషనర్ ఒకరు తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య సాగుభూమిని తగ్గించడమే గాకుండా గ్రామీణ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజల సంఖ్యను పెంచేలా చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. భూ బకాసురులు, బడా పారిశ్రామిక సంస్థలు వ్యవసాయ భూములను కాజేయకుండా అడ్డుగా ఉన్న అన్ని నిబంధనలను ఎత్తివేస్తూ అత్యంత వేగంగా ఈ సవరణ చేయడంలో బిజెపి ప్రభుత్వం వైఖరి పట్ల రాజకీయవేత్తలు, నిపుణులు విస్మయం వ్యక్తం చేశారని ద హిందూ పత్రిక ప్రతినిధి పేర్కొన్నారు. ఈ సవరణకు సంబంధించిన ముసాయిదా బిల్లును పంపిణీ చేసిన విధానం చూస్తే బిజెపి మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేసిన మొదటి రోజు నుంచే భూ బకాసురులు, వ్యాపార సంస్థల ఒత్తిళ్లకు తలొగ్గి బిల్లు రూపకల్పనకు కసరత్తు చేసినట్లు స్పష్టంగా తెలిసిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం భూముల కొనుగోలుకు సంబంధించిన అన్ని అడ్డంకులను ఎత్తివేస్తే రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో ఎన్నికల నిధుల కోసం బూరి విరాళాలు అందిస్తామని బడా పారిశ్రామిక వేత్తల నుంచి బిజెపి హామీ పొందినట్టు గ్రహించవచ్చు.

మూడోది, నూతన భూ విధానాన్ని 1996లో బిజెపి ప్రభుత్వం ఆమోదించింది. 1960, 1970 దశాబ్దాల్లో తీసుకొచ్చిన భూ సంస్కరణల లబ్ధిదారులందరికీ, బంజరు భూమి అభివృద్ధి పథకాల్లో ప్రయోజనం పొందినవారికీ నవీ సహరత్ (కొత్త నిబంధన) అనేదానిని తీసుకొచ్చారు. ఈ భూములు అమ్మడానికి వీలులేదు. అయితే కొత్త విధానం ప్రకారం 15 ఏళ్ల అనుభవంలోవున్న భూమిపై నవీ సహరత్ కలిగియున్న ప్రజలు దానిని జునీ సహరత్ (పాత నిబంధన)గా మార్చుకొని, ఆ భూమిని అమ్ముకునేందుకు లబ్ధిదారులకు అర్హత లభిస్తుంది. ఈ నిబంధనలో చేసిన మార్పులే ప్రస్తుతం నవీ సహరత్ కలిగియున్నవాళ్ల నుంచి పారిశ్రామిక పెద్దలు సులభంగా భూమిని కొనుగోలు చేసుకొని, దానిని వ్యవసాయేతర ప్రయోజనాలకు వినియోగించు కునేందుకు వీలు కల్పిస్తోంది. మోడీ ముఖ్యమంత్రి అయిన తర్వాత 2003లో ఈ భూవిధానాన్ని మరింతగా సరళీకృతం చేశారు. దీంతో అన్ని నవీ సహరత్ భూములు ఆటోమెటిక్‌గా తక్షణమే జునీ సహరత్ భూములుగా మారిపోయాయి. భూమి అమ్మేందుకు అవసరమైన అన్ని అనుమతులను అవసరం లేకుండా చేశారు.

> **"2005 సవరణ ద్వారా 46 లక్షల హెక్టార్లకు పైగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న బంజరు భూములను పరిశ్రమలు పెట్టేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టేందుకు బడా పారిశ్రామిక సంస్థలకు బదిలీ చేశారు. సాగు చేసేందుకు వీలుండే బంజరు భూములు ఎక్కడున్నా కార్పొరేట్ సాగు కోసం కట్టబెట్టేశారు."**



కనీస హక్కులకోసం సమ్మె చేస్తున్న టాటా మోటార్స్ కార్మికులు

నాలుగవది, గావ్‌ఛార్ భూమి లేదా గ్రామ ఉమ్మడి భూమిని, ఇతర అన్ని రకాల బంజరు భూములను వ్యవసాయేతర అవసరాల కోసం పరిశ్రమలకు అమ్మేందుకు 2005లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చేసింది. 2005 సవరణ ద్వారా 46 లక్షల హెక్టార్లకు పైగా ప్రభుత్వ నియంత్రణలో ఉన్న బంజరు భూములను పరిశ్రమలు పెట్టేందుకు, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశపెట్టేందుకు బడా పారిశ్రామిక సంస్థలకు బదిలీ చేశారు. సాగు చేసేందుకు వీలుండే బంజరు భూములు ఎక్కడున్నా కార్పొరేట్ సాగు కోసం కట్టబెట్టేశారు. ఇలా 20 సంవత్సరాల పాటు వినియోగించుకునేందుకు ఒక్కో పారిశ్రామిక వేత్తకు 2000 ఎకరాల వరకు దారాదత్తం చేశారు. అందునా మొదటి ఐదేళ్లు నయా పైసా కూడా లీజు చెల్లించనవసరం లేదు. మిగిలిన కాలానికి ఎకరానికి రూ.40 నుంచి రూ.100 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది.

ఈ విధంగా 1990ల, 2000ల మధ్య కాలంలో గుజరాత్‌లోని కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు రెండూ లక్షలాది హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ భూములను బడా పారిశ్రామిక సంస్థలకు అత్యంత చౌకగా కట్టబెట్టాయి.

2014లో గుజరాత్‌లో దాదాపు 60 ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్) కోసం సుమారుగా 27, 125 హెక్టార్ల భూమిని కొత్త భూ నిబంధనల ప్రకారం సేకరించారు. ఇక్కడ రెండు ముఖ్యమైన అంశాలు గమనించవచ్చు. మొదటిది, భూ సంస్కరణల కార్యక్రమంలో భాగంగా నిరుపేద వ్యవసాయ కూలీలకు, సన్నకారు రైతులకు కేటాయిస్తూ వచ్చిన భూమి పరిమాణాన్ని ఇలాంటి భూ విధానాలు గణనీయంగా తగ్గించేశాయి. రెండోది, ప్రయివేటు కార్పొరేట్ సంపద అభివృద్ధి కోసం వందలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సంపదను

> **"కొన్ని గ్రామాల్లో అయితే చదరపు మీటర్‌కు లీజు 19 సెంట్స్ లోపే ఉంది. ఇందులో మరో విస్మయకరమైన అంశమేమంటే పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూమిని అదానీ గ్రూప్ పూర్తిగా వినియోగించుకోకుండా ఇదే భూమిని పెద్ద మొత్తంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు చదరపు మీటరు 11 డాలర్లు చొప్పున సబ్ లీజుకు ఇచ్చింది."**



ఆదాని ముంద్రాసెజ్

దారాదత్తం చేశారు.

ఇలాంటి భూబదలాయింపుల ద్వారా సామాజిక లంచగొండితనంపై నికితా సుద్ ఈ విధంగా రాస్తారు : స్వేచ్ఛా మార్కెట్‌లో అందుబాటులో ఉంచేందుకు గుజరాత్‌లో భూములపై ప్రభుత్వ నియంత్రణలను పూర్తిగా ఎత్తివేశారు.

### క్రోనీ కేపిటలిజానికి పట్టం

గుజరాత్ ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు రాయితీలు, నజరానాలు కుమ్మరిస్తూ ఖజానాను గుల్ల చేయడం మాత్రమే కాక సామాజిక కేటాయింపులను పూర్తిగా తగ్గించివేసింది. పెట్టుబడిదారి విఫణిగా పేరు గాంచిన రాష్ట్రంలో దుర్మార్గమైన క్రోనీ కేపిటలిజం రూపంలో ఈ విధానాలను నిసిగ్గుగా ప్రోత్సహించారు. అన్ని స్థాయిల్లో భాగస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయి. గుజరాత్‌లో క్రోనీ కేపిటలిజం ఏ విధంగా అమల్జేశారంటే కొన్ని ఎంపిక చేసుకున్న పారిశ్రామిక సంస్థలు మాత్రమే అలవిమాలిన ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయం పొందాయి. అంతేకాదు తమ సొంత ప్రయోజనాల కోసం వ్యవస్థలను ఇష్టానుసారంగా వాడుకునేందుకు వీలుగా ఈ ఎంపిక చేసుకున్న పారిశ్రామిక సంస్థలకు అనుమతులు దఖలు పర్చారు.

మోడీ ఏలుబడిలో క్రోనీయిజానికి సంబంధించి మూడు ప్రధాన అంశాలు విస్తారంగా ప్రాచుర్యం పొందాయి. మొదటిది, గల్ఫ్ ఆఫ్ కచ్‌లోని సెజ్ కోసం ముంద్రాలో ఆదానీ గ్రూప్‌కు చెందిన భూమికి సంబంధించిన కేసు. 2000లలో ఆదానీ గ్రూప్ గుజరాత్ ప్రభుత్వం నుంచి 7000 హెక్టార్లకు పైగా భూమిని అత్యంత చౌకగా 30 ఏళ్ల పాటు లీజుకు పొందగలిగిందని ఫోర్బ్స్ మ్యాగజైన్ ఇటీవల వెల్లడించింది. ఇందులో ఎక్కువ మొత్తం నూతన భూ సంస్కరణ చట్టాల కింద గ్రామాల నుంచి సేకరించిన బంజరు భూమే కావడం గమనార్హం. ఒక చదరపు మీటర్‌కు 45 సెంట్స్ నుంచి ఒక డాలరు మధ్యనే అదానీ గ్రూప్‌కు లీజుకు ఇచ్చారు. కొన్ని గ్రామాల్లో అయితే చదరపు మీటర్‌కు లీజు 19 సెంట్స్ లోపే ఉంది. ఇందులో మరో విస్మయకరమైన అంశమేమంటే పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లీజుకు ఇచ్చిన భూమిని అదానీ గ్రూప్ పూర్తిగా వినియోగించుకోకుండా ఇదే భూమిని పెద్ద మొత్తంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు చదరపు మీటరు 11 డాలర్లు చొప్పున సబ్ లీజుకు ఇచ్చింది. ఇంకో మాటలో చెప్పాలంటే ప్రభుత్వ భూమిని దారాదత్తం చేయడంతో ఒక్కటే కాదు..ప్రభుత్వ ఆధీనంలోని భూములను ప్రయివేటుకు ఇచ్చి, దానిని మళ్లీ ప్రభుత్వ రంగ కంపెనీలే అత్యధిక ధరతో సబ్ లీజుకు తీసుకోవడం వల్ల ఖజనాకు కూడా భారీగా నష్టం వాటిల్లింది.

రెండోది, సింగూరు నుంచి సనంద్‌కు తరలించిన టాటా మోటార్స్ నానో ప్లాంటు కేసు: 2008లో ఈ ప్లాంటు సింగూరు నుంచి సనంద్‌కు తరలించిన నేపథ్యంలో లీక్ అయిన కేబినెట్ నోట్ ఒకటి విస్మయానికి గురి చేసింది. ఈ ప్లాంటు కోసం టాటా మోటార్స్‌కు ప్రభుత్వం ఎంత ఘనమైన విందు భోజనం తయారు చేసిందో ఆ నోట్ తేట తెల్లం చేసింది. లీక్ అయిన ఈ కేబినెట్ నోట్ నిజమైనదేనని నిర్ధారించడ కానీ, లేదా నకిలీదని కొట్టేయడం కానీ గుజరాత్ ప్రభుత్వం ఇప్పటికీ చేయలేదు.

ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వెలుగులోకి తీసుకొచ్చిన ఈ కేబినెట్ నోట్‌లో ఏముందంటే

– పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సింగూరు భూమిని టాటా మోటార్స్‌కు 90 ఏళ్లకు గ్రేడెడ్ లీజు రేటు ప్రాతిపదికన కేటాయించింది. అయితే సనంద్‌లో వెయ్యి ఎకరాల భూమిని మోడీ ప్రభుత్వం టాటా మోటార్స్‌కు అమ్మేసింది. ఈ మొత్తాన్ని టాటా మోటార్స్ ఎనిమిది విడతల్లో చెల్లించాలి. అంతేకాదు స్టాంప్ డ్యూటీ నుంచి, రిజిస్ట్రేషన్ ఛార్జీల నుంచి, భూ బదలాయింపు చార్జీల నుంచి కూడా టాటా మోటార్స్‌కు మినహాయింపు కల్పించారు.

– భూమి ధర చెల్లింపులో వెసులుబాటు కల్పిచండంతో పాటు, వార్షిక వడ్డీ 0.1 శాతం చొప్పున 20 ఏళ్లలో చెల్లించేలా టాటా మోటార్స్‌కు రూ. 9,570 కోట్ల రుణాన్ని గుజరాత్ ప్రభుత్వం అత్యంత ఉదారంగా అందజేసింది.

– పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కిలోవాట్ రూ. 3 చొప్పున విద్యుత్‌ను టాటా మోటార్స్‌కు అమ్ముతామని చెప్తే, విద్యుత్ ఛార్జీలను మొత్తం మినహాయించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని టాటా మోటార్స్ డిమాండ్ చేసింది.

– మొత్తం ఉద్యోగుల్లో 85 శాతం, 60 శాతం మంది మేనేజరియల్, సూపర్‌వైజరీ ఉద్యోగాలను స్థానికంగానే భర్తీ చేయాలని ప్రభుత్వం కోరగా తమకు అన్ని కార్మిక చట్టాల నుంచి మినహాయింపు ఇవ్వాలని టాటా మోటార్స్ గుజరాత్‌ను డిమాండ్ చేసింది.

– రాయితీ పొందిన సొమ్ములో 50 శాతాన్ని గుజరాత్‌లోనే పెట్టుబడి పెట్టాలనే నిబంధన నుంచి కూడా తమకు మినహాయింపు ఇవ్వాలని టాటా మోటార్స్ కోరింది.

– ఈ రాయితీలు టాటా మోటార్స్‌కు మాత్రమే 'ప్రత్యేక మినహాయింపులు'. మిగిలిన పారిశ్రామిక గ్రూపులు ఈ రాయితీలు పొందేందుకు అర్హత లేదు.

మూడోది, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (రిల్), ఎస్సార్ స్టీల్, అదానీ పవర్ లిమిటెడ్ (ఎపిఎల్) వంటి పారిశ్రామిక సంస్థలకు గుజరాత్ ప్రభుత్వం 'అనుచిత ప్రయోజనాలు' అందజేసిందంటూ 2012-13 కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదించడం.

– జామ్‌నగర్ నుంచి భరూచ్‌కు గ్యాస్ రవాణా చేసేందుకు 2007లో ప్రభుత్వ సంస్థ అయిన గుజరాత్ స్టేట్ పెట్రోనెట్ లిమిటెడ్ రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది.

– గ్యాస్ రవాణా చేసినందుకు గాను రిలయన్స్ నుంచి ఛార్జీలు వసూలు చేసే విషయంలో ఆ కంపెనీ యొక్క పైప్ లైన్ నెట్‌వర్క్‌లో ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా చేస్తే ఎంత ఛార్జీ వసూలు చేయాలనే నిర్దిష్టమైన అంశాన్ని నిబంధనల్లో చేర్చకపోవడంతో రిలయన్స్‌కు రూ.52.27 కోట్ల మేర అయాచిత లబ్ది చేకూరిందని కాగ్ తేల్చింది.

2007లోనే గుజరాత్ ప్రభుత్వానికి చెందిన గుజరాత్ ఉర్జ వికాస్ నిగమ్ లిమిటెడ్ అదానీ ప్రయివేటే లిమిటెడ్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ముంద్రాలోని అదానీ విద్యుత్ ప్రాజెక్టు నుంచి వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో పేర్కొన్న నిబంధనలకు కట్టుబడనందుకు అదానీ సంస్థ రూ.160.26 కోట్ల జరిమానా చెల్లించాలి. ఆ మొత్తాన్ని వసూలు చేయకుండా ప్రయివేటు సంస్థకు అయాచిత లబ్ది చేకూర్చినట్లు కాగ్ గుర్తించింది.

– సూరత్ జిల్లాలోని హజిరాలో 7,24,897 చదరపు మీటర్ల ప్రభుత్వ భూమిని ది ఎస్సార్ స్టీల్ కంపెనీ లిమిటెడ్ (ఇఎస్‌సిఎల్) ఆక్రమించింది. 2009లో ఇఎస్‌సిఎల్ విజ్ఞప్తి చేయడంతో ఆక్రమించిన ఈ భూమిని చదరపు మీటరుకు రూ.700 నిర్ధారిత విలువపై 2.5 రెట్లు లెవీ వసూలు చేసి ఇఎస్‌సిఎల్ ఆక్రమించుకున్న భూమిని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ చదరపు మీటరుకు నిర్ధారిత విలువ రూ.700 న్యాయసమ్మతంగా లేదని కాగ్ పేర్కొంది. దీనివల్ల స్వాధీనత ధర చాలా తగ్గిపోవడంతో ఇఎస్‌సిఎల్‌కు రూ. 238.50 కోట్ల మేర లబ్ది చేకూర్చినట్లు తెలిపింది.

> **"2013లో కాగ్ మరోమారు గుజరాత్ ప్రభుతాన్ని కడిగి పారేసింది. 2006-2009 మధ్య కాలంలో స్పాట్ ధరలతో గ్యాస్ కొనుగోలు చేసి ఆ గ్యాస్‌ను కొన్న ధర కంటే తక్కువకే అదానీ ఎనర్జీ (గుజరాత్) లిమిటెడ్‌కు తిరిగి అమ్మడాన్ని కాగ్ తీవ్రంగా తప్పుబట్టింది. దీనివల్ల అదానీ గ్రూప్‌కు రూ.70.54 కోట్ల మేర అయాచిత ప్రయోజనం చేకూరిందని తెలిపింది."**

– 2008లో ఫోర్డ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌కు రూ.205 కోట్ల విలువ చేసే 460 ఎకరాల భూమిని ఆటోమొబైల్ ప్రాజెక్టు కోసం చదరపు అడుగు రూ.1100కు కేటాయించారు. రాష్ట్ర స్థాయి అప్రూవల్ కమిటీ (ఎస్ఎల్ఎసి) ఈ విలువను కట్టింది. వాస్తవానికి రూ.వెయ్యి కోట్లు మించి పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులకు కేటాయించే భూముల విలువను నిర్ణయించే అధికారం ఎస్ఎల్ఎసికి లేదు. ఇదే విషయాన్ని కాగ్ ప్రస్తావిస్తూ ప్రయివేటు కంపెనీకి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తోందని తప్పుబట్టింది.

– 2008లోనే హజిరాలో లార్సన్ అండ్ టోబ్రో లిమిటెడ్‌కు ఒక స్టీమ్ జనరేషన్ ప్లాంటు కోసం 8,53,247 చదరపు మీటర్ల భూమిని కేటాయించారు. జిల్లా స్థాయి అప్రూవల్ కమిటీ (డిఎల్ఏసి) ఈ భూమి విలువను చదరపు మీటరుకు రూ.1000- రూ.1050 చొప్పున నిర్ణయించింది. అయితే 2008 ఫిబ్రవరిలో డిఎల్ఏసి నిర్ణయించిన ఈ విలువలో 30 శాతం రాయితీ ఇచ్చి రూ.700-రూ.735కే లార్సన్ సంస్థకు భూమి కేటాయించింది. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు రూ.60.66 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తేల్చింది.

– 2013లో కాగ్ మరోమారు గుజరాత్ ప్రభుతాన్ని కడిగిపారేసింది. 2006-2009 మధ్య కాలంలో స్పాట్ ధరలతో గ్యాస్ కొనుగోలు చేసి ఆ గ్యాస్‌ను కొన్న ధర కంటే తక్కువకే అదానీ ఎనర్జీ (గుజరాత్) లిమిటెడ్‌కు తిరిగి అమ్మడాన్ని కాగ్ తీవ్రంగా తప్పుబట్టింది. దీనివల్ల అదానీ గ్రూప్‌కు రూ.70.54 కోట్ల మేర అయాచిత ప్రయోజనం చేకూరిందని తెలిపింది.

ఈ విధంగా ఎంపిక చేసుకున్న కొన్ని కార్పొరేట్ సంస్థలతో అధికార యంత్రాంగం చేయి చేయి కలిపి తమకు నచ్చిన పారిశ్రామికాధిపతులకు లబ్ది చేకూరుస్తూ క్రోనీ కేపిటలిజాన్ని నిసిగ్గుగా అమల్జేస్తోంది. గుజరాత్‌లో బ్యూరోక్రాట్లు పక్కా వ్యాపారవేత్తలుగా వ్యవహరిస్తారని షా పేర్కొంటారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకురావడంతో సహా అనేక సందర్భాల్లో అధికారులు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసమే పనిచేస్తారు. కొన్ని కేసుల్లో మొదట గుజరాత్ ప్రభుత్వం పేరిట అనుమతులు పొంది ఆ తర్వాత ఆ అనుమతులను జాయింట్ సెక్టార్‌కు బదలాయిస్తారు. ఆ తర్వాత అనుమతులపై పూర్తి స్థాయి యాజమాన్య హక్కులను ప్రయివేటు పార్టీలకు బదలాయిస్తారని షా పేర్కొన్నారు. గుజరాత్ అభివృద్ధి నమూనా ప్రజా వ్యతిరేకమైనది. కార్పొరేట్లకు మాత్రమే ప్రయోజనం కలిగిస్తుంది.

**అనువాదం: బి అమరనారాయణ**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

మతోన్మాదం

# అర్ధరాత్రి అమానుషత్వం

**టి.కె. రాజలక్ష్మి**



రచయిత్రి
ప్రముఖపాత్రికేయురాలు

**గో**పరిరక్షణ పేరుతో జరుగుతున్న హత్యలు, సామూహిక అత్యాచారాలు, విధ్వంస కాండ హర్యానా లోని మేవత్ ప్రాంత స్వరూపం, అధిక సంఖ్యా నివాసితులైన మియో ప్రజా సమూహ భవిష్యత్తును మార్చుతున్నాయి.

డింగర్ హెరి గ్రామం హర్యానాలోని మేవత్ జిల్లాలో తౌరు తహసీల్‌లో ఉంది. ఆగస్టు 24వ తేదీ ఆ గ్రామం లోని పేద రైతు ఇబ్రహీం కుటుంబం పగటి పనుల నుండి సేద తీరింది. ఆ వెచ్చని రాత్రి ఇబ్రహీం, ఆయన భార్య రషీదా, ఇబ్రహీం బావ జఫ్రుద్దీన్, ఆయన భార్య ఆయేషా ఇబ్రహీం ఒంటి గది నివాసం ముందు ఆరు బయట మంచాల మీద పడుకొని ఉండగా ఆయన పిల్లలు, మేనకోడళ్ళు సమీనా, సాఫియా గదిలో నిద్రపోతున్నారు.

కాని ఇబ్రహీం, రషీదా ఆగస్టు 25వ తేదీ సూర్యోదయాన్ని చూడలేదు. అర్ధరాత్రి వారు ఊహించని అమానుషత్వానికి బలయ్యారు. దౌర్జన్యకారులు వారిని కొట్టే ముందు చేతులను కట్టివేశారు. ఆమె ముఖం మీద గుద్దిన గుద్దులతో ఆయేషా అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోగా, జఫ్రుద్దీన్ ప్రభుత్వ వైద్యశాలలో కోమాలో ఉన్నాడు. కుటుంబ యజమాని జూరిద్దీన్ ఆ రాత్రి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొలంలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

ఈ దాడి అర్ధరాత్రి 3 గం॥ల పాటు కొనసాగింది. ఇబ్రహీం మేన కోడళ్ళను – వారిలో ఒకరు మైనరు – ఇంటి నుండి బయటకు ఈడ్చి సామూహిక అత్యాచారం జరిపారు. "నేను మా మామ, అత్తల అరుపులు విన్నాను. తలుపు తియ్యమని నన్ను గట్టిగా బెదిరిస్తున్న గొంతులు విన్నాను. వాళ్ళు ఐదుగురి కంటే ఎక్కువ ఉండవచ్చు. వారిలో ఒకరి చేతిలో పార వుంది. 12 సం॥ల నవీద్‌ను కొడితే నా వైపు పరుగెత్తుకుంటూ వచ్చాడు. నా భర్త గురించి అడిగారు. ఈద్‌కి వస్తాడని చెప్పాను" అప్పుడు మీరు ఆవు మాంసం తింటారు అన్నారు. 'లేదు' అని చెప్పాను. 'మేము నీ కోసం ఈద్‌ను ఇప్పుడే జరుపుతాము' అని చెప్పారు. నేను పరుగెత్తటానికి ప్రయత్నించాను. నా 8 నెలల కుమారుడ్ని చంపుతామని మమ్మల్ని కొడుతూ, డబ్బు, నగలు అడగసాగారు. అక్కడ వారు దొంగిలించటానికి ఏమీ లేదు. దగ్గరలో ఉన్న మా బంధువు ఇంటిలోకి లాగి, బట్టలు విప్పి వారిలో నలుగురు మా మీద అత్యాచారం చేశారు. నా రహస్య భాగాలపై తన్నారు. నా పొట్ట నొప్పెట్టింది. మమ్మల్ని కొట్టిన దెబ్బలకు అరచిన అరుపులతో గొంతు ఎండిపోయింది. త్రాగటానికి నీరడిగితే మూత్రం ఇచ్చారు. వారిలో ఒకడు నలుగురిని చంపామని ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడటం విన్నాను" అని సమీనా చెప్పింది.

సూర్యోదయంతో గేదెలు అరుస్తుండటంతో ఇరుగు పొరుగు పిల్లలు ఏం జరిగిందో చూడటానికి పరుగెత్తారు. జూరుద్దీన్‌కు సమాచారమందించారు. తౌరు పోలీసు పోస్టుకు ఆడపిల్లలను తీసుకెళ్ళటంతో మరింత భాధాకరమైన పరిస్థితి ఎదురైంది. ఫ్రంట్‌లైన్‌కు అందిన వైద్య నివేదికను పరిశీలించగా అది తీవ్రమైన స్వభావమున్నదిగా కాక రూఢీ కాని (ఖచ్చితం కాని) అత్యాచార సూచనలున్నట్లుగా చాలా సాదాసీదాగా ఉంది. ఒకే వైద్యుడు ఒకే సమయంలో ఇద్దరు యువతులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లుగా ఉంది. జననాంగాలను మినహాయించి బాహ్య శరీర భాగాల మీద ఇచ్చిన గాయాల వివరాలు అత్యాచారం జరగలేదని నమ్మించటానికి ఇచ్చినట్లుగా ఉందని పేరు తెలుపని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి ఫ్రంట్‌లైన్‌తో చెప్పారు. పాఠశాల ధృవపత్రం మైనరు బాలిక వయస్సు 14 సం॥లు అని చెప్తుండగా వైద్య నివేదిక 16 సం॥లు అని చెప్తుంది.

తాను బ్రతికి వున్నానో లేదో చూడటానికి తన ముఖం మీద నీళ్ళు చల్లి మెడ నొక్కి పరీక్షించారని, తలపై 17 కుట్లు పడి దాడి నుండి బ్రతికి బయట పడిన ఆయేషా ఫ్రంట్‌లైన్‌తో చెప్పింది. 'నేను ఊపిరి పీల్చటం ఆపాను. చెయ్యి విరగ గొట్టారు. నా కూతురు సాఫియాపై అత్యాచారం జరిపారు. కొడుకులు నవీద్, పర్వేజ్‌లను కొట్టారు' అని ఆమె చెప్పింది.

ఈ సంఘటనతో సంబంధమున్న నలుగురు అరెస్టు చేయబడ్డారు. వారిలో ముగ్గురు పొరుగు గ్రామమైన మొహమ్మద్‌పూర్‌కి చెందిన గో రక్షణ కార్యకర్తలు. వారిలో ఇద్దరికి ఫేస్‌బుక్ స్క్రీన్ షాట్స్ ఉన్నాయి. వాటిలో ఒక దానిలో మతతత్వ సందేశం ఉంది. ఇంకొక వ్యక్తి తనను తాను ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తగా వర్ణించుకున్నాడు. కాని మొహమ్మద్‌పూర్ వాసులు ముద్దాయిలు వెనుకే ఉండి వారి విడుదలను కోరుతున్నారు. రాష్ట్ర పోలీసులు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడం లేదని, కేంద్ర దర్యాప్తు సంస్థ (సి.బి.ఐ) చేత విచారణ జరిపించాలని నూహ్ ప్రాంత బార్ అసోసియేషన్ కోరింది.

'పోలీసులు ముద్దాయిలను చొరబాటు దారులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. దానితోపాటు దోపిడీ, హత్య, హత్యాప్రయత్నం, అత్యాచార నేరాలను కూడా ముద్దాయిలపై మోపవలసిందిగా మేము ఆందోళన చేస్తున్నాము' అని నూహ్ బార్ అసోసియేషన్ పేర్కొంది. హత్య, అత్యాచారం అనుకోకుండా జరిగిన సంఘటనలు కావు. ఇది దొంగతనము కూడా కాదు. ఎందుకంటే ఆ కుటుంబం సంపద కూడబెట్టలేని పేద కుటుంబం. రాష్ట్రంలోనే తక్కువ నేర చరిత్ర కలిగినది ఆ ప్రాంతం. విచారకరంగా పరిమిత అవకాశాలున్నప్పటికీ ప్రజలు ప్రశాంత జీవనం గడుపుతున్న ఆ ప్రాంతంలో సమస్య సృష్టించడానికి చేసి ప్రయత్నమా?

నరేంద్ర మోది ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఆ ప్రాంతానికి యం.పి.గా ప్రాతినిధ్యం వహిస్తున్న రావ్ ఇంద్రజిత్ సింగ్ ఈ దాడిపై స్పందించలేదు. భారతీయ జనతా పార్టీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అత్యాచారం, హత్యలను తక్కువ చేసి మాట్లాడటం సెప్టెంబర్ 20న నిరసనలకు దారి తీసింది.

**మతతత్వ ఛాయలలో**

మియో ప్రజా సమూహం ఆరావళి పర్వత శ్రేణులలో హర్యానాలోని నూహ్ ప్రాంతం నుండి రాజస్థాన్‌లోని ఆల్వార్, భరత్‌పూర్ వరకు వ్యాపించి నివాసమేర్పరచుకొని జీవిస్తున్నారు. మానవ జాతులను అధ్యయనం చేసిన బ్రిటీష్ పాలకులు మియోలను జంతువుల మాంసాన్ని తినే, నేర సామాజిక తరగతులకు చెందిన వారుగా వర్ణించారు. (సూరజ్ భాన్ భరద్వాజ్) మేవత్ ఢిల్లీ, ఆగ్రాలకు దగ్గరలో ఢిల్లీ సుల్తానులకు చేరువలో ఉన్నఒక వ్యూహాత్మక ప్రదేశమని భరద్వాజ్ వ్రాశాడు. అలాగే ప్రస్తుత ఢిల్లీ పాలకులు కూడా మేవత్‌ను ప్రత్యేక కారణంతో

> **"హత్య, అత్యాచారం అనేవి చిన్న విషయాలని ఖట్టర్ విలేకరుల సమావేశంలో చెప్పి పరిస్థితిని మరింత విషమింప చేశాడు. ఈ వ్యాఖ్యలతో కోపోద్రిక్తులైన యువకులు ముఖ్య మంత్రి క్షమాపణ చెప్పాలని నూహ్ తహసీల్‌లోని జాతీయ రహదారిని అనేక గంటలపాటు దిగ్బంధించారు."**

లక్ష్యంగా ఎంచుకున్నారా?

ఇద్దరు యువకులు ఆవు మాంసాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని గో రక్షణ నాయకులు ఆరోపించి, వారిని కొట్టి ఆవు పేడ తినిపించారు. ఈ విషయం సెప్టెంబర్ 2వ తేదీ ఫ్రంట్ లైన్‌లో ప్రచురించబడింది. ఈద్‌కి కొన్ని రోజుల ముందు హర్యానా గో రక్షణ సమితి అధ్యక్షుడు భనీరామ్ మంగ్లా ఆజ్ఞల మీద పోలీసులు ఆహార తనిఖీ అధికారులు లేకుండా మియోలు అధికంగా ఉండే ఢిల్లీ-గుర్‌గావ్-ఆల్వార్ హైవే లోని ఫుడ్ స్టాల్స్ మీద మెరుపు దాడి నిర్వహించి దాదాపు 24 స్టాల్స్ నుండి బిర్యాని శాంపిల్స్ సేకరించారు. దాదాపు 36 ఇళ్ళను లూటీ చేసి ధ్వంసం చేశారు.

బక్రీదుకు ముందు జంట హత్యలు, సామూహిక అత్యాచార ఘటనలు జరిగాయి. ఈ మూడు వరుస సంఘటనలు యధాలాపంగా తటస్థించినవి కావు. "వారు ఇక్కడి ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీశారు. దాదాపు 100 కుటుంబాలు రోజు వారీ కూలీలకు, ట్రక్కు డ్రైవర్లకు తక్కువ ధరలకు బిర్యానీ అమ్ముకొని జీవిస్తున్నాయి. ఆవు అనేది ఒక సాకు. ఆర్థికంగా మమ్మల్ని దెబ్బతీయాలనేదే వారి ఆలోచన" అని ఫిరోజ్ పూర్ ఝిర్కా తహసిల్ వాసి ఆసఫ్‌ఖాన్ చెప్పారు. షాపులన్నీ ధ్వంసం చేయబడ్డాయి. గుర్‌గావ్ లోని సోహ్నా నుండి ఫిరోజ్‌పూర్ ఝిర్కా వరకు 100కిపైగా కియోస్క్‌లు నాశనం చేయబడ్డాయి.

మాంసాన్ని వండిన తరువాత ఏ జంతు మాంసమో గుర్తించటం కష్టమని రాష్ట్ర ప్రభుత్వంలో ఒక సీనియర్ అధికారి చెప్పారు. కల్తీ కనుక జరిగితే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే నమూనాలు సేకరించాలని, అన్నంలో బీఫ్ ఉందని అనుమానం వస్తే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలి. అయితే పోలీసులు తమంతట తాము నమూనాలు సేకరించే అధికారం లేదని పౌర అధికారి సమక్షంలో నమూనాలు సేకరించవచ్చని ఆ అధికారి చెప్పారు. మేవత్‌లోని పున్హానాకు చెందిన ఆవు కమిషన్ అధ్యక్షుడు అయిన మంగ్లా కొంత కాలంగా ఈ ప్రాంతంలో ఆవు రాజకీయాల మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న విషయం అందరికీ తెలుసు. గో సేవా సమితి అధ్యక్షుడిగా ఆయనను అకారణంగా నియమించలేదు.

పోలీసు దాడుల గురించి ప్రశ్నలు తలెత్తినపుడు ముఖ్యమంత్రి వాటిని అనధికారికమైనవిగా చెప్పారు. ఇది మసిపూసి మారేడు కాయ చేయటమే. దింగర్‌హేరిలో జరిగిన హత్య, సామూహిక అత్యాచార సంఘటనలపై పెల్లుబికిన కోపోద్రిక్తతల నుండి ప్రజల ఆలోచన మళ్ళించడానికి 'బిర్యాని' సంఘటనను ఉద్దేశ్యపూర్వకంగా సృష్టించారని యూనస్‌ఖాన్ అనే న్యాయవాది చెప్పారు.

హత్య, అత్యాచారం అనేవి చిన్న విషయాలని ఖట్టర్ విలేకరుల సమావేశంలో చెప్పి పరిస్థితిని మరింత విషమింప చేశాడు. ఈ వ్యాఖ్యలతో కోపోద్రిక్తులైన యువకులు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని నూహ్ తహసీల్ లోని జాతీయ రహదారిని అనేక గంటలపాటు దిగ్బంధించారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలలో ఒక్క భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) మాత్రమే తన నిరసన వ్యక్తం చేయడం గమనార్హం. పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రజిత్ సింగ్ మేవత్‌లో జరిగిన పరిణామాలపై ఆందోళనను వ్యక్తం చేస్తూ ఈ ప్రాంతంలో మతతత్వ ఘటనలను ఎప్పుడూ వినలేదని చెప్పారు. అంతే కాకుండా బాబ్రీ మసీదు కూల్చినప్పుడు తమ పార్టీ ఆధ్వర్యంలో ఒక కమిటీ మేవత్‌ను సందర్శించినప్పుడు అక్కడి ప్రజలు దాని గురించి పెద్దగా పట్టించుకోలేదని ఆయన గుర్తు చేశారు.

మేవత్ హర్యానాలో మిశ్రమ సంస్కృతికి ప్రతీక అని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రస్తుత ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిన నూర్ మహ్మద్ చెప్పారు.

**రక్షకులే దౌర్జన్యకారులుగా**

రాజస్థాన్‌లోని మేవత్ ప్రాంతంలో ఉన్న ఆల్వార్‌లోని రఘునాథ్‌గర్ నివాస ప్రాంతం లోని జాతీయ రహదారి పొడవునా మతతత్వ దాడి కొనసాగి రాజస్థాన్‌లోని మేవత్ ప్రాంతం లోని ఆల్వాల్‌లో రఘునాథ్‌ఘర్ గ్రామంలో చిందింది. ఈద్ తర్వాత రోజు సెప్టెంబర్ 14న పోలీసులు గోవధ జరిగిందనే అనుమానంతో అర్ధరాత్రి నుండి మరుసటి రోజు ఉదయం వరకు దాడులు నిర్వహించి 36 ఆవుల కళేబరాలను కొనుగొన్న తీరు అనుమానాస్పదంగా వుంది. పోలీసులు స్థానిక శివసేన, భజరంగ్‌దళ్ కార్యకర్తలతో వచ్చారని గ్రామస్థులు చెబుతున్నారు. పసికందులు చేతులలో ఉన్న మహిళలతో సహా ఎవరినీ వదల లేదు. పురుషులందరూ దగ్గరలో ఉన్న పొలాలలోకి పరుగెత్తగా మహిళలు, పిల్లలపై దౌర్జన్యం చేసి ఇళ్ళలోని వస్తువులను వీలైనంత దోచుకొని, మిగతా వాటిని ధ్వంసం చేశారు. దాదాపు 36 ఇళ్ళు దోపిడీకి గురయ్యాయి. ఫ్రంట్‌లైన్ సెప్టెంబర్ 18న ఆ ప్రాంతాన్ని సందర్శించినపుడు మహి ళలు చాలా భయపడిపోయినట్లు కనిపించారు. కొంత మంది తమ గాయాలను కూడా చూపించారు. పోలీసులు పశువులను చెదర గొట్టారు. ఆ ప్రాంతంలో త్రాగునీటికి మూల మైన బోర్‌వెల్‌ను కూడా పాడు చేశారు. "మనుషులకు, జంతువులకు కూడా నీళ్ళు లేకుండా చేశారు" అని కొల్లగొట్టబడిన దుకాణ యజమాని షరీఫా చెప్పాడు.

ఈద్ రోజు ఆవులను బలిచ్చి, పాతిపెట్టినట్లుగా తమకు సమాచారం అందిందని పోలీసులు చెప్పారు. బలి ఇచ్చిన జంతువుల మాంసాన్ని పంచి పెట్టడం సాంప్రదాయం అని, పూడ్చి పెట్టరని, ఈ ప్రచారం నవ్వు తెప్పించే విధంగా వుందని స్థానికులు చెప్తున్నారు. "పోలీసులు టీ షర్ట్స్, నిక్కర్లు ధరించిన కొంత మందితో కలిసి వచ్చారు. వారు మమ్మల్ని దూషించి, తుపాకి మడమలతో కొట్టి మా మగవారిని తీసుకు పోయారు. కారణం అడిగితే మమ్మల్ని కొట్టారు" అని వారు కొట్టిన దెబ్బలకు నడుము వంగి పోయిన 70 సం॥ల రహెమాన్ చెప్పాడు.

అదే రోజు బి.జె.పి యం.యల్.ఏ గ్యాన్‌దేవ్ అహుసా భజరంగ్‌దళ్, శివసేన కార్యకర్తలతో కలిసి సంఘటనా స్థలానికి మోటారు సైకిళ్ళపై వచ్చారని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రత్యక్ష సాక్షి తెలియచేశారు. ఇదే వ్యక్తులు రెండు రోజులపాటు రఘునాథ్‌గర్ బజార్ బంద్‌లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ముక్తానంద్ అగర్వాల్ స్పందిస్తూ ఫిర్యాదు అందగానే జరిగిన సంఘటనలపై ఎస్పీ విచారణ మొదలు పెట్టారని, విచారణలో ఏమైనా అదనంగా తెలితే చర్య తీసుకోబడుతుందని చెప్పారు. ఆ దమనకాండలో పోలీసులు తమ

(మిగతా 35వ పేజీలో)

# ఉమ్మడి పౌరస్మృతి ముస్లింలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు

**సందేహాలు సమాధానాలు**



- బి.వి.రాఘవులు

**తెలంగాణ రాష్ట్రానికి 31 జిల్లాలు ఏర్పర్చడం పరిపాలనను సులభతరం చేసుకోవడానికని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుగారి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర సమితి (తె.రా.స.) ప్రజలకు చెబుతున్నది.**

**కానీ దీనివల్ల ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్, ఇతర అధికారులు అధికంగా పెరుగుతారు. అందువల్ల ఇది బ్యూరోక్రాట్ పాలనగా మారుతుంది. పరిపాలనలో బ్యూరోక్రాట్స్ ప్రజలకు బాధ్యులుగా ఉండరు. కాబట్టి తెలంగాణ రాష్ట్రం బహిరంగ బ్యూరోక్రాట్ పాలనకు ప్రయోగశాల అవుతుంది కదా!**

**– ఇలిపిళ్ళ సూర్యనారాయణ, విజయవాడ**

తెలంగాణలోని 10 జిల్లాలను రాష్ట్ర ప్రభుత్వం విభజించింది. పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజలచెంతకు పాలనను తీసుకుపోవడానికి, వెనకబడిన మండలాలు, గ్రామాలు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి జేసేందుకు జిల్లాల విభజన తోడ్పడుతుందని అందరూ భావించారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు సిపిఐ (ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటి ప్రభుత్వ ఆలోచనను స్వాగతించింది. అదే సందర్భంలో జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగాలని, సంకుచిత, స్వార్థపర రాజకీయ ప్రయోజనాలకు తావు లేకుండా నిర్ణయాలు జరగాలని కోరింది. ప్రభుత్వం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో తన అభిప్రాయాలను స్పష్టం జేసింది. అయితే ప్రభుత్వం జిల్లాలను ఏర్పాటు చేసిన తీరు, పాలనా యంత్రాంగాన్ని సిద్ధం జేస్తున్న తీరు అనేక విమర్శలకు తావిచ్చింది. ప్రభుత్వ వ్యవహార సరళి అనుకున్న ప్రయోజనాలను సాధిస్తుందా పరిపాలనా సౌలభ్యం కాకుండా, గందరగోళానికి దారితీస్తుందా అన్న అనుమానాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఏమైనా 31 జిల్లాలు వాస్తవ రూపుదాల్చాయి కాబట్టి, కొత్త వ్యవస్థ ప్రజలకు ఉపయోగ పడేట్టు కృషి జేయడం, లోపాలను ఎండగట్టి పాలన ప్రజల దగ్గరకు చేరేట్టు పోరాడటం పార్టీ యొక్క కర్తవ్యం. ప్రస్తుతం పార్టీ నాయకత్వాన రాష్ట్రంలో జరుగుతున్న మహాపాదయాత్ర కొత్త పాలనా వ్యవస్థ తీరు తెన్నుల గురించి, ప్రజల స్పందన గురించి అర్థం జేసుకోవడానికి తోడ్పడుతుంది. యాత్ర ద్వారా పొందిన ప్రజాభిప్రాయాల కనుగుణంగా పాలనలో మార్పుల కోసం పార్టీ పోరాడుతుంది.

<u>కార్యకర్తల నుండి వచ్చిన ప్రశ్నలు:</u>

**బిజెపి ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నది. దీనిని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై మనపార్టీ వైఖరి ఏమిటి?**

**మూడుసార్లు తలాక్ చెప్పి భార్యకు విడాకులివ్వటాన్ని ఇస్లాం అనుమతిస్తున్నదని, ఇది అన్యాయమైన విధానం అని, ఇందువలన ముస్లిం మహిళలకు అన్యాయం జరుగుతుందని, దీనిని రద్దుచేయాలని బిజెపి నాయకులు, మంత్రులు చెబుతున్నారు. కాని వీరు హిందూ మహిళలకు జరుగుతున్న అన్యాయాల గురించి పెదవి విప్పటం లేదు. ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలలో నిజాయితీ ఉందా?**

మనదేశంలో ఇస్లాం మత సంప్రదాయానుసారంగా త్రిపుల్ తలాక్‌ను ముస్లింలు అనుసరిస్తున్నారని ఇస్లాం మత పెద్దలు చెబుతున్నారు. ప్రపంచంలోని అనేక ఇస్లామిక్ దేశాలలో త్రిపుల్ తలాక్ పద్ధతి లేదు. అందువలన ఇస్లామిక్ సంప్రదాయం పేరుతో అన్యాయమైన, స్త్రీ వ్యతిరేకమైన త్రిపుల్ తలాక్ పద్ధతి ఉండకూడదని అందుకే సిపిఐ(ఎం) స్పష్టంగా చెబుతున్నది.

బిజెపి ప్రభుత్వం త్రిపుల్ తలాక్ సమస్యపై చర్చ పేరుతో, ఉమ్మడి పౌరస్మృతి సమస్యను దుర్బుద్ధితో ముందుకు తెస్తున్నది. సంక్లిష్టమైన ఉమ్మడి పౌరస్మృతి సమస్యను ఒక్క ముస్లింలకు సంబంధించి సమస్యగా చిత్రీకరించి మహిళల పట్ల అసమానతలు ఇంకే మత సాంప్రదాయంలో లేనట్లు చిత్రీకరిస్తున్నది.

సిపిఐ (ఎం) త్రిపుల్ తలాక్ సమస్యను, ఉమ్మడి పౌరస్మృతి సమస్యలను కలగా పులగం జేయకూడదని. మొదటి సమస్యపై కోర్టులు, ముస్లిం పర్సనల్‌లా బోర్డులు వెంటనే నిర్ణయం తీసుకోవాలని, ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి అన్ని పర్సనల్ లాస్‌లోని మహిళా వ్యతిరేక అంశాలను పరిశీలించిన తర్వాత, విస్తృత చర్చ తర్వాత నిర్ణయాలకు రావాలని భావిస్తున్నది. ఇందుకు సంబంధించి శ్రీమతి బృందాకారత్ గారు రాసిన వ్యాసం పార్టీ వైఖరిని అర్థం జేసుకునేందుకు ఉపయోగపడుతుంది.

**కాశ్మీర్‌లో ఆందోళన ప్రారంభమై నాలుగు మాసాలు పూర్తి కావస్తున్నది. కేంద్ర ప్రభుత్వం పాలనా పరమైన చర్యలకే పరిమితమవుతున్నది మినహా కాశ్మీర్ ప్రజలను విశ్వాసంలోకి తీసుకొని సమస్యను పరిష్కరించటానికి పూనుకోవటం లేదు. కాశ్మీర్ ప్రజలలో క్రమంగా వేర్పాటువాద భావాలు బలపడుతున్నాయి. ఇటువంటి స్థితిలో కాశ్మీర్ సమస్యను పరిష్కరించటం, అక్కడ శాంతిని నెలకొల్పటం ఏ విధంగా సాధ్యం అవుతుంది?**

కాశ్మీర్ సమస్య రోజురోజు క్లిష్టంగా మారుతున్న విషయాన్ని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. బిజెపి అధికారానికి వచ్చిన తర్వాత, దాని తప్పుడు విధానాల మూలంగా పరిస్థితి ఇంకా క్షీణించింది.

బిజెపి కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ సమస్యకు, పాకిస్తాన్‌తో మనకున్న సమస్యలకు వ్యత్యాసం లేకుండా, రెండింటినీ కలగాపులగం జేసి బుద్ధిపూర్వకంగానే గందరగోళం జేస్తున్నది. దేశంలోకి చొరబడి కిరాతకంగా మారణకాండకు పాల్పడే ఉగ్రవాదులకు, సామాన్య కాశ్మీర్ ప్రజలకు వ్యత్యాసం లేకుండా వ్యవహరిస్తున్నది. కాశ్మీర్ సమస్యను శాంతి భద్రతల సమస్యగా పరిమితం చేస్తున్నది. ప్రతిపక్షాల ఒత్తిడి మూలంగా ఈమధ్య కొన్ని కంటి తుడుపు ప్రకటనలు చేసినప్పటికి వాటిలో ఏ మాత్రం చిత్తశుద్ధి కన్పించడం లేదు.

దేశసమైక్యతను, లౌకిక వ్యవస్థను ప్రేమించే వారెవరైనా బిజెపి ప్రభుత్వం ప్రమాదకర వైఖరిని వదులుకునేలా ద్విగుణీత కృషి జేయాల్సిఉంది. సిపిఐ(ఎం) వామపక్షాలు శక్తి మేరకు అటువంటి ప్రయత్నాలు జేస్తున్నాయి.

### సవరణ

అక్టోబర్ సంచికలో పార్టీ కేంద్రకమిటీ సభ్యులు యస్. వీరయ్య గారు పార్టీ పొలిట్ బ్యూరోసభ్యునిగా పొరపాటుగా వ్రాయడం జరిగింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాం

# కామ్రేడ్ అన్నే వెంకటేశ్వరరావు

(2వ పేజి తరువాయి)

కోయంబత్తూరు జైలుకు పంపారు. ఆ సమయం లోనే ఆయన భార్య అనసూయను నందిగామ జైలులో పెట్టారు. చిన్నారులైన వారి కుమార్తె కల్పన, కుమారుడు రవి రెండేళ్లపాటు తల్లితోపాటే జైలులో ఉన్నారు. తనతోపాటే బిడ్డలు కూడా ఉండాలని అనసూయ పోలీసులతో పోరాడి నందువల్ల బిడ్డలిద్దరినీ ఆమెతోపాటు జైలులోనే ఉంచారు.

అన్నేను ఆ తరువాత కోయంబత్తూరు నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలుకు మార్చారు. కొంతకాలం తరువాత ఆయన.. నర్రా ఆంజనే యులు, బస్వారెడ్డి శంకరయ్య, ముక్కామల నాగభూషణంతో కలిసి జైలు నుంచి తప్పించు కున్నారు. మరలా ఏడాదికే ఆయనను పోలీసులు అరెస్టు చేసి సేలం జైలులో పెట్టారు. 1949లో సేలం జైలులో కమ్యూనిస్టు కన్విక్టులపై పోలీసులు కాల్పులు జరిపి 22 మందిని పొట్టనబెట్టు కున్నారు. ఆ సందర్భంగా జరిగిన లాఠీఛార్జిలో అన్నే తీవ్రంగా గాయపడ్డారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేయడంతో నాయకులం దరితోపాటు అన్నే కూడా జైలు నుంచి విడుద లయ్యారు. తొలి సాధారణ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల పక్షాన చురుగ్గా పనిచేశారు.

కొల్లేరులో భూస్వాములు దోపిడీని అంతం చేయాలని, కొల్లేరు పేదలు సేద్యం చేస్తున్న బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని, పర్మినెంట్ జోన్‌లో చేర్చాలని రైతు సంఘం చేసిన పోరాటాలన్నిటా పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఆయనపై భూస్వాములు హత్యా ప్రయత్నం చేశారు. ఆ ఉద్యమాల్లోనే ఓసారి పాముకాటుకు గురై మృత్యుముఖం నుంచి తప్పించుకోగలిగారు. కొల్లేటి బంజరుకు స్థానిక పేదలకు పట్టాలు, దాళ్వాకు నీటి హక్కు, సేద్యా నికి ఇంజిన్లు, పరపతి సౌకర్యం కోరుతూ అనేక పోరాటాలు నిర్వహించారు. అప్పటి కలెక్టర్ గ్విన్‌కు పిటిషన్లు ఇచ్చి కొల్లేటికి రప్పించారు. ఆయన సమక్షంలో భూస్వాములకు వ్యతిరేకంగా పేదల పక్షాన అన్నే చేసిన వాదనను సమర్థిస్తూ భూములను వదులుకోవాలని కలెక్టర్ భూస్వాములకు సూచించారు. అయితే కాంగ్రెస్ మంత్రి కల్లూరి చంద్రమౌళికి సన్నిహితుడైన భూస్వామి ప్రభుత్వం నుంచి తనకు అనుకూలం గా ఆర్డరు తెచ్చుకున్నాడు. చివరికి పేదలను సమీకరించి పెద్దఎత్తున పోరాడిన ఫలితంగా పత్తికోళ్లలంక, గుడివాకలంక భూస్వాముల పెత్తనం అంతమైంది. మోతేవారిలంకకు చెందిన 200 ఎకరాల భూమి కోసం కూడా ఆయన అనేక పోరాటాలు చేశారు.

1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలిక తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైపు వచ్చారు. ఈ పార్టీ వైపు వచ్చిన అనేక మంది నేతలను ప్రభుత్వం అరెస్టు చేయించినప్పుడు అన్నేను చెంచల్‌గూడ జైలులో నిర్బంధించారు. రెండేళ్ల తరువాత విడుద లయ్యారు. తరువాత ఆయన నక్సలిజంపైపు మొగ్గారు. ఈ సమయం లోనూ ఆయనను జైల్లో పెట్టారు. కొద్దికాలంలోనే ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విధానమే సరయినదని అర్థం చేసుకున్నారు. తిరిగి మళ్లీ ఆ పార్టీలో చేరి అప్పట్నించి రైతు, వ్యవసాయ కార్మికోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. ఏలూరు తాలూకాలోని పంగిడి గూడెం రిజర్వు ఫారెస్టును డి-ఫారెస్టు చేసి ఆక్రమణదారులైన స్థానిక పేదలకు భూములు పంచాలని దీర్ఘకాల పోరాటం చేశారు. పోరాట ఫలితంగా మూడు వేల ఎకరాలకుపైగా పేదల కు పంచిపెట్టారు. అయ్యపరాజుగూడెం బంజరు భూమి పోరాటం చేసి 700 ఎకరాలు పేదలకు పట్టాలు సాధించి పెట్టారు. కొండలరావుపాలెం, విజయరాయి, బాపిరాజుగూడెం, భీమడోలు, ద్వారకా తిరుమల, పాములవారిగూడెం తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల ఫారెస్టు, ప్రభుత్వ బంజరు భూములు పేదలకు దక్కేలా పోరాటాలు చేశారు. ఉంగుటూరు ప్రాంతంలోని మూడు వేల ఎకరాల అటవీ భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ జరిగిన పోరాటానికి నేతృత్వం వహించారు. భూ పోరాటాలేగాక వ్యవసాయ కార్మికులతో సమ్మెలు చేయించి కూలిరేట్ల పెంపుదలకూ కృషి చేశారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)లో ఆయన వివిధ బాధ్యతలను నిర్వహించారు. ఏలూరు డివిజన్ పార్టీ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడుగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడుగా, రాష్ట్ర కమిటీ సభ్యుడుగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఆయన తన ప్రజా జీవనంలో మొత్తం 12 సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించారు. మరణానికి కొద్ది సంవత్సరాలు ముందు మినహా 65 సంవత్సరాలకు పైగా ఆయన తానెత్తిన ఎర్రజెండాను సమున్నతంగా నిలిపారు. కుటుంబ ఇబ్బందులు, శత్రువుల దౌర్జ న్యాలు ఎన్ని ఎదురైనా ధీరోదాత్తంగా ఎదుర్కొని, అత్యున్నత విలువలతో అప్రతిహతంగా ముందుకుసాగారు. ఆయన సతీమణి కామ్రేడ్ అనసూయ వివాహం కాకపూర్వమే కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు. వయోవృద్ధురాలైన ఆ ధీర వనిత నేటికీ మార్క్సిస్టు పార్టీపై అచంచల విశ్వా సంతో పనిచేస్తున్నారు. అన్నే దంపతుల అన్యోన్య, ఆదర్శ వంతమైన జీవితం కమ్యూనిస్టు ఉద్యమం లో ఎందరినో ఎంతగానో ప్రభావితం చేసింది.

# అర్ధరాత్రి అమానుషత్వం

(33వ పేజీ తరువాయి)

పాత్రేమీ లేదంటూ కొట్టిపారేశారు.

పోలీసులకు వ్యతిరేకంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి నివాసితులు భయపడ్డారు. అలాంటి ధైర్యం చేస్తే నుగువా ప్రాంత పోలీసులు లాకప్ చేస్తారేమోనని తాము భయపడ్డామని చెప్పారు. 'వారికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తే కోపంతో మా మీదకు వస్తారు" అని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు.

"పోలీసులు గ్రామం మీద దాడి చేయడం తరచుగా జరుగుతూ ఉంటుంది. కాని ఈ తరహా విధ్వంసకాండ కొత్త. పోలీసులు తరచుగా జనాన్ని పట్టుకెళ్తూ ఉంటారు. వారిని క్షమించాల్సిన అవసరం లేదు. ఇక్కడి జనం సామాన్యులు, పేదవారు. దీనికి తోడు వారికి ఇప్పుడు భయం కూడా తోడయింది" అని అధిక సంఖ్యాక వర్గ సభ్యుడొకరు చెప్పారు.

ఆ గ్రామంలో ఏకైక మియో విద్యావంతుడు, ఢిల్లీలో పని చేసిన షాహిద్‌ఖాన్ దర్యాప్తు నిష్పాక్షికంగా జరపాలని కోరాడు. అమాయకులు, కుటుంబ పోషకులు అరెస్టు చేయబడ్డారు. అంతేకాదు, రఘునాథ్‌గర్‌లో పరిస్థితులు ఇంతకు ముందులాగా ఉండబోవేమోనని ఆయన భయపడుతున్నారు. ఢిల్లీ సుల్తాన్ రాజ్యాన్ని పునఃప్రతిష్టించడానికి బాబర్‌కు వ్యతిరేకంగా ఇబ్రహీం లోడి పక్షాన హసన్‌ఖాన్ మేవతి అనే ప్రముఖ వ్యక్తి పోరాడిన విషయం చారిత్రకమైనది. మియోలు ఇస్లాంలోకి మారిన చివరి ప్రజా సమూహం. వారు ఇప్పటికీ ఆయన సాంస్కృతిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని కొనసాగిస్తున్నారు.

మీడియాలోని కొన్ని తరగతులు, కొంతమంది రాజకీయ నాయకులు మేవత్‌ను "మిని పాకిస్థాన్" అని పిలుస్తుండటం వారికి కోపం కలిగిస్తుంది.

హర్యానాలో 'మియోలు ఏం ముస్లింలు, జాట్‌లు ఏం హిందువులు" అనే సామెత ఉ ంది. దీని అర్థం మియోలకు, జాట్‌లకు ఎలాంటి ప్రత్యేక మతగుర్తింపు లేదని దాని అర్థం. ప్రజలను మత ప్రాతిపదికన సమీకరించటానికి, ఈ సంఘటనలు కొనసాగించటానికి అనుమతించితే పాత సామెతే కాదు, ఈ ప్రాంతమే పెను మార్పులకు గురికావచ్చనే భీతిగొల్పుతుంది.

**అనువాదం: పి. అనంతలక్ష్మి**

# అక్టోబరు విప్లవం యొక్క అంతర్జాతీయ ప్రభావం



**జెవి స్టాలిన్**

"అక్టోబరు విప్లవం జాతీయస్థాయిలో మాత్రమే ప్రభావం కలిగించినది కాదు. అది ప్రాథమికంగా అంతర్జాతీయ, ప్రపంచ విప్లవ స్వభావం కలిగినది. ప్రపంచ మానవాళి చరిత్ర పాత పద్ధతి నుండి మౌలికమైన నూతన పద్ధతికి మార్పు చెందటాన్ని సూచిస్తుంది.

"ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ఒకముఠా దోపిడీదార్ల స్థానంలో మరోముఠా దోపిడీదార్లు రావటంతో సాధారణంగా గత విప్లవాలు ముగిసిపోయేవి. దోపిడీదార్లు మారేవారు. దోపిడీ మాత్రం కొనసాగుతుండేది. బానిసల విప్లవాలు కొనసాగుతున్న కాలంలో, అర్ధ బానిసల విప్లవాలు కొనసాగుతున్న కాలంలో, పారిశ్రామిక, వ్యాపార బూర్జువాల విప్లవాలు కొనసాగుతున్న కాలంలో అదీ పరిస్థితి. అక్టోబరు విప్లవం ఈ విప్లవాలతో మౌలికంగా భిన్నమైనది. ఒక విధమైన దోపిడి స్థానంలో మరో విధమైన దోపిడిని తీసుకురావటం, ఒకముఠా దోపిడీదార్ల స్థానంలో మరోముఠా దోపిడీదార్లను తీసుకురావటం దాని లక్ష్యం కాదు. మనిషిని మనిషి దోపిడిచేసే అని విధాలైన దోపిడీని అంతం చేయటం, అన్ని ముఠాల దోపిడీదార్లను అధికారం నుండి కూలద్రోయటం, దోపిడీకి గురవుతున్న వర్గాలన్నింటిలోకి అత్యంత విప్లవకరమైన, అత్యంత నిర్మాణయుతంగా ఉన్న శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పటం దాని లక్ష్యం.

"ఈ కారణం వలననే అక్టోబరు విప్లవ విజయం ప్రపంచ వ్యాపితంగా దోపిడీకి గురవుతున్న ప్రజల ఆర్థిక, రాజకీయ అంశాలలో, జీవన పరిస్థితులలో, ఆచారాలు, అలవాట్లు, సాంప్రదాయాలలో, సంస్కృతిలో, మొత్తం మేధోపరమైన అంశాలలో తీవ్రమైన మార్పులను తీసుకువచ్చింది. అన్ని దేశాలలోని అణచివేయబడుతున్న వర్గాలు అక్టోబరు విప్లవం పట్ల అపరిమితమైన సానుభూతిని చూయించటానికి అది మౌలికమైన కారణం. వారు తమ విముక్తికి దానినొక వాగ్దానంగా పరిగణిస్తున్నారు.

"అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారి వ్యవస్థ పాలన నుండి కమ్యూనిజం పాలన వైపుకు మార్పుకు అక్టోబరు విప్లవం చిహ్నం. ప్రపంచ సామ్రాజ్యవాదుల కూటమిలో అక్టోబరు విప్లవం గండికొట్టిందని మనం తరచుగా చెబుతుంటాం. దాని అర్థం ఏమిటి? శ్రామికవర్గ విప్లవాల ప్రారంభం, శ్రామికవర్గ నియంతృత్వాల యుగానికి అది నాందీ ప్రస్తావన చేసిందని అర్థం.

"శ్రామికవర్గం పోరాటాలతో వ్యవస్థను కంపింపచేసే శక్తిగా వ్యవహరించటం, దోపిడి వర్గం విప్లవ ఫలాలను స్వంతం చేసుకొనే సాధారణ బూర్జువా విప్లవాల యుగం అంతరించింది. పెట్టుబడిదారీ దేశాలలో శ్రామికవర్గ విప్లవాల యుగం ప్రారంభమైంది.

"వలస దేశాలు, సామ్రాజ్యవాదులపై ఆధారపడివున్న దేశాలలో విముక్తి విప్లవాల యుగాన్ని అక్టోబరు విప్లవం ప్రారంభించింది. సామ్రాజ్యవాదం అణచివేస్తున్న ప్రజలను విముక్తి చేయకపోతే శ్రామికవర్గం తనను తాను విముక్తి చేసుకోలేదు. అభివృద్ధి చెందిన దేశాలలోని శ్రామికవర్గ విప్లవాలు వలస దేశాలలోని వలస వ్యతిరేక పోరాటాలు యునైటెడ్ ఫ్రంట్‌గా ఏర్పడాలి. సామ్రాజ్యవాదంపై ఆధారపడిన దేశాలను, వలస దేశాలను శాంతియుతంగా దోపిడిచేసే యుగం అంతరించింది.

"వలస దేశాలలో విముక్తి పోరాటాల యుగం, ఈ దేశాలలోని శ్రామికవర్గం చైతన్యవంతం అవుతున్న యుగం, అది ఆధిపత్యం వహించే యుగం ప్రారంభమైంది.

"మరెన్నడూ కోలుకోలేని విధంగా ప్రపంచ సామ్రాజ్యవాదాన్ని అక్టోబరు విప్లవం చావుదెబ్బ కొట్టింది. అక్టోబరు విప్లవానికి ముందున్న సమతూకాన్ని, స్థిరత్వాన్ని సామ్రాజ్యవాదం తిరిగి ఎన్నటికీ సాధించలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరంగా ఉండే యుగం అంతరించింది. పెట్టుబడిదారీ వ్యవస్థ క్షీణించిపోయే యుగం ప్రారంభమైంది.

"అక్టోబరు విప్లవం మార్క్సిజానికి సైద్ధాంతిక విజయం."

**(స్టాలిన్ 1927లో రాసిన "ది ఇంటర్నేషనల్ క్యారెక్టర్ ఆఫ్ ది అక్టోబర్ రివల్యూషన్ " వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది.)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.6. Published on November, 2016